
ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్



# యుగశక్తి  గాయత్రి



ఓం వందే భగవతీం దేవీం శ్రీరామంచ జగద్గురుం
పాదపద్మే తయోః శ్రిత్వా ప్రణమామి ముహుర్ముహుః

ప్రఖర ప్రజ్ఞ — సజల శ్రద్ధ


సంకల్పం - సంరక్షణ
వేదమూర్తి, తపోనిష్ఠ, పండిత
**శ్రీరామ శర్మ ఆచార్య**
శక్తి స్వరూపిణి
**మాతా భగవతీ దేవి శర్మ**

ప్రధాన సంపాదకులు
డాక్టర్ ప్రణవ్ పండ్యా
సంపాదక మండలి
**కందర్ప రామచంద్ర రావు**
**ప్రొఫెసర్ మారెళ్ల శ్రీరామకృష్ణ**
**డాక్టర్ తుమ్మూరి**
**సి.వి. శ్యామల రావు**
**డి.వి.ఆర్. మూర్తి**

సంపుటి 9 - సంచిక 8
డిసెంబర్ 2008

(జనవరి 2009 నుండి)
**విడిప్రతి రూ॥ 10.00**
**సం॥ చందా రూ॥ 110**
**3 సం॥ చందా రూ॥ 310**
**10 సం॥ చందా రూ॥ 1050**

Please send drafts in favour of
**SRI VEDAMATA GAYATRI TRUST BUSINESS DIVISION, HYDERABAD**

సలహాలు, సూచనలకు :
శ్రీ అశ్విని సుబ్బారావు
040-23700722


## పవిత్రతయే పాలసముద్రం

మానవుడు జీవన వ్యాపారంలో తన్నుతానే మోసంచేసికొంటున్నాడు. పూజ, ప్రార్థన, హారతి మొదలైన బాహ్యోపచారాలు చేస్తూ తన దరిద్రమంతా దూరమై పోతుందని భావిస్తున్నాడు. భగవంతుని పేరు చెప్పుకొని లాటరీ టిక్కెట్టు కొంటున్నాడు. ఆరోజు నుండి ఇంటికప్పు వైపు చూస్తూ శయనిస్తున్నాడు. ఎప్పుడో కప్పును బ్రద్దలు చేసికొని ధనరాసులు ప్రవేశిస్తాయని ఆశలు పెంచుకుంటున్నాడు. ఆపూజలు చేయడానికి కూడ తీరికదొరకకపోతే డబ్బులిచ్చి ఇతరుల చేత చేయించుకుంటున్నాడు. అంతేకాని తాను చేసిన, చేస్తున్న భూతవర్తమాన దోషాలను జ్ఞప్తికి తెచ్చుకోడు. భగవంతుడు తనపై వరాలవర్షం కురిపిస్తాడన్న భ్రమలోనే మునిగి తేలుతున్నాడు. ఇదంతా భయంకరమైన పీడకల. ఒకరకంగా చెప్పాలంటే ఆత్మవంచన. ఆతని దృష్టిలో భగవంతుడు ఒక అమాయకుడు. కొంచం ప్రార్థన చేస్తే చాలు, పనులు చేసి పెడతాడు. ఇదేవిధంగా ఆలోచిస్తాడే తప్ప తన అంతరంగాన్ని శుద్ధి చేసికోవాలన్న ప్రయత్నం చెయ్యనే చెయ్యడు. పవిత్రమైన హృదయానికే పరమాత్ముడు ప్రాధాన్యతనిస్తాడు. పవిత్రహృదయంలోనే పరమానందంగా పవ్వళిస్తాడు. పవిత్ర హృదయంకలవారికే వరాల వర్షం కురిపిస్తాడు.

ఈ ధర్మాన్ని తెలుసుకున్న వ్యక్తి మొట్టమొదట అంతరంగాన్ని పవిత్రం చేసికుంటాడు. దయాశీలుడైన భగవంతుడు నిర్మల మనస్కుడైన భక్తుని కాపాడే మార్గాన్నే వెతుకుతుంటాడు. భక్తుని పురాకృత కర్మలను, పాపాలను తన పైకి తీసికుంటాడు. ఆతని పాపాల కష్టనిష్ఠురాలను తాను సహిస్తూ భక్తుని ఉన్నత స్థితికి తీసికొనిపోతాడు. కానీ ఒకే ఒక షరతు విధిస్తాడు. "నిశ్చల భావంతో తన్ను తాను సమర్పించుకోవాలి." తెలిసి తెలియక చేసిన తప్పుల్ని సరిదిద్దుకోవాలని ఆశిస్తాడు. అటువంటివారికే భగవంతుని కృప అందుతుంది. దాని ద్వార సత్కర్మలు చేయగలుగుతాడు. భగవంతుని కృప సత్కర్మలు కలసి వ్యక్తి యొక్క ఆత్మిక ప్రగతికి దోహదం చేస్తాయి. కృష్ణపరమాత్మ గీతలో– "పాపకార్యాలే జీవితంగా కొనసాగించిన మహాపాపి కూడ నన్ను శరణుకోరినట్లైతే ఆతని పాపాలన్నీ సముద్రంలో విసరివేయబడతాయి" (4/35). ఆత్మమార్గంలో సంచరించే వ్యక్తి జ్ఞాన ప్రాప్తికోసం ప్రయత్నిస్తూనే ఉంటాడు. సంపాదించిన జ్ఞాన జ్యోతుల్ని హృదయంలో ప్రజ్వలింప చేసికుంటాడు. ఈ అధ్యాత్మ రహస్యాన్ని తెలిసికున్న వాడు వ్యర్థమైన పనులజోలికి పోడు. చేసిన ప్రతిపనినీ మానవతా దృక్పథంలో చేస్తుంటాడు. దీనిని సమత్వ దృష్టితో అర్థం చేసికోవడంలోనే మానవునికి మేలుకలుగుతుంది.


పాలసముద్రంవంటి పవిత్రహృదయంలో పరమాత్ముడైన శేషశాయి హాయిగా నిద్రిస్తాడు. హృదయాన్ని పవిత్రం చేసికో.

★★★

**పదే పదే పరుల దోషాలను ఎంచకు - వానినే స్మరించకు పదే పదే.**

# విషయ సూచిక


1. **సంపాదకీయం**
   పవిత్రతయే పాలసముద్రం 1
2. **విషయ సూచిక** 2
3. **సద్గురు వచనామృతం**
   కళాత్మకంగా జీవించు 2
4. **వేద మంత్రం :** ప్రవహిస్తూ ఉండాలి ధనం 3
5. **వర్తమాన భారతం**
   మృదువైన బాల్యాన్ని కాటువేస్తోంది టెక్నాలజీ సర్పం 4
6. **ముఖచిత్ర కథనం :** విశ్వగురువు-శ్రీ దత్తాత్రేయుడు 7
7. **ధారావాహిక : హనుమత్ కథామృతం-9**
   నామకరణ మహోత్సవం 11
8. **తత్వచింతన**
   మానవ అంతరంగంలో నిక్షిప్తమైన రెండు దివ్యశక్తులు 13
9. **ధారావాహిక : భక్తి గాథ-14**
   సంయమనం భక్తికి అనివార్యం 15
10. **బోధకథ :** నిజమైన తీర్థయాత్ర 17
11. **ధారావాహిక : దేవసంస్కృతి సౌరభం-19**
    దర్శనాలలోని వైరుధ్యాలు 18
12. **ప్రత్యేక వ్యాసం : గీతాజయంతి**
    యోగత్రయం - మన సంకల్పం 20
13. **ధారావాహిక : గాయత్రీ మహావిజ్ఞానం-37**
    బిందు సాధన 21
14. **ధారావాహిక : దివ్యజీవన దర్శనం-57**
    సరికొత్త వెలుగులో-3 24
15. **మహిళా జాగరణ :** వీరనారి పొణకా కనకమ్మ 27
16. **ధారావాహిక : నా స్మృతిపథంలో గురుదేవులు-28**
    గురుదేవులు ఇచ్చిన భరోసా 30
17. **ప్రత్యేక వ్యాసం : రమణజయంతి**
    కంచిమీదుగా నా అరుణాచలయాత్ర-1 32
18. **గంగాజలం - వైజ్ఞానికత** 36
19. **పవిత్రమైన మనస్సే సౌందర్యానికి పునాది** 37
20. **మనం-మన ఆరోగ్యం :** ఆహారం-1 39
21. **గురుదేవుల అమృతవాణి** 41
22. **ఆచరణలో అధ్యాత్మ :** బహుళార్థ సాధకం-ఉదారత 45
23. **సద్గురులీలామృతం :** వారొక అద్వితీయ శక్తిపాతం మరువలేని అనుభూతి 46
22. **వార్తలు** 47

# సద్గురు వచనామృతం

## కళాత్మకంగా జీవించు

జీవించడం ఒక కళ. ఈ మాట పలువురికి విచిత్రంగా కనిపిస్తుంది. కాని ఇది పచ్చి నిజం. జీవించే కళ తెలియని వ్యక్తులు, జీవితాన్ని కళాత్మకమైన కర్తవ్యంగా పరిగణించని వ్యక్తులు సక్రమంగా జీవించలేరు.

జీవితాన్ని వివిధ ఉపకరణాలతో అలంకరించడం కళ అని కొందరు భావిస్తారు. అయితే, బాహ్యమైన సాధనలద్వారా జీవితాన్ని సింగారించుకోవడం కళ కాదు. అది మనిషిలోని లిప్స, వాంఛ. దాన్ని పూర్తి చేయడంలో మనిషికి నకిలీ సంతోషం కలుగుతుంది. ఫలితంగా- తాను సక్రమంగా జీవిస్తున్నానని అతడు భావిస్తాడు. వాస్తవానికి కళ ఒక మానసిక ప్రవృత్తి. ఆ ప్రవృత్తి ఆధారంగా సాధన సంపత్తి కొరవడినా జీవితాన్ని అందంగా గడపవచ్చు. జీవితంలోని ప్రతి గడియలోనూ నవ్వుతూ తుళ్లుతూ గడపడం కళ. ఏడుస్తూ, విసుక్కుంటూ గడపడం కళారాహిత్యం, కళ లోపించడం.

సాధన సంపత్తి ఉన్నా లేకున్నా, సంపద ఉన్నా ఆపదలు ఎదురైనా- ఆయా స్థితులకు అనుగుణమూ, ఆవశ్యకమూ అయిన కార్యశూరతను ప్రదర్శిస్తూ, సహజంగా, సరళంగా, సంతృప్తిగా, ఆశా ఉత్సాహాలతో, ప్రశాంతంగా, స్థిరంగా సంతోషాన్నీ విషాదాన్నీ తగువిధంగా తట్టుకుంటూ సాగిపోవడమే కళాపూరిత జీవితం. దాన్ని పొందడం శ్రేయస్కరం, సార్థకం, సుఖదాయకం.

★★★

## పండుగలు

**డిసెంబరు 2008**

| | |
|---|---|
| **9** | గీతా జయంతి |
| **12** | దత్తాత్రేయ జయంతి |
| **25** | క్రిస్మస్ |

**జనవరి 2009**

| | |
|---|---|
| **12** | వివేకానంద జయంతి |
| **23** | నేతాజీ జయంతి |
| **26** | గణతంత్ర దినోత్సవం |
| **31** | శ్రీవసంత పంచమి |

సదాచార భవనం కట్టాలంటే - పునాదిలోపెట్టు సద్భావనలుంటే.

వేద మంత్రం

# ప్రవహిస్తూ ఉండాలి ధనం

**న వా ఉ దేవాః క్షుధమిద్వధం దదురుతాశిముప గచ్ఛన్తి మృత్యవః ।**
**ఉతో రయిః పృణతో నోప దస్యత్యుతా ప్రణన్మార్డితారం న విందతే ॥**

**(ఋగ్వేదం 10/117/1)**

**భావార్థం :** ధనం యొక్క ఉపయోగం దుఃఖితుల లేమిని దూరం చేయటం. దీనికోసం అది ఎప్పుడూ ప్రవహిస్తూఉండాలి. లోభి, ప్రోగుచేసేవాడు, దానం చేయనివారు ఎప్పుడూ కష్టాలు పొందుతూనే ఉంటారు. భయం, అనుమానం కలుగుతాయి. కాబట్టి తమ అవసరాలు తీరగా మిగిలిన ధనాన్ని సమాజానికి ఇచ్చివేయాలి.

**సందేశం :** ఆకలి ఆకలి అన్నివేళలా ఆకలే! ఎన్ని రకాల ఆకలి వేధిస్తుందో మనం చెప్పలేము. కడుపు నింపుకునేందుకు భోజనం చాలదు, ధన సంపదల ఆకలి. పదవీ ప్రతిష్ఠల ఆకలి. ఇంద్రియాల ఆకలి. అహంకారపు ఆకలి. ఇది ఎంతకూ శమించదు. ప్రపంచంలో ఉన్నవాటిన్నిటిపైనా తన అధికారం ఉండాలి అనే వ్యాకులత. ఈ విధంగా ప్రోగుచేసుకోవాలనే ప్రవృత్తి గల స్వార్థ వ్యక్తి ఎప్పుడూ కష్టాలు పొందుతాడు. ధన సంపాదనలో, దానిని పెంచటంలో, దానిని రక్షించటంలో, వ్యయం చేయటంలో, మనుష్యుడు చాలా ఎక్కువ శ్రమ చేయవలసివస్తుంది. ప్రతి వ్యక్తి గురించీ భయము, చింత, భ్రమ, ధన సంపాదనలో దుఃఖం, సంపాదించినది రక్షించుకోవటంలో దుఃఖం. అది నశిస్తుంటే దుఃఖం. ఖర్చవుతుంటే దుఃఖం. అన్ని విధాలుగా ధనం దుఃఖ కారణమే అవుతున్నది.

ధనం యొక్క ఉపయోగం సంగ్రహించటంలో కాక దాని సదుపయోగంలో ఉన్నది. తన ఆకలిని శాంతింపచేసుకొని మిగిలిన దానిని సమాజానికి అర్పించటంలోనే ధనం యొక్క సార్థకత ఉన్నది. త్యాగ పూర్వకంగా అనుభవించుమని వేదం యొక్క ఆదేశం. మొదట ఇతరులకు తినిపించి తర్వాత నీవు తిను. మనం ఒంటరివాళ్లం కాము. మన జీవితం సమస్తం సమాజంతో ముడిపడి ఉన్నది. మనం సమాజానికీ, దేశానికీ ఋణపడి ఉన్నాం, దానిని తీర్చుకోవాలి. ఈ తథ్యం అర్థమైతే, ఇతరులకు దానమిస్తే ధనం తగ్గిపోతుందనే మనసులోని భయం సమాప్తమవుతుంది. మనం ఎవరికి దానమిస్తున్నామో అతడు మన యొక్క అంశయే. 'ఆత్మవత్ సర్వభూతేషు'. ఆ దానంతో ఒక ఆవశ్యకత నెరవేరుతుంది. దాని వల్ల మనకు ఉన్నతి కలుగుతుంది. చివరకు అది మన వ్యక్తిగత సుఖాన్ని పెంచుతుంది. ధన వృద్ధి కూడా జరుగుతుంది. ఏ వ్యక్తి ఇతరులకు అవసరమైన సమయంలో సహాయం చేస్తాడో, అతనికి అవసరమైనపుడు ఉదారపూర్వక ఈశ్వరీయ సహకారం ప్రాప్తిస్తుంది.

కృపణుడు, లోభి సమాజం నుండి విడివడి ఏకాకులుగా ఉంటారు. వారికి మిత్రులు ఎవరూ ఉండరు, వారికి సహాయం చేయాలని ఎవరూ అనుకోరు. మనుష్యుడు ధన సంగ్రహంలో సదా నిమగ్నుడై ఉండాల్సిన అవసరం లేదు. ముఖ్యంగా కావలసినవి జ్ఞానం, బలం, సుఖం, సౌహార్ద్రం, ప్రేమ. ఆకలిగొన్న వారికి, కడుపు నిండిన వారికి సమయానికే మృత్యువు వస్తుందనేది ఒక వాస్తవం. కాని భేదమేమంటే– దానమిచ్చేవారికి అమూల్య ప్రాణప్రదమైన సంపత్తులు లభిస్తాయి, అతని ధనము తగ్గిపోదు. కానీ అలా చేయని వారు వీటి నుండి వంచించబడి సుఖం లేకుండా, మృతులవలె సంకుచిత జీవనం గడుపుతారు.

పవిత్ర ఆత్మబలం ఉన్నవారే దానం ఇవ్వగలరు.

★★★

నిర్మలంగా మనసుంటే - ఎన్ని తీర్థ స్థలాలో సరిగ్గా చూసుకుంటే.

వర్తమాన భారతం

# మృదువైన బాల్యాన్ని కాటువేస్తోంది టెక్నాలజీ సర్పం

## బాల్యం పాలిట దుష్టమాష్టారు

ఈనాటి పిల్లలను గమనిస్తూ ఉంటే మనకు మన బాల్యం కండ్లముందర కదలాడుతూ ఉంటుంది. చిన్నతనంలో చదువుతో పాటు ఆడుకున్న ఆటలు, అమ్మమ్మ-నానమ్మల దగ్గర విన్న కథలు గుర్తుకు వస్తూ ఉంటాయి. 50-60 ఏండ్ల క్రిందటి విషయాలు మనస్సును పులకింపచేస్తూ ఉంటాయి. 40 సంవత్సరాల క్రితం వరకు అదే పరిస్థితి ఉండేది. ఉమ్మడి కుటుంబాలు ఉండేవి. ఎక్కడో ఒకచోట తండ్రికి ట్రాన్స్‌ఫర్ అయితే తప్ప ఇతర గ్రామాలకు వెళ్లేవారు కారు. అలాంటి పరిస్థితుల్లో నూతన ప్రదేశాలలో, నూతన వ్యక్తులతో, నూతన మిత్రులతో పరిచయాలు పెంచుకునేవారు. వారినుండి నూతన విషయాలపై మార్గదర్శనం లభించేది. జీవితం ఉల్లాసంగా గడిచిపోయేది.

కాని ఇప్పుడు? చిన్నారుల వీపులపై మోయలేని పుస్తకాల బరువు. ఇది మొట్టమొదటి శిక్ష. పుస్తకాల బరువును ఈడ్చుకుంటూ ఇల్లు చేరగానే తేనెపూసిన కత్తిలాంటి అప్రత్యక్ష శత్రువు ఎదురుచూస్తూ ఉంటాడు. రంగుల హస్తాలు చాచి రకరకాల ఆటపాటలతో ఆకర్షిస్తూ ఉంటాడు. అదే మన రంగుల పెట్టె టి.వి. ఒక్క మాటలో చెప్పాలంటే పిల్లలపాలిటి దుష్టమాష్టారు.

## టెక్నాలజీ గుప్పిట్లో బాల్యం

టి.వి.లో ఒకటికాదు. పదికాదు. 300లకుపైగా ఛానల్స్ వస్తూ ఉంటాయి. బడినుండి వచ్చీరాగానే టి.వి.కి అతుక్కు పోతారు. ఏం చూస్తారో, ఏం చేస్తారో వారికే అర్థం కాని పరిస్థితి. ఇది కాక ఈ ఎలక్ట్రానిక్ యుగంలో మొబైల్ ఫోను, కంప్యూటర్, వీడియో గేమ్స్ మొదలైన దుష్ట గ్రహాలు పిల్లలను చుట్టిముట్టి వేస్తున్నాయి. ఈ స్థితిలో వారు ఒంటరితనాన్నే కోరుకుంటున్నారు. ఒకరకంగా ఆలోచిస్తే ఈనాటి బాల్యం టెక్నాలజీకి దాస్యం చేస్తోంది. వారికి అమ్మమ్మ, నానమ్మ, తాతల దగ్గర కూర్చుని కబుర్లు చెప్పుకోవడానికి 10 నిమిషాలు టైమ్ దొరకడం లేదు. మూడువంతుల కుటుంబాలలో పెద్దవాళ్లే దొరకడంలేదు. పల్లెలు, పట్టణాలు ఎక్కడ చూచినా ఇదే పరిస్థితి. నీతి నియమాలను నేర్పించే కథలు దొరకడం లేదు. చివరకు పాఠ్యపుస్తకాల్లో కూడ నీతికథలు లభించడంలేదు. గతంలో పిల్లలు ఆడుకొన్నట్లు ఆడుకోవడానికి అనుకూలమైన ఆట స్థలాలు కూడ లభ్యంకావడం లేదు. పట్టణాలుకాదు. ఇప్పుడు పిల్లలే 'హైటెక్' అయిపోతున్నారు అనడంలో అతిశయోక్తి లేదు. నూతన టెక్నాలజీకి తల్లిదండ్రులే అంకితమైపోతున్నప్పుడు పిల్లలు కావడంలో ఆశ్చర్యం ఏముంది? ఈనాడు గృహాలన్నీ ఆఫీసులుగా మారిపోతున్నాయి. పిల్లలుకూడ వాటికే ఆకర్షింపబడుతున్నారు. హాయిగా తిని తిరగాల్సిన వయస్సులో వయస్సుకు మించిన ఆకర్షణలకు లోనవుతున్నారు.

## భావనాత్మక వికాసం కుంటుపడుతోంది

పిల్లలు ప్రియమైన బాల్యాన్ని కోల్పోతున్నారు. సంస్కృతిని అందించే కథలు, జోలపాటలు పూర్తిగా కనుమరుగై పోయాయి. వాటి స్థానంలో సెల్‌ఫోన్, కంప్యూటర్, వీడియోగేమ్, కార్టూన్‌షో మొదలైనవి తిష్ఠవేసికొని కూర్చున్నాయి. వీటన్నింటి కారణంగా పిల్లలు అన్ని విషయాలలో అవసరానికి ముందే పరిపక్వత చెందుతున్నారు. ఈ నష్టాన్ని తుడిచివేయడం ఎవరి వశమూ కావడంలేదు. వయస్సులో మాత్రమే చిన్నవారు. కాని బుద్ధిపరంగా చూచినట్లైతే చాలా చురుకుగా తయారవుతున్నారు. కుట్రలు, కుతంత్రాలలో కూడ ఏమాత్రం తీసిపోవడంలేదు. టి.వి. లో చూచిన ఘట్టాలను వాస్తవంగా ప్రయోగింప చూస్తున్నారు. 24గంటలు వారికి అదే ఆలోచన. మానసిక శాస్త్రవేత్తల దృష్టిలో ఇది సరిఅయిన వికాసం కాదు. ఈ వికాసం మూలంగా అసలైన వికాసం ఆగిపోతుంది. దానివలన వారి జీవితాలు ఆపదలో చిక్కుకుంటాయి. తట్టుకోలేని మానసిక సంఘర్షణ మొదలవుతుంది. ఒక్కొక్కసారి ఏది మంచో, ఏది చెడో తేల్చుకోలేని స్థితిలో వెర్రెత్తి పోతున్నారు. టెక్నాలజీ బాలల కోమలభావాలను చాపక్రింద నీరులా తడిపివేస్తున్నది.

టెక్నాలజీ ఒక దోపిడీ దొంగ. అది బాల్యంలోని మృదుత్వాన్ని అపహరించివేస్తోంది. బాలల జీవితం ఒక యంత్రంలాగ మారిపోతున్నది. ఈరోజు చిన్న చిన్న పిల్లలే పెద్దపెద్ద అపరాధాలు చేస్తున్నారు. టీనేజి విద్యార్థి తండ్రిపిస్తోలును తీసికొని వెళ్లి తోటి విద్యార్థిని చంపివేశాడు. ఇటువంటి విషయాలను మనం కలలో కూడ ఊహించిఎరుగం. కాని ఇప్పుడు జరుగుతున్న మాట వాస్తవం.

దేవుడిస్తే పుచ్చుకున్నావు దేహాన్ని - పుచ్చుకుని వీడవెందుకు మోహాన్ని.

సెక్స్ విషయంలో కూడ పిల్లలు వయస్సును మించి ఆలోచిస్తున్నారు. ఊహాలోకాలలో తేలిపోతున్నారు. వారి కలలను పండించేందుకు టీవీ ఛానల్స్, ఇంటర్నెట్ దృశ్యాలు, పోర్నోగ్రఫీ శక్తి వంచన లేకుండ సహకరిస్తున్నాయి. ఈ ప్రమాద ఘంటికను వినిపించుకునే నాథుడేలేడు. దీనిని ఆదిలోనే అంతం చేయకపోతే భావి తరాలస్థితిగతులు ఊహా తీతం. ఇంటర్నెట్ సమాచార సౌకర్యాన్ని, విద్యాబోధనను కొనసాగిస్తున్నదనే భావిస్తున్నాం. కాని దాని మాటున జరుగుతున్న అనర్థాన్ని అర్థం చేసికోవడం లేదు.

## 'రియాల్టీ షో' మేకవన్నె పులి

మరొక్క ప్రమాదకరమైన దంధా 'రియాల్టీ షో'. అదృష్టం పేరు మీద అనేకానేక కంపెనీలు ఎస్.ఎమ్.ఎస్‌లను ప్రవేశపెట్టాయి. ఇవి సామాన్య మానవుని జేబులను కనపడకుండా కత్తిరిస్తున్నాయి. అత్యంత తెలివిగా, అంచెలవారీగా ధనాన్ని గుంజుకుంటున్నాయి. సామాన్యుల కడుపుకొట్టి కోట్లకు పడగలెత్తుతున్నాయి. అయినా జనాలకు కనువిప్పు కలగడంలేదు. చిన్నారుల పాకెట్ మనీ అంతా వారి బొక్కసాలకు చేరుకుంటున్నది.

చిన్నపిల్లల సంగీత– నృత్యాల పోటీలు, పెద్దల కార్యక్రమాలతో సమ ఉజ్జీగా అనేక ఛానల్సు నిర్వహిస్తున్నాయి. ఇవన్నీ ధన సంపాదనకు పన్నిన వలలే కానివేరుకాదు. వ్యాపార దృష్టితో నిర్వహించే ఈ కార్యక్రమాలలో "ప్రతిభావికాసం" అనేది లేనే లేదు. భావిపౌరుల ప్రతిభా పాటవాలను కూడ మార్కెట్లో వేలం వేస్తున్నారు. ఈ కార్యక్రమాలను కూడ ఆధారంగా చేసికొని అనేక రకాల ఎస్.ఎమ్.ఎస్‌లు నడిపిస్తున్నారు. మితిమీరిన బహుమతులు, మితిమీరిన ప్రచారం నడుస్తుండడంతో పోటీతత్వం పెరిగిపోతున్నది. దానితో ఓడిన బాలబాలికలు అవమానభారంతో కుంచించుక పోతున్నారు. అసూయా ద్వేషాలతో రగిలిపోతున్నారు. బలహీనమనస్తత్వం గలవారు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. నిత్యం కనిపించే ఈ విషయాలు నాయకులదృష్టికి రావడంలేదు. కారణం అన్నింటిలో వారి ప్రమేయమే ఉంటుంది. పురాస్కారాల మీది పేరాశతో తల్లిదండ్రులు చిన్నపిల్లలచేత అలివిమాలిన శ్రమను చేయిస్తున్నారు. వారి శక్తిని, వయస్సును పట్టించుకోవడమే లేదు. తమ బిడ్డల ముఖాలు టి.విలో చూచుకుని మురిసిపోయేవారి సంఖ్య విరివిగా పెరిగిపోయింది. దానికోసం ఎంత మూల్యాన్నైనా చెల్లించడానికి వెనుకాడడం లేదు. అందుకే 'సూర్య బాల' అనే కథాకారుడు ఒక కథలో "ఈ కార్యక్రమాలు బాలబాలికల స్వీయభావాలను చంపివేస్తున్నాయి." అన్నాడు.

## కావాలని ఏర్చికూర్చిన షడ్యంత్రం

ఒకసారి పోటీ కార్యక్రమాల్లో ఒక బాలిక నిర్వాహకుల చేతిలో దెబ్బలు తినవలసి వచ్చింది. ఫలితంగా హాస్పటల్లో చేర్చాల్సి వచ్చింది. నిజం చెప్పాలంటే ఈ రోజుల్లో బాల్యం బజారులో వేలం వేయబడుతోంది. 'సింజినీ' అనే బాలిక ఇదేస్థితిలో షాక్‌లో పడిపోయింది. చివరకు మాటను కోల్పోయింది. ఢిల్లీలోని ప్రసిద్ధ విలేఖరి కుమారుడు హాస్టలుకు వెళ్లనని ఎదురు తిరిగాడు. కారణం ఏమిటంటే వారంరోజుల్లో ఒక టి.వి. ఛానల్ 'రియాల్టీ షో'కు పోటీ పరీక్ష పెడుతోంది. దానిలో పాల్గొనాలని అతని కోరిక. తండ్రి ఏదోవిధంగా నచ్చచెప్పి పంపించాడు. కాని తరువాత పశ్చాత్తాప పడ్డాడు. కుమారునికి ఉచితంగా సంగీతం నేర్పించాలంటే ముందుగా ఈ పోటీలో పాల్గొని తీరాలి. లేకపోతే టి.వి వారు మరల ఛాన్సు ఇవ్వరు. భయంకరమైన ప్రలోభం పిల్లవానిని వెనక్కు పిలిపించింది.

బొంబాయి, పూనా మొదలైన పట్టణాలలో టి.వి.లో ప్రవేశం కోసం ప్రత్యేక శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేయబడ్డాయి. ఇప్పుడైతే ఇంటింటా సంగీతానికి, నృత్యానికి ప్రత్యేక స్కూళ్లు ఏర్పాటు చేసికుంటున్నారు. సామాన్యులు కూడ లక్షాధికారులు అయిపోతున్నారు. పిల్లల పేరు మీద సంపాదించిన ధనంతో తల్లిదండ్రులు విలాస జీవితాన్ని గడపడం మొదలుపెట్టారు. తమతమ సుఖసౌఖ్యాలకోసం సామాజిక ధనాన్ని వెచ్చించే పరిస్థితి కనిపిస్తూ ఉన్నది. బహిరంగవేలం పాటలో బాలబాలికల మృదువైన బాల్యం అమ్ముడుపోతోంది.

## సుకుమారమైన మనస్సులకు దెబ్బకాకూడదు

పిల్లల్లో నిక్షిప్తమై ఉన్న శక్తులను వెలికి తీయాలంటే రకరకాల పోటీలు నిర్వహించాల్సిందే. దానిని ఎవరూ కాదనలేరు. కాని వారిలోని బౌద్ధిక, కళాత్మక శక్తులకు సరిఅయిన మూల్యాంకనం జరగాలి. అది కూడ సంస్కృతీ పరంగానే ఉండాలి. అంతేకాని మధ్య మధ్యలో అనవసరమైన అదృష్టాన్ని ప్రవేశపెట్టి, ఆశల ఊబిలో దింపడం సరిఅయిన పద్ధతికాదు. 10 సంవత్సరాల లోపు పిల్లలతో శృంగార రసభరితమైన పాటలకు అనుగుణంగా సినిమా ఫక్కీలో అభినయం చేయిస్తున్నారు. దాని ఫలితంగా వారి మానసిక స్థితి అల్లకల్లోలమైపోతుంది. నిర్వాహకులు చెప్పినట్లు ఇది బాలవికాసం

ఉపదేశాలను ఇవ్వడం, వినడం సులువే - గ్రహించడమే మరి కష్టం.

కానేకాదు. బాలవినాశం అనక తప్పదు. అశ్లీల భంగిమలతో అభినయం చేయగా చేయగా అశ్లీల చింతనలు అదృశ్యరూపంలో వారి అంతరంగాలపై దాడి చేస్తూ ఉంటాయి. దాని ఫలితంగా వయస్సు రాకముందే బాల్యావస్థ నుండి యువావస్థకు చేరుకుంటున్నారు.

టి.వి.వారి ఈ 'షో'ల వల్ల నిజమైన ప్రతిభ మరుగున పడిపోతోంది. నిష్ణాతులైనవారు ప్రథమ, ద్వితీయ స్థానములు నిర్ణయించడం లేదు. ఎస్.ఎమ్.ఎస్‌ల ద్వార ఓటింగ్ నిర్వహించి మార్కులు ఇస్తున్నారు. దీనివలన బాలబాలికలు మానసికంగా కృంగి కృశించిపోతున్నారు. 'జాతీయ బాలభవన్' పూర్వ నిర్దేశకులు శ్రీ మధుపంతు చెప్పినట్లు బాలలవికాసం పేరుతో వారి భావనాత్మక లోకాన్ని మాడ్చిమసి చేస్తున్నారు. ఒకవైపు తల్లిదండ్రుల ఒత్తిడి, మరోవైపు తోటి బాలబాలికల ఒత్తిడి కలసి చిన్నారులను డిప్రెషనులో పడవేస్తున్నాయి. ఇలాంటి కార్యక్రమాలవల్ల పిల్లలు ప్రతిక్షణం చస్తూ బతుకుతున్నారు. మానసిక శాస్త్రవేత్తలు దీనిని క్షమించరాని అపరాధంగా తేల్చి చెప్పారు.

## అంతా కృత్రిమ జీవితమే

ఈనాడు టెలివిజన్‌లో చూపించబడుతున్న ఈ కార్యక్రమాలకు 'రియాల్టీ షో' అనడాన్ని ఢిల్లీలోని ప్రసిద్ధమానసిక వైద్యులు డా॥ జితేంద్ర నాగపాల్ పూర్తిగా వ్యతిరేకిస్తున్నారు. "ప్రతి వ్యక్తీ తన రోజువారీ జీవితాన్ని ఎలా గడుపుతున్నాడో అదే రియాల్టీ. వారికి మధ్యలో కెమేరా ప్రవేశించిందంటే చాలు నాటకం మొదలైనట్లే. అందువల్ల ఈ కార్యక్రమాలు ఒకరకంగా కపట నాటకాలే అవుతాయి." అంటారు. జాతీయ బాలల అధికార సంస్థ ఈ మధ్య స్పందించి ఒక నియమావళిని తయారు చేసే పనిని చేపట్టింది. అందుకోసం ఒక కమిటీని వేసింది. అందులో మానసిక శాస్త్రవేత్తలు, జ్యోతిష శాస్త్రజ్ఞులు, సామాజిక కార్యకర్తలు, ఛానల్స్‌కు సంబంధించిన వారు మొదలైన వారిని నియోగించింది. ఎవరెన్ని చేసినా, ఎవరేది చెప్పినా ప్రజల మనసుల్లో మార్పు రానంతవరకు ప్రయోజనాలు అంతంత మాత్రమే.

## సంస్కృతిని కప్పివేస్తున్నది

ఈనాడు టి.వి ఛానల్స్ ప్రజాభిమానాన్ని పొందడానికి టి.ఆర్.పి. రేటింగ్ పెంచే ప్రయత్నాలు చేతనైనంత వరకు చేస్తూనే ఉన్నాయి. ఆ ప్రయత్నాల్లో ముక్కుపచ్చలారని పిల్లల్నే పావులుగా చేస్తున్నాయి. బాలల ప్రతిభను వెలికి దీయడమే మన ముఖ్య ఉద్దేశ్యం. కాని తల్లిదండ్రులు ఆశ- దురాశలతో తమ్ముతాము మరచిపోతున్నారు. వారి కోర్కెలకు కళ్లెం వేయాలంటే తల్లిదండ్రులకు కూడ కొంత శిక్షణ అవసరం. ప్రజలను సంతోష పెట్టడానికి, ప్రతిభను ప్రదర్శించడానికి అనేక మార్గాలుంటాయి. పాఠశాల స్థాయిలో, సంస్కృతీ మండళ్లలో ఇటువంటి పోటీలు నిర్వహింపబడేవి. కాని ఇప్పుడు పిల్లల్లో మృదుభావానికే హాని కలుగుతోంది. భారతదేశంలోనికి టి.వి. మహావేగంగా ప్రవేశించింది. అంతకంటే వేగంగా కొత్త కొత్త నమూనాలు, నెట్‌వర్క్ కార్యక్రమాలు వచ్చి పడ్డాయి. సినిమాలు, చిత్రహార్‌లు మొదలైనవి 24 గంటలు విరామం లేకుండా మ్రోగిపోతున్నాయి. పడకగది నుండి కాలు బయటపెట్టకుండానే ఉన్నచోటికే అన్నీ ప్రవేశపెట్టబడ్డాయి.

ఈ పరిస్థితి భారతీయ సంస్కృతిలోని మూల సిద్ధాంతాలపై గొడ్డలి పెట్టుగా తయారైంది. మన పిల్లల బాల్యం మన నుండి లాగివేయబడింది. రాష్ట్ర నిర్మాతలుగా తయారుకావలసిన భావి పౌరులు సినిమా కళాకారులుగా తయారౌతున్నారు. వారిలో ఏ ఆదర్శమూ కనిపించడంలేదు. ఒకప్పుడు సినిమా ప్రపంచం రచనాత్మక కార్యక్రమాలను ప్రదర్శించేది. 'హరిశ్చంద్ర' వంటి నీతిదాయకమైన నాటకాలు ప్రదర్శించబడేవి. వాటిద్వారా మహాత్ముని వంటి నాయకులు తయారు అయ్యేవారు. కాని ఈనాడు ఈ టెక్నికల్ ప్రపంచం, ఎలక్ట్రానిక్స్ టెక్నాలజీ ఒకానొక అపసంస్కృతిని ప్రవేశపెడుతోంది.

## ఆలోచనా విప్లవమే ఏకైక మార్గం

సరిఅయిన ఆలోచనలతో విప్లవం కొనసాగాలి. ప్రచారస్థాయి మార్గాన్ని సుగమం చేసేదిగా ఉండాలి. అప్పుడే వర్తమాన సమస్యలను పరిష్కరించుకోగలుగుతాం. అశ్లీలత అనేది అత్యంత ఆకర్షణీయం అయిపోతున్నది. ఇది స్లో పాయిజన్‌లా సమాజ వృక్షాన్ని సమూలంగా సర్వనాశనం చేయడానికే నడుకట్టింది. అది సమాజంలోని అంతర్భాగాలకు చేరుకుని వేరుపురుగులా వేధిస్తోంది. మనం 21వ శతాబ్ది ఆరంభంలోనే ఉన్నాం. కనుక ఉజ్జ్వల భవిష్యత్తును సాధించడానికి ప్రజల మనస్సులను సంస్కరించే ప్రయత్నం చెయ్యాలి.

★★★

*ఈ నెలలో కనీసం అయిదుగురు వ్యక్తులను పత్రిక చందాదారులుగా చేర్పించండి.*

**అందరిలో మంచిని మాత్రమే చూస్తుండు - చూచి చూచి మారిపోతావొకనాడు.**

ముఖచిత్రకథనం

# విశ్వగురువు-శ్రీదత్తాత్రేయుడు

## గురుతత్త్వం

ప్రపంచంలో ఎక్కడ, ఏ దేశంలోలేని ఒక విశిష్టమైన సంప్రదాయం భారతదేశంలో ఉంది. అదే గురు సంప్రదాయం. అసలు భారతీయ తత్వంలోనే సద్గురు తత్త్వం పెనవేసికొని ఉన్నది. కోట్లాది దేవతలను ఆరాధించినా మానవుడు తన నిజస్థితిని తెలుసుకోవాలంటే సద్గురువును ఆశ్రయించాల్సిందే. సాధన చెయ్యాల్సిందే. ఈ సందర్భంలో పరమపూజనీయ గురుదేవులు "**జో సద్గురు సో దీక్షాపావై సో సాధనకో సఫలు బనావే**" అని సెలవిచ్చారు. అంటే సద్గురువు దగ్గర తీసికొన్న దీక్ష సాధనలో సఫలతను పొందుతుంది.

"గురుర్బ్రహ్మ గురు ర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః" అంటూనే "గురు స్సాక్షాత్తు పరబ్రహ్మ" అనడంలో విశేషమైన అర్థముంది. ఇది నామరూపాలకు అతీతమైన పరతత్వం. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల కలయికతో ఏర్పడేది గురుతత్వం.

## శ్రీదత్తాత్రేయుడు

**అద్వయానందరూపాయ యోగమాయా ధరాయ చ।**
**యోగిరాజాయదేవాయ శ్రీ దత్తాయ నమో నమః ॥**

విష్ణుమూర్తి నాభి కమలం నుండి జన్మించిన బ్రహ్మ తన తపోశక్తితో అత్రి మొదలైన ఋషులను సృష్టించాడు. సృష్టిని విస్తరింపచేయుమని అత్రి-అనసూయలను ఆజ్ఞాపించాడు. 'అత్రి' అంటే మూడు (వేర్వేరు) కానివాడు. అంటే మూడు అంశలను (రూపాలను) కలిగి ఉన్నవాడు. త్రిమూర్తుల ఏకరూపము అని అర్థం. అనసూయ అంటే అసూయ లేనిది. అసూయలేని అనసూయ అత్రికి అర్థాంగి. అటువంటి దంపతుల గర్భముక్తాఫలం శ్రీ దత్తాత్రేయుడు. ఆయన జననం గురించి చిన్నకథ చెప్పుకోవాలి.

ఒకసారి లోక కళ్యాణార్థం త్రిమాతలను అజ్ఞానం ఆవరించింది. ముగ్గురిలో 'ఎవరు గొప్ప?' అన్న ప్రశ్న పుట్టుకొచ్చింది. వివాదంగా మారింది. నార+ద = నారద. అంటే జ్ఞానాన్ని ప్రసాదించేవాడు కదా ! హరినామస్మరణ చేసికుంటూ రానేవచ్చాడు. వారిని ఆవరించిన మాయను తొలగించాలనుకున్నాడు. రాళ్లను తెచ్చి గుగ్గిళ్లుగా వండిపెట్టుమన్నాడు. వారు పరిహాసంగా భావించి పో పొమ్మన్నారు. నారదుడు నేరుగా అనసూయ వద్దకు వచ్చాడు. కొంగున కట్టుకొచ్చిన రాళ్లిచ్చాడు. అనసూయ ఆనందంగా వండిపెట్టింది. వాటిని కొంగున కట్టుకుని ఒక్కొక్క గింజ నోట్లో వేసికుంటూ ముల్లోకాలు తిరిగాడు. ముగ్గురమ్మలకు అసూయ ముంచుకువచ్చింది. అనసూయను అభాసుపాలు చేయడానికి భర్తలను పంపించారు. వారువెళ్లి అత్రి-అనసూయలను ఆతిథ్యం కోరారు. వివస్త్రగా వడ్డించాలని షరతుపెట్టారు. ఆమె చిరునవ్వుతో మంత్రజలాన్ని చిలకరించింది. ముగ్గురూ పసిపాపలయ్యారు. ముగ్గురిని లాలిస్తూ పాలుత్రాగించింది. జోలపాడింది. గోరుముద్దలు తినిపించింది. అనసూయ ఇంట్లో హాయిగా పెరుగుతున్నారు త్రిమూర్తులు. త్రిమాతలు భర్తల రాకకోసం చూచి చూచి విసిగిపోయారు. దివ్యదృష్టితో చూచి విషయం గ్రహించారు. పరుగున వచ్చారు. పతిభిక్షను వేడుకున్నారు. అసూయ ఎరుగని అనసూయ ఆనందంగా వారిపై నీరు చల్లింది. వారి భర్తలను వారికిచ్చివేసింది. వరం కోరుకోమన్నారు త్రిమూర్తులు. సంతానం లేని మాకు మీరు ముగ్గురు సంతానంగా జన్మించాలని కోరుకున్నారు. సరే అన్నారు. ముగ్గురి అంశలతో క్రమంగా చంద్రుడు, దత్తుడు, దుర్వాసుడు జన్మించారు. అంటే బ్రహ్మఅంశతో చంద్రుడు, విష్ణువు అంశతో దత్తుడు, మహేశ్వరుని అంశతో దుర్వాసుడు జన్మించారన్న మాట.

త్రిమూర్తుల ఏకరూపం 'అత్రి' అని చెప్పుకున్నాం కదా. అత్రి అంశ దత్తునిలో ప్రవేశించింది. దత్త+ఆత్రేయుడు = దత్తాత్రేయుడు అయ్యాడు. ఈ విధంగా దత్తుడు ఆత్రేయుడై, త్రిమూర్తుల చిహ్నంగా త్రిశిరుడై, దత్తాత్రేయుడయాడు. సర్వవ్యాపకుడుగా విష్ణువు, సర్వజ్ఞుడుగా బ్రహ్మ, సర్వసమర్థుడుగా శివుడు ఒకేరూపంలో ఆవరించి, ఆనాటినుండి ఈనాటివరకు అఖండ గురుసత్తాతో విశ్వగురువై విశ్వానికి మార్గదర్శకం చేస్తున్నాడు.

## దత్తాత్రేయుని షోడశ అవతారాలు

దత్తాత్రేయ సంప్రదాయంలో కలియుగానికి ముందు దత్తాత్రేయునికి 16 అవతారాలని చెప్పబడింది. అయితే ఆయన పరతత్వంతో, గురు తత్వంతో ఋషులకు ప్రసాదించిన సద్గుణ పరంపరనే ఆయన అవతారాలుగా మనం భావించుకోవచ్చు. అయినా ప్రాచీన కాలంనుండి చెప్పబడుతున్న షోడశావతారాలను గురించి క్లుప్తంగా తెలుసుకుందాం.

**1. యోగిరాజు :** అత్రి- అనసూయా దంపతులు రూక్షపర్వతంపై తపస్సు చేస్తుండగా ప్రప్రథమంగా ఒక కార్తీకపూర్ణిమ బుధవారంనాడు

**కోపానికి కారణం సాధారణం - పరిణామం మాత్రం అసాధారణం.**

మొదటి ఝామున మొదటి యామంలో **యోగిరాజు** గా అవతరించాడు భగవంతుడు.

**2. అత్రివరదుడు :** అత్రి ఇంద్రియాలను, మనస్సును నిగ్రహించి ఒంటికాలుపై యోగి రాజును ధ్యానించాడు. త్రిమూర్తులు ప్రత్యక్షమయ్యారు. మా ముగ్గురి అంశయే 'యోగి రాజు' అని తెలిపారు. వరం కోరుకో మన్నారు. యోగిరాజు వంటి కుమారుని కోరుకున్నాడు అత్రి. అప్పుడు యోగిరాజు మూడుతలలు, ఆరుచేతులతో దర్శన మిచ్చాడు. అత్రికి వరము నిచ్చిన యోగిరాజు **అత్రివరదుడు** గా ప్రసిద్ధిచెందాడు. ఇది ఒక కార్తీక బహుళ పాడ్యమీ రోహిణీ నక్షత్ర యుక్త గురువారం నాడు మొదటి యామము, మొదటి గడియలో జరిగింది.

**3. శ్రీ దత్తాత్రేయుడు :** అత్రియోగిరాజు వంటి కుమారుని కోరుకున్నాడు. తనవంటి వాడు మరొక్కరు లేనందువల్ల యోగిరాజు తనను తానే దత్తత ఇచ్చుకున్నాడు. అత్రికి దత్తుడైనందువల్ల **దత్తాత్రేయుడు** గా ప్రసిద్ధి చెందాడు. ఇది కార్తీక బహుళవిదియ, మృగశిరానక్షత్రం, శుక్రవారంనాడు మొదటి ఝామున మొదటి గంటలో జరిగింది. సాక్షాత్కరించిన రూపం భూమిపై నిలిచిపోవాలని అత్రి కోరుకున్నాడు. అదేవిధంగా దత్తాత్రేయుడు భూమిపై నిలిచిపోయాడు.

**4. కాలాగ్ని శమనుడు :** అత్రిమహర్షి ఆశ్రమంలో ధ్యాన నిమగ్నుడైనాడు. ఆయన నుండి జనించిన యోగాగ్ని ఆయన శిరస్సునే దహించబోతోంది. ఇది గమనించిన దత్తాత్రేయుడు మహర్షి శిరస్సులో ప్రవేశించాడు. భయంకరమైన అగ్ని శమించింది. అత్రికన్నుల నుండి ఒక దివ్య కాంతి బయలుదేరి అందరు చూస్తుండగానే అనసూయ దేహంలో ప్రవేశించింది. ఇది మార్గశిరమాసం పూర్వార్థంలోని సప్తమినాడు జరిగింది. తరువాత 9 రోజులకు మార్గశిర పౌర్ణమి బుధవారం నాడు మృగశిరా నక్షత్రంలో సాయంకాల సమయంలో అనసూయకు పుత్రుడు జన్మించాడు. చంద్ర, దత్త, దూర్వాసుల రూపంలో దంపతులకు భగవంతుడు దర్శనమిచ్చాడు. కాలాగ్నిని శమింపచేయడంవల్ల **కాలాగ్ని శమనుడు** గా ప్రసిద్ధి చెందాడు.

**5. యోగిజనవల్లభుడు :** 'కాలాగ్ని శమనుడు' అత్రి ఇంట జన్మించిన వార్త లోకమంతా ప్రాకిపోయింది. సిద్ధ గంధర్వాదులు, యోగులు మొదలైన వారంతా బాలుని దర్శించడానికి వచ్చారు. వారికి బాలరూపంలో కాకుండ తేజోమూర్తిగా దర్శనమిచ్చాడు. "నాకు జన్మ, కర్మ, గుణ, రూప, మాయ, నాశములులేవు. సర్వవ్యాపిని. ఈ మూర్తిని ధ్యానించి తరించండి." అని పలికాడు. ఈ విధంగా **యోగిజనవల్లభుడు** గా ప్రసిద్ధి చెందాడు. ఇది మార్గశిరపౌర్ణమి గురువారం నాడు మధ్యాహ్నం జరిగింది.

**6. శ్రీ లీలా విశ్వంభరుడు :** 'యోగిజన వల్లభుడు' ఒకసారి తల్లిఒడిలో ఆడుకుంటున్నాడు. అతివృష్టివంటి ప్రకృతి భీభత్సాలకు గురిఅయిన ప్రజలు, మునులు ఆయనను శరణువేడారు. ఆ బాలుడు తన విశ్వరూపం చూపించి, వారికి కావలసిన సామగ్రినంతా అందించాడు. యోగమాయచేత. సుందర వనాలను సృష్టించి వాటిలోని ఫలపుష్పాలను తాకవద్దన్నాడు. అయినా వారు వినకుండా వాటిని అనుభవించి పిచ్చివారుగా మారారు. బాలుడు అదృశ్యుడై మరల కనిపించాడు. ఆతనిని చూడగానే అందరు స్వస్థులయ్యారు. ఇకపై మిమ్ము వదలి వెళ్లము అని అక్కడే ఉండిపోయారు. వారి భక్తిని పరీక్షించడానికి ఒక కొలనులోనికి వెళ్లి 100 సంవత్సరాలు తిరిగి రాలేదు. వస్తూ వస్తూ ఒక స్త్రీని, ఒక మద్యం సీసాను వెంట తెచ్చుకున్నాడు. అయినా వారు వదలివెళ్లలేదు. ఈ విధంగా తన లీలలతో అందరినీ ఆనందపెడుతూ **శ్రీ లీలా విశ్వంభరుడు** గా ప్రసిద్ధి చెందాడు. ఇది పుష్య పౌర్ణమి- పుష్యమీ నక్షత్రం- బుధవారం సూర్యోదయ కాలంలో జరిగింది.

**7. సిద్ధరాజు :** అక్కడ అదృశ్యమైన 'శ్రీ లీలా విశ్వంభరుడు' రహస్యంగా బదరికావనం చేరుకున్నాడు. అక్కడ తపస్సు చేత సిద్ధిపొందిన వారు అహంకారం చేత వాదులాడు కుంటున్నారు. అంతలో ఆకాశ మార్గాన వసువు, రుద్రుడు మొదలైన దేవతలు పోతున్నారు. వారీతనిని చూచి క్రిందికి దిగారు. సిద్ధులంతా అది తమ గొప్పతనమే అని మరల వాదించుకున్నారు. లీలా విశ్వంభరుడు వారితో- "మీలో ఎవరు వారిని పంపించగలిగితే వారే గొప్ప" అన్నాడు. అందరు రకరకాలుగా ప్రయత్నించారు. కాని సాధ్యం కాలేదు. సిగ్గుతో తలలు వంచారు. శ్రీ లీలా విశ్వంభరుడు ఒక్క కంటిచూపుతో దేవతలను పంపివేశాడు. ఆవిధంగా సిద్ధులకు కనువిప్పు కలుగచేసి **సిద్ధరాజు** గా ప్రసిద్ధిచెందాడు. ఇది మాఘ పూర్ణిమ మఖా నక్షత్రయుక్త గురువారం నాడు జరిగింది.

**8. జ్ఞాన సాగరుడు :** 'సిద్ధరాజు' ఎదురుగానే గర్విష్ఠులైన సిద్ధులు ఆయనను గాలిలో కూర్చుని ఉండడం చూచారు. తమ సిద్ధశక్తితో పడగొట్టాలని ప్రయత్నించారు. కాని వారి తరం కాలేదు. "సర్వకారణుడనైన నన్ను మీరే మీ చేయలేర"ని సిద్ధరాజు జ్ఞానాన్ని బోధించాడు. సిద్ధులకు జ్ఞానబోధ చేసి **జ్ఞానసాగరుడు** గా ప్రసిద్ధి చెందాడు.

**"దిశను మారిస్తే దశ మారుతుంది" - దృష్టిని మారిస్తే? సృష్టేమారుతుంది.**

**9. విశ్వంభరావధూత :** 'జ్ఞాన సాగరుడు' వికృతరూపంలో అవధూతగా సిద్ధుల మధ్యకు వచ్చాడు. వారంతా చంచలత్వంతో పోట్లాడుకుంటున్నారు. వారిని సరిదిద్దే ప్రయత్నం చేశాడు. వికృతరూపంలో ఉన్న అవధూతను చూచి బాధించాలని చూచారు. వారివల్ల కాలేదు. పాదాలపై వ్రాలి శరణువేడారు. వారికి తన విశ్వరూపాన్ని చూపి **'విశ్వంభరావధూత'** గా ప్రసిద్ధి చెందాడు. ఇది చైత్రపౌర్ణమి చిత్రా నక్షత్రయుక్త మంగళ వారం రెండవ యామంలో రెండవ గంటలో జరిగింది. వేయి కన్నులు, వేయి తలలు గలిగి ఉన్న ఆయన తన మాయకు తానే ఆశ్రయమని చెప్పి అభయమిచ్చాడు.

**10. మాయాయుక్తావధూత :** విశ్వంభరావధూత ఒకరోజు నల్లని కుక్కను వెంటబెట్టుకుని శీలుడు అనే బ్రాహ్మణుని ఇంటికి వెళ్లాడు. ఆ సమయంలో అక్కడ శ్రాద్ధం జరుగుతోంది. వెళ్లి పీటమీద కూర్చున్నాడు. కౌపీనధారి అయిన ఈ యువకుని చూచి శీలుడు అనుమానించి ప్రశ్నలు వేశాడు. ఆతని సమాధానాలను విని భక్తి శ్రద్ధలతో శ్రాద్ధాన్నాన్ని పెట్టాడు. భక్తితో పూజించి, శరణు వేడాడు. శ్రాద్ధభోక్తలు కోపగించి వెళ్లిపోయారు. గ్రామంలోని బ్రాహ్మణులంతా కట్టుగా వచ్చి నిలదీశారు. వారు వేసిన ప్రశ్నలకు నా కుక్క సమాధానం చెపుతుంది అన్నాడు. నేను మాయారహితుడను అన్నాడు. వెంటనే కుక్క వేదాలు, ఆరుశాస్త్రాలు చెప్పింది. శీలునకు ఉపదేశించి **మాయాయుక్తావధూత** గా ప్రసిద్ధి చెందాడు. ఇది స్వాతీ నక్షత్ర యుక్తవైశాఖ శుద్ధచతుర్దశీ బుధవారం మధ్యాహ్న సమయంలో జరిగింది.

**11. మాయా ముక్తావధూత :** 'మాయా యుక్తావధూత' అడవిలో ఆసనంపై ధ్యానంలో నిమగ్నమయ్యాడు. అక్కడకు బ్రాహ్మణులు చేరారు. వారికి తన మాయతో పులులు, సర్పాలు, అగ్నులు చూపించి భయపెట్టాడు. కాని వారు వెళ్లిపోలేదు. అప్పుడు తన మాయను వదలి తన దగ్గరకు వచ్చిన వారికి స్వధర్మపాలనను నేర్పించాడు. ఆనాటి నుండి **మాయా ముక్తావధూత** గా ప్రసిద్ధి చెందాడు. ఇది జ్యేష్ఠ శుద్ధత్రయోదశినాడు సూర్యోదయ సమయంలో జరిగింది.

**12. ఆది గురువు :** 'మాయా ముక్తావధూత' సహ్యాద్రిలోని ఉసిరిక చెట్టుక్రింద తపస్సు చేసికుంటున్నాడు. తల్లి అయిన మదాలస ఆజ్ఞమేరకు అలర్కుడు సద్గురువును వెతుక్కుంటూ వచ్చి దర్శించాడు. అలర్కునికి ఆది గురువు రూపంలో దర్శనమిచ్చాడు. ఆత్మను గురించి బోధించి **'ఆది గురువు'** గా ప్రసిద్ధి చెందాడు. ఇది ఆషాఢ పూర్ణిమయుక్త శనివారంనాడు జరిగింది.

**13. శివరూపుడు :** ఆదిగురువు దిగంబరుడై వేదాలు చదువుతున్నాడు. ఒక బ్రాహ్మణుడు ఆతనిని ఆశ్రమ ధర్మాలు లేవనీ, దిగంబరుడనీ హేళన చేశాడు. వెంటనే ఆదిగురువు శుభకరమైన శివరూపంతో దర్శన మిచ్చి **'శివరూపుడు'** గా ప్రసిద్ధి చెందాడు. ఇది శ్రావణ మాస పూర్వార్ధంలోని అష్టమి సోమవారంనాడు జరిగింది.

**14. శ్రీ దేవదేవ :** 'శివరూపుడు' సహ్యాద్రిలో ఉసిరిక చెట్టుక్రింద తపస్సు చేస్తుండగా బ్రహ్మదేవుడు చూడడానికి వచ్చాడు. అప్పుడు శంఖగదా చక్రహస్తుడై కనిపించాడు. ఆ సమయంలో దర్శించిన వారందరికీ ముక్తిని ప్రసాదించి **'శ్రీదేవదేవుడు'** గా ప్రసిద్ధి చెందాడు. ఇది భాద్రపద పూర్వార్ధంలో చతుర్దశీ శతతారకా నక్షత్రయుక్త గురువారం మొదటి యామంలోని మొదటి గంటలో జరిగింది.

**15. దిగంబరుడు :** 'శ్రీదేవదేవుడు' తాను 24 మంది సాధక గురువులనుండి జ్ఞానాన్ని పొందానని సోమవంశజుడైన యదుమహారాజుకు తెలిపాడు. ఆయన దయవలన యదువంశంలో శ్రీ కృష్ణుడు జన్మించాడు. యదుమహారాజుకు దిగంబరంగా దర్శనమిచ్చి **'దిగంబరుడు'** గా ప్రసిద్ధి చెందాడు. ఇది ఆషాఢ పూర్ణిమ బుధవారం సూర్యోదయ కాలంలో జరిగింది.

**16. శ్రీకృష్ణశ్యామ కమలనయనుడు :** 'దిగంబరుడు' జ్ఞాన తల్పంమీద శయనించి ఉండగా ఆయన శిష్యులు దర్శించడానికి వచ్చారు. వారికి ఇంద్రనీల కాంతులతో దర్శనమిచ్చాడు. తామరవంటి కన్నులతో చూపరులను ఆకర్షించి శ్రీకృష్ణుని తలపించాడు. ఆనాటినుండి **'శ్రీకృష్ణ శ్యామకమల నయనుడు'** గా ప్రసిద్ధి చెందాడు. ఇది కార్తీక పూర్వార్ధ ద్వాదశీ రేవతీ నక్షత్ర యుక్త బుధవారంనాడు జరిగింది.

ఈ విధంగా దత్తస్వామి స్వీయగుణ గణాలనే అవతారాలుగా చూపించి మనలను ధన్యులను చేశాడు. అన్ని దశలలోను అద్భుతాలను పూయించాడు. ఆశ్రయించిన వారిని ఆదుకున్నాడు.

## పురాతన గ్రంథాల్లో దత్తాత్రేయుడు

సకలజీవులను ఉద్ధరించడమే తన అవతారకార్యంగా గల దత్తాత్రేయుడు ప్రాచీన గ్రంథాల్లో అనేక విధాలుగా తెలుపబడ్డాడు. యోగీశ్వరుడైన చక్రధరుడు తన "సూత్రపాఠ విచారము" అనే గ్రంథంలో కీర్తించాడు. రాముడు, కృష్ణుడు అవతరించకముందే ఒకానొక వైశాఖ బహుళ దశమీ గురువారంనాడు 'దత్తుడు' అవతరించాడని పురాణాలు చెపుతున్నాయి. ఈయన 'వాతరశన' అనే ఋషి సంప్రదాయానికి చెందిన వాడనీ, మౌన ప్రియుడనీ, పరిశుద్ధ హృదయుడనీ 'భాగవతం' చెపుతుంది. (11:647) యోగ

నామజపం చేస్తూవుండు నిరంతరం - ఫలితం తప్పదు తరంతరం.

సంప్రదాయకులని నారద పరివ్రాజకోపనిషత్తు చెబుతుంది. దత్తాత్రేయుడు ఎక్కువగా కావేరీ లోయలలో తిరుగుతూ, 'సహ్యాద్రి'గా ప్రఖ్యాతమైన పర్వత గుహలలో ఆశ్రమాన్ని నెలకొల్పి, అక్కడ యోగనిష్ఠలో నిమగ్నమయ్యాడని మార్కండేయ పురాణం (17-12:16-20) చెబుతున్నది. ఈయన ఉపాసన గురించి స్కందపురాణంలోని కాశీ ఖండంలో వర్ణించబడింది. ఆగమ, తంత్ర, యోగ, పురాణాది ప్రాచీన గ్రంథాలలో శివునిగా వర్ణించబడిన, నాథ సంప్రదాయానికి పట్టుగొమ్మ అయిన గోరక్ష నాథునికి దత్తాత్రేయుని దర్శనం లభించిందని 'గోరక్షవాణి' చెపుతున్నది. అంతేగాదు శ్రీదత్తాత్రేయుడే 'అవధూత గీత', 'శ్రీ గురుగీత' స్వయంగా గోరక్షనాథునికి బోధించినట్లు సమర్థ రామదాసు తన "దాసబోధ' లో వ్రాశాడు. శ్రీదత్తాత్రేయునికి 'అవధూత' అనే బిరుదు ఉన్నది. నాశరాహిత్యము, శ్రేష్ఠత్వము, విదిలించివేయబడిన సంసార బంధము, 'తత్వమసి' అనే మహా వాక్యానికి లక్ష్యమైనవారిని 'అవధూత' అంటారు.

## చరిత్రలో శ్రీ దత్తాత్రేయుడు

చారిత్రకమైన కాలంలోకూడ శ్రీ దత్తాత్రేయుడు ఎందరెందరో మహాత్ములను అనుగ్రహించి కీర్తించబడ్డాడు. "మేరువుకు అవతల (దక్షిణ దేశంలో) ఖేచరీ ముద్రలో కూర్చుని ధ్యాన నిమగ్నుడైన, నిరాకారుడైన దత్తయోగి బ్రహ్మానందమును అనుభవిస్తున్నాడు. గోదావరీ నదీతీరంలో జ్ఞానాన్ని అపారంగా సేకరిస్తూ పాంచాలేశ్వర్‌లో నిత్యమూ స్నానం చేసే శ్రీ దత్తయోగి నా హృదయంలో ఉన్నాడ"ని జ్ఞానేశ్వరుడు ఒక అభంగంలో కీర్తించాడు. చక్రధరునికి, మాతాపూర్‌లో ఒకసారి, పైఠాన్‌లో ఒకసారి దత్త స్వామి దర్శనమిచ్చి సన్యాస దీక్షావస్త్రాలు, జీవులను ఉద్ధరించుమన్న ఆదేశమూ ఇచ్చినట్లు చరిత్ర చెపుతున్నది. ఆయన అనుగ్రహంతోనే బాయీశుడు, నాగదేశాచార్యులు అనే శిష్యులకు సిద్ధి లభించింది. సమర్థ రామదాసు శిష్యుడైన కల్యాణ స్వామి- "దత్త ప్రభువుకు మూడులోకాలలోను వందనములే. ఆయన సిద్ధ సనాతనుడు, త్రిమూర్తుల అవతారము అని కీర్తించాడు. అనేక ప్రాచీన సంప్రదాయాలవారు ఆయనను ధ్యానిస్తారు. ఆనంద సంప్రదాయానికి కూడ మూలపురుషుడు శ్రీ దత్తుడే అని శ్రీధరస్వామి, శ్రీ కృష్ణదయార్ణవ స్వామి చెప్పారు. చైతన్య సంప్రదాయ ప్రవర్తకులైన రాఘవ చైతన్యుడు, కేశవ చైతన్యుడు కూడ శ్రీదత్త స్వామినే పరమ గురువుగా చెబుతారు.

## చతుర్యుగావతారుడు

వీటిని బట్టి శ్రీ దత్తాత్రేయుని విశ్వగురుత్వం స్పష్టమౌతోంది. ఆయన చతుర్యుగావతారుడు. ఆయన ఇప్పటికీ తన అవతారాన్ని చాలించలేదు. నేటికీ నీలగిరి శిఖరాన సూక్ష్మరూపంలో నివసిస్తున్నాడని మహనీయులు చెబుతారు. ఎందరో మహనీయులకు అనేక రూపాలలో దర్శనమిస్తుంటాడని చెపుతుంటారు. లోకంలో శ్రీకృష్ణుణ్ణి, ఆయన అంశావతారమైన చక్రధరుణ్ణి కీర్తించేవారితోపాటు నిరసించేవారూ ఉన్నారు. కాని శ్రీ దత్త ప్రభువుకు మాత్రం సర్వత్రా సర్వదా సన్మానమే లభించింది. లభిస్తున్నది. మున్ముందు లభిస్తుంది. అదే ఈ అవతారానికి గల మరొక్క విశేషం.

శ్రీ సాయిబాబా జీవిత చరిత్ర, శ్రీ గురు చరిత్ర ఒకదానికొకటి వివరణమని చెప్పవచ్చు. ఆ రెండూ ఒకే దత్తాత్రేయుని చరిత్రలో వేర్వేరు అధ్యాయాలు. "శ్రీ సాయిబాబా జీవిత చరిత్ర", "శ్రీ గురు చరిత్ర", "శ్రీ గురుగీత" మూడింటిని ప్రస్థానత్రయం అనవచ్చు. ప్రస్థానత్రయమంటే సనాతన ధర్మానికి మూలాలైన ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రాలు, భగవద్గీత. వాటికి సరిజోడీగా ఇవి నిలబడతాయి.

## అత్యంత పవిత్రదినం

అంతరిక్షంలోని గ్రహ నక్షత్రాల ప్రభావం మానవజాతి మీద, పృథ్వీ గ్రహం మీద ఏ విధంగా ఉంటుందో మన ఋషులు బాగా అధ్యయనం చేసి అర్థం చేసుకున్నారు. నక్షత్రాల ద్వారా సార్వలౌకిక శక్తిధారలు మనలోకి ప్రవహిస్తాయి. అంతరిక్షంలోని నక్షత్ర మండలం యొక్క ఆకారం ఇతర సమూహాలతో ఏర్పడే కోణాలను బట్టి ఈ శక్తిధారల తత్వం మారుతూ ఉంటుంది. అందువల్లనే ఖగోళ విజ్ఞానానికి అంత విశిష్టత ఆపాదింపబడింది.

వేదాలు, పురాణాలు విశ్వఖగోళాన్ని అత్యంత నిశితంగా చిత్రీకరించాయి. ప్రతి తారామండలానికి ఒక విశేషమైన పేరు ఇచ్చి విశ్వఖగోళంలోని పరిణామాలను, వాటి మధ్య జరిగే వినిమయాలను ఇచ్చిపుచ్చుకోవడాలను గాథలుగా వర్ణించడం జరిగింది.

**ఈ నెల ముఖచిత్రంలో పాఠకులకు దత్తాత్రేయ జయంతినాడు సంభవించే అనూహ్యమైన తారల రచన, ఆకృతిని చూపించడం జరిగింది. ఆ రోజు బ్రహ్మపదము, విష్ణుపదము మరియు శివపదము అనబడే నక్షత్రాలు పృథ్వితో ఒక సరళరేఖలో వస్తాయి. దీనివల్లనే మన శాస్త్రాలలో బ్రహ్మ, విష్ణువు, శివుని యొక్క శక్తుల కలయిక వల్ల దత్తాత్రేయుడు జన్మించాడన్న కథనం ప్రాచుర్యంలోకి వచ్చింది. ఈ అత్యంత పవిత్రమైన రోజున మన ప్రయత్నమేమిలేకుండా ఆ దివ్య తరంగాలను అనుభవించి లాభం పొందగలం.**

*'శ్రీ దత్తాత్రేయ సర్వస్వము' (పంచ భాగ సహితము) శ్రీ జి.వి.ఎల్.ఎన్ విద్యాసాగర శర్మ. 'నక్షత్రములు' గొబ్బూరి వెంకటానంద రాఘవరావు. పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారు రచించిన 'శ్రీ గురుచరిత్ర' ఆధారంగా - శ్రీమతి పొన్నూరు హైమవతీ శాస్త్రి.*

★★★

నియమాలన్నీ పాటిస్తేనే భాష - భాషంటే కాదు మరి తమాషా.

ధారావాహిక: హనుమత్ కథామృతం-9

# నామకరణ మహోత్సవం

అంజనీ కుమారునికి నామకరణం చెయ్యాలని మతంగ మహర్షి పంచాంగం తిరగవేశాడు. తిథి, వార, నక్షత్ర, యోగ, కరణాలన్నీ కలసివచ్చాయి. ఆరోజురానే వచ్చింది. ఆకాశం నిర్మలంగా భాసిస్తోంది. సూర్య నారాయణుడు ఉదారభావంతో ఈ చరాచర సృష్టికి వెలుగును, శక్తిని ప్రసాదిస్తున్నాడు. అది ఆయనకు నిత్యకృత్యమే అయినా, ఈరోజు మరి కొంత ప్రత్యేకతను సంతరించుకుంటున్నది. ఆ శోభ వర్ణనాతీతం.

మతంగ మహర్షి తనతోటి ఋషులతో, శిష్యులతో కలసి నిత్యకృత్యమైన ఉపాసనావిధులను పూర్తి చేసుకున్నాడు. శిష్యుడు సువ్రతుడు ఆనందంతో హడవుడిగా వచ్చాడు. వానర రాజు కేసరి రాకను తెలియపరచాడు సంభ్రమంగా. గురువు గారి సంకేతాన్ని గ్రహించి తిరిగి వెళ్లి కేసరిని వెంటబెట్టుకుని వచ్చాడు. కేసరి వస్తూనే మహర్షికి వినయవిధేయతలతో సాష్టాంగ ప్రణామం చేశాడు. మహర్షి మహదానందంతో ఆయనను లేవనెత్తి హృదయానికి హత్తుకున్నాడు. అపారమైన ప్రేమానురాగాలతో కొద్దిసేపు ఆప్యాయంగా శిరస్సు నిమురుతూ ఉండిపోయాడు. ఈ అవ్యాజానురాగానికి కేసరి చలించి పోయాడు. డగ్గుత్తికతో "దేవా! మీ ఆదేశం ప్రకారం సకలం సమకూర్చి ఉంచాను. మీరు మీ ఋషిగణాలతో కలసి మా గృహాన్ని పావనం చెయ్యండి." అన్నాడు.

మతంగ మహర్షి "మేమంతా సిద్ధంగానే ఉన్నాము." అంటూ ఋషులకు సైగ చేశాడు. వీరుంటున్న శివమందిరానికి, కేసరి గృహానికి ఏమంత దూరంలేదు. అందువల్ల స్వల్ప సమయంలోనే ఒక ఆనంద సాగరం మహోత్సాహంగా తరలి వెళ్లింది. ఆ సుందర భవనం పుత్రోత్సాహంతో ఉప్పొంగిపోతూ వాస్తుకు శిల్పంతోడైనట్లు నూతన కాంతులతో విరాజిల్లుతోంది. ప్రకృతి మాత తన స్వహస్తాలతో అలంకరించినట్లుగా కళకళలాడుతోంది.

ఈరోజు అక్కడకు విచ్చేస్తున్న అతిథులు విశేషజ్ఞులు. వానర చక్రవర్తి వాలితో కలసి ఆతని చిన్న తమ్ముడు సుగ్రీవుడు వచ్చాడు. వారితోపాటు వానర సైన్యాధిపతులు, వివిధ వన్యజాతుల ప్రముఖులు పెద్ద సంఖ్యలో విచ్చేశారు. ఋషి గణాలతోపాటు బ్రాహ్మణ వర్గాలు వచ్చిచేరారు. అదృశ్యరూపంలో వచ్చి వీక్షిస్తున్న దేవగణాలను మతంగ మహర్షి దివ్యదృష్టితో చూచి సంతృప్తి చెందాడు.

ఒక విశాలమైన యజ్ఞమండపంలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. చుట్టు ప్రక్కల విస్తరించి ఉన్న ఖాళీ ప్రదేశంలో అతిథులందరు కూర్చునేందుకు వ్యవస్థ చేయబడింది. ప్రధాన వేదికకు దగ్గరలో మతంగ మహర్షి తన సహచరులతో కలసి కూర్చున్నాడు. మిగతావారు తమతమ యోగ్యతానుసారం వేర్వేరు ఆసనాలను అధిష్టించారు. మతంగుని సైగను గ్రహించి కేసరి ఆసీనుడయ్యాడు. అంజనీ దేవిని పుత్రసహితంగా తీసికొని రమ్మని సేవికలను అంతఃపురానికి పంపించాడు. కొద్దిసేపట్లో అంజనీదేవి వరపుత్రుని చేతుల్లో పొదివికొని యజ్ఞమండపానికి వచ్చిచేరింది.

అంజని ఒడిలోని శిశువు శోభనుగాంచి ఆగంతకులందరు అవాక్కైపోయారు. వారి కన్నులు చెదిరిపోతున్నాయి. స్వయంగా బాలసూర్యుడే దిగివచ్చి అంజనీ దేవి ఒడిలో ఇమిడిపోయాడా! అనిపిస్తోంది. మహర్షి హృదయం స్పందించిపోయింది. మెరిసేకళ్లతో ఆ మాతాశిశువులను తిలకిస్తూ కేసరి ప్రక్కన కూర్చోమని ఆమెకు సైగ చేశాడు. అంజనీదేవి అద్భుతమైన అనుభూతితో పతిదేవుని ప్రక్కకు వెళ్లికూర్చుంది. వెంటనే వైదిక మంత్రాలు హోరందుకున్నాయి. కొద్ది సమయందాకా ఆ మంత్రాల జోరు సాగుతూనే ఉంది. తరువాత ఆరోజు ఏమేమి కర్మకాండ జరగాల్సి ఉందో అదంతా మతంగ మహర్షి ఆధ్వర్యంలో నిర్విఘ్నంగా కొనసాగింది.

సర్వసంగ పరిత్యాగి అయిన మహర్షి ఈ సాంసారిక ప్రక్రియలనన్నింటినీ పొల్లుపోకుండ జరిపించడం చూచిన ఆహూతులందరు ముక్కుపై వ్రేలు వేసుకున్నారు. అంజనీదేవి కేసరిల అదృష్టాన్ని పొగడుతూనే లోలోపల కలిగిన రవ్వంత ఈర్ష్యను కాదనలేకపోయారు. అది లోక సహజమే కదా! దానికి తగిన

**పరమాత్మను చేరాలంటే ఆర్తిని పెంచుకో - ఆశలు చంపుకో.**

కారణం లేకపోలేదు. మతంగ మహర్షి మహామహులైన చక్రవర్తుల ఆహ్వానాన్ని తిరస్కరించిన సంఘటనలెన్నో ఉన్నాయి. ఎవరెన్నివిధాల ప్రార్థించినా ఏ కార్యానికీ ఆధ్వర్యం వహించలేదు. ఎవరో దాకా ఎందుకు? స్వర్గాధిపతి అయిన ఇంద్రుడే వచ్చి తన యజ్ఞాన్ని నిర్వహించవలసిందని శతకోటి విధాల ప్రయత్నించినా ఫలితంలేకపోయిందన్న విషయం వారందరికీ తెలిసిందే. అటువంటి ఋషిపుంగవుడు ఒక సామాన్యవానరరాజు ఇంటికి వచ్చి స్వయంగా యజ్ఞకార్యానికి ఆధ్వర్యం వహించడం అసూయాజనకం కాక మరేమౌతుంది.

అందరి ఆలోచనలు ఈవిధంగా ఉంటే, మహర్షి ఆలోచనలు మరోవైపు సాగుతున్నాయి. ఈనాటి ఈ మహోత్సవం తన చేతుల మీదుగా జరగడం తన జన్మ జన్మల సౌభాగ్యంగా భావిస్తున్నాడు. తనకింత గొప్ప అదృష్టాన్ని కలిగించిన వానరదంపతులను మనసారా ఆశీర్వదిస్తున్నాడు. అభినందిస్తున్నాడు. లోలోపల ఆరాధిస్తున్నాడు. మనోసాగరంలో ఉవ్వెత్తున ఎగిసిపడే భావతరంగాలను అదుపు చేసుకుంటూ అంజనీదేవి ఒడి నుండి బిడ్డను చేతిలోనికి తీసికున్నాడు. తన ఒడిలోనికి చేర్చుకున్నాడు. కొన్ని క్షణాలు బిడ్డను తదేకంగా చూస్తుండి పోయాడు. ఆ చిన్నారి వదనంలో ఏం స్ఫురించిందో ఏమో కాని వృద్ధ మహర్షి ఆ నును లేత పాదాలను ఎత్తి నుదుటికి తాకించుకున్నాడు. పొడవైన తన జటలతో మెల్లమెల్లగా స్పృశించాడు. ఆవిధంగా చేస్తున్న మహర్షి పెదవులనుండి అస్పష్టస్వరంతో మెల్లగా "శివ! శివ! శంకర! హర! హర! మహాదేవ!" అన్న శబ్దాలు వెలువడ్డాయి. అదే సమయంలో శిశువు పెదవులపై చిరునవ్వులు చిందులాడాయి. అలా చిరునవ్వులు చిందిస్తూనే తన మృదువైన చిన్నారి చేతులను మహర్షి నుదుటికి తాకించాడు. అదంతా చూచే వారికి సహజంగానే అనిపించినా మహర్షికి మాత్రం తన ఆరాధ్యదైవమైన ఆదిశంకరుల ఆశీస్సులుగానే అనిపించాయి. బాలుని ఉచ్ఛ్వాస నిశ్వాసల్లో "రామ! రామ!" అనే లయను గమనించి పులకించి పోయాడు. అంతే కాదు. బాలుని రోమరోమాలనుండి రామనామం వస్తున్నట్లు భావించుకోసాగాడు. వీటినన్నింటినీ మహర్షి తప్ప ఇంకెవ్వరూ గుర్తించలేకపోతున్నారు.

మహర్షి ఎట్టకేలకు తన భావోద్వేగాలను అదుపు చేసుకున్నాడు. ఆ బాలశివుని రూపురేఖలను పరిశీలించాడు. అత్యంత శుభకరంగా కన్పించాయి అవి. ప్రేమతో శిశువుయొక్క వెన్నును నిమరసాగాడు. ఆ చిన్నారి వెన్నులో ఎన్నెన్నో విశేషతలు స్ఫురించాయి. వెంటనే అంజనీదేవితో "పుత్రీ! నీ బిడ్డ సమస్తమైన శుభలక్షణాలతో విరాజిల్లుతున్నాడు. అందులో ఈ వెన్నుపూస (హనువు) మరింత విశేషమైనది. అందువల్ల నీ కుమారుని పేరు "హనుమాన్" అని నిర్ణయించాను." అన్నాడు. కరతాళ ధ్వనుల మధ్య ఆనందవర్షం వెల్లివిరిసింది.

★★★

## సత్సంగం ఎలా చెయ్యాలి?

*ఉత్తమపురుషుల స్నేహం చేయాలి. ఎందుకంటే మంచి సాంగత్యంలో ఉంటే చెడ్డవారు కూడా మంచిగా మారిపోతారు.*

*నిస్సందేహంగా సత్సంగాన్ని మించిన గొప్ప విషయం ఈ ప్రపంచంలో లేదు. సమయాన్ని సదుపయోగం చేసుకోవాలంటే సత్సంగాన్ని మించి ఈ ప్రపంచంలో ఇంకొకటి లేదు. ఉన్నతమైన ఆలోచనలు గలవారు, విద్వాంసులు, సదాచారులు, కర్తవ్య పరాయణులు, లోక క్షేమం కోరేవారు, దేశకాల పరిస్థితులను అర్థం చేసుకొనేవారు, మహాత్ముల సాంగత్యంలోనే తీర్చిదిద్దబడ్డారు.*

*మనం ఎప్పుడూ మంచి సాంగత్యంలో ఉండాలి. సత్సంగం ఎవరితో చేయాలో నిర్ణయం తీసుకోవాలి. మనిషి చూపే ఆడంబరాలకు ప్రభావితులు కాకూడదు. ఆతని ఆలోచనలు, చర్యలు సమయానుకూలంగా ఉపకరించేవేనా? అని ఆలోచించుకోవాలి. అవి మన మనస్సుకు నచ్చిన నాడే దగ్గరకావాలి. అటువంటి వ్యక్తి లభించేవరకు ఉత్తమ గ్రంథాలతోనే సత్సంగం చేయాల్సి ఉంటుంది.*

**సఫలత కావాలంటే సమర్పణం - ఐక్యత చెందాలంటే ఆత్మార్పణం.**

తత్వ చింతన

# మానవ అంతరంగంలో నిక్షిప్తమైన రెండు దివ్యశక్తులు

మానవుడు పరమపిత పరమాత్మ యొక్క అంశ. అతనిలోని శక్తి, సామర్థ్యాలు అపారమైనవి. అనంతమూ, అమూల్యమైన విభూతులతో నిండిన మానవ జన్మ చాలా దుర్లభమైంది. ఇది సమస్తమైన ఐశ్వర్యములకూ ఖజానా. సిద్ధపురుషులూ, సంత్‌లూ, మహాత్ములూ, మహాపురుషులూ మొదలైన వారు మానవజీవితంలోకి వచ్చి అనంతమైన శక్తి, సామర్థ్యాలను మనకు అందించే ప్రయత్నం చేస్తున్నారు. మానవుని శక్తి ఎంత గొప్పదంటే అతడు దీనుడూ, దుర్బలుడూ, అసహాయుడూ, అశక్తుడూ ఎప్పుడుకూడ కాలేడు. ఇది కేవలం నివురు కప్పిన అతని ప్రతిబింబం. వాస్తవంగా మానవజన్మ ఎత్తడానికి దేవతలు కూడ పరితపిస్తారు. ఎందుకంటే దైవశక్తుల కంటె మానవశక్తి చాలా ప్రబలమైంది. అతనిలోని అమూల్యమైన తపశ్శక్తి సాకారమౌతుంది.

జీవితానికి ఆధారం దేహం. దేహం జీవితం యొక్క అభివ్యక్తి, వ్యక్తిత్వం దాని సుగంధం. ఈ వ్యక్తిత్వంలో అనేకమైన శక్తులు ఇమిడి ఉన్నాయి. ఈ శక్తులను పరిశీలించి నపుడు ముఖ్యంగా రెండు తత్వాలు గోచరిస్తాయి. మొదటిది సృజనాత్మక క్షమత, రెండవది ఆధ్యాత్మిక క్షమత. సృజనాత్మక క్షమత– తన అభిరుచినీ, సామర్థ్యాన్ని తెలుసుకొని నిర్దిష్టమైన లక్ష్యసాధనకు వినియోగించడం. సృజనాత్మకత విపరీతమైన పరిస్థితులను కూడ అధిగమించి తనశక్తిని లక్ష్యం దిశగా వినియోగిస్తుంది. ఆధ్యాత్మిక సామర్థ్యం ఇంతకంటె గంభీరమైంది. కష్టమైంది. ఈ సామర్థ్యం దుర్లభమైందే కానీ అసాధ్యం మాత్రంకాదు. ఇది అకస్మాత్తుగా ప్రకటితమై బూడిదను కూడ తిరిగి జ్వలింప చేయగల సామర్థ్యం కలది. ప్రారబ్ధాన్ని కూడ మార్చగలది.

సృజనాత్మక క్షమత పురుషార్థము. ఆధ్యాత్మిక క్షమత మహా పురుషార్థము. మనందరితో కూడ సృజన శీల సామర్థ్యం ఉంటుంది. సృజనాత్మకతలో అందరం వస్తాము. ప్రతి ఒక్కడిలో ఎదో ఒక గుణమూ, సామర్థ్యమూ ఉంటుంది. దాన్ని తెలిసికొని సరైన దిశలో ఉపయోగించి సఫలతయొక్క ఉన్నత శిఖరాన్ని చేరుకోగలడు. స్వతహాగ తనకు దేనియందు అభిరుచి ఉందో, ఏమి చేయాలో తెలియని వారికి సఫలత లభించదు. తన అభిరుచి ననుసరించి పనులు చేసినపుడు సగము సఫలత మాత్రమే కలుగుతుంది. మిగిలిన సగము సఫలత నైపుణ్యముతో పనిని చేయగలిగినపుడు లభిస్తుంది.

సృజనాత్మక క్షమతలో ప్రథమంగా మన అభిరుచి సృజనాత్మక విషయాల్లో ఉంటుంది. మన అభీష్టాన్ని నెరవేర్చుకోడానికి కావలసిన సాధన సంపత్తిని వెతుక్కుంటాము. గట్టి నిర్ణయం ఉన్నవాడికి సాధన సంపత్తి ఎక్కువగా ఉన్నా, తక్కువగా ఉన్నా తేడా ఏమీ ఉండదు. సాధన సంపత్తి ఎంత ఎక్కువగా ఉన్నప్పటికీ, సరైన కృషిలేకపోతే వ్యర్థమే. సాధన సంపత్తి ఎక్కువగా లేకపోయినా కృషితోముందుకు పోయేవాడి రథానికి ఏ అవరోధమూ ఉండదు. కర్మ వీరులెందరో ఎంతకొరత ఉన్నప్పటికీ సఫలతయొక్క శిఖరాగ్రాన్ని చేరుకున్నారు.

సాధన సంపత్తి ఎక్కువగా ఉండి శ్రద్ధ, నిష్ఠ లేకపోతే విలాసాలు పుట్టుకొస్తాయి. శ్రద్ధ, నిష్ఠ ఉన్నవారు చిన్న పూరి గుడిసెను కూడ పెద్ద మహలుగా చేయగలరు. కష్టాలనేవేవీ వీరి దారికి అడ్డురావు. ఇవి వారి సంకల్పాన్ని ఇంకా బలిష్ఠం చేస్తాయి. కష్టాలనే నిప్పుకు భయపడక ముందుకు సాగినవాడు బంగారం లాగ ప్రకాశిస్తాడు. ఘోరమైన ప్రతికూలాలున్నప్పటికీ విజయ పతాకాన్ని ఎగురవేయగలగడమే సృజనాత్మకత. విపరీతాలకు భయపడక సమర్థంగా ఎదుర్కొనడమే సఫలత. ఇదే సృజనాత్మక క్షమత పరిచయము.

సృజనాత్మక క్షమతకి గుర్తింపు ప్రబల పురుషార్థమాధారంగా జరుగుతుంది. కానీ కొన్ని కొన్ని సమయాల్లో పరమ పురుషార్థం ఉండి కూడ నిరాశ, అసఫలత చవిచూడవలసి వస్తుంది. అకస్మాత్తుగా వచ్చే ప్రారబ్ధాలు. ఉదాహరణకు సునామీలాంటి విపత్కర సంఘటనలు. చూస్తూ చూస్తుండగానే సునామీ అలలు అందర్నీ సాగర గర్భంలో ముంచేశాయి. పారబ్ధంయొక్క ఇటువంటి ఘోరాల్ని ఆధ్యాత్మికశక్తి ద్వారా సంరక్షించుకోగలరు.

ఆధ్యాత్మికత మానవుని అంతరంగ చేతనయొక్క సురమ్యమైన వైభవము. ఈ శక్తి సామర్థ్యాలు ఎప్పటికీ నశించేవి కావు. కొన్ని సమయాల్లో నిరాశ ఆవరించి ఇంక ఏదీ కూడ సంభవం కాదు అనిపిస్తుంది. వాల్మీకి రామాయణంలో ఇటువంటి పరిస్థితుల రమ్యమైన వర్ణన ఉంది. రావణుడు నాకు అంతటా జయమే. అపజయమనేదే లేదు అనుకుంటాడు. సీతాపహరణాన్ని ఇందుకు తార్కాణంగా తీసుకుంటాడు. సీతామాతకు కూడ నిరాశ, నిస్పృహ కలిగిన క్షణాలు ఉన్నాయి. తన మాయాజాలంతో రావణుడు సీత

ముండ్ల మధ్యనున్నా పువ్వు నవ్వుతుంది - ఇంట్లో ఉన్న మనిషే రోదిస్తాడు.

ఎదురుగా అనూహ్యమైన క్రొత్త రకపు భయాల్ని సృష్టించేవాడు. ఒకసారి రావణుడు రాముని ఖండిత శిరస్సును తెచ్చి సీతామాతకు చూపించాడు. కానీ ఆమె ఏమాత్రమూ నమ్మలేదు, చలించలేదు, ఆమె ఆధ్యాత్మిక శక్తి అటువంటిది. చివరకు గెలుపు ధర్మానిదీ, సత్యానిదీ అయింది. ఈ విజయం యొక్క రహస్యం ఆధ్యాత్మిక సామర్థ్యంలోనే ఉంది.

దేవతలు కూడ మానవీయ సామర్థ్యం ఎదుట నతమస్తకులు అవుతారు. మంత్రాలకు వారు వశీభూతులౌతారు. తాపసులూ, సాధకులూ మంత్రాన్ని సిద్ధింప చేసుకుంటారు. మానవుని ఆధ్యాత్మిక సామర్థ్యం అంతులేనిది, అతులనీయమైంది. తపస్సుచేత దీనిని వృద్ధిపొందించి వికసింప చేయవచ్చు. బ్రహ్మాండములోని తేజస్సును ధారణచేయవచ్చు. ఈ తేజస్సు చేత వారు ముల్లోకాలలో దేనినైనా చేయగల శక్తి గల వారౌతారు. ప్రారబ్ధంతో వారు ఆటబొమ్మతో ఆడిన విధంగా ఆడుతారు. ఆధ్యాత్మిక సామర్థ్యం చాలా దుర్లభమైంది. ఇందుకొరకు మహాపురుషార్థం చాలా అవసరము.

మానవుని అంతరంగంలో దివ్యమైన విభూతుల భాండాగారముంది. వీటిని గుర్తించి సద్వినియోగం చేసుకోవడమే అతి ముఖ్యమైంది. ఈ క్షమతలను ఎంతో నైపుణ్యంతో ఉపయోగించు కున్నవారు సఫలత అనే సోపానాల్ని అవలీలగా అధిరోహించగలరు. సృజనాత్మకతను వికసింపచేసుకొని భౌతిక సఫలతను పొందుతారు. ఆధ్యాత్మిక క్షమత వలన ఊహకందని రోమాంచకమైన ప్రపంచంలో ప్రవేశిస్తారు. వ్యక్తిత్వం యొక్క రెండు భాగములను వికసింపచేసికొన్నపుడే సమగ్రమైన వ్యక్తిత్వ నిర్మాణం సంభవమౌతుంది.

★★★

## వృద్ధురాలి దైవం

*ఒకనాడు తత్త్వవేత్త అయిన కన్ఫ్యూషియస్ దగ్గరకు కొందరు శిష్యులు వెళ్లి అడిగారు – 'గురువర్యా! నిజమైన జ్ఞాని ఎవరు!' కన్ఫ్యూషియస్ చెప్పాడు. 'మీరు అందరూ కూర్చోండి. ఇప్పుడే చెపుతాను. ఇలా చెప్పి ఆయన తన మిగిలిన పనులన్నీ పూర్తి చేసుకున్నాడు. దుస్తులు ధరించాడు. శిష్యులందరిని తీసుకొని బయటకు వెళ్ళాడు. అందరూ ఒక గుహలోనికి ప్రవేశించాడు. అక్కడ ఒక మహాత్ముడు నివసిస్తున్నాడు. ఆయన జపతపాదులతో, ఆత్మవిచారణతో కాలం గడుపుతున్నాడు. కన్ఫ్యూషియస్ ఆయనకు నమస్కరించి ఒక ప్రక్కగా కూర్చున్నాడు. తరువాత ప్రశాంతంగా అన్నాడు. 'భగవాన్, మేము మీ వద్దకు బ్రహ్మజ్ఞానాన్ని పొందడానికి వచ్చాము. చెప్పండి. భగవంతుడు ఎవరు? ఏమిటి? ఎక్కడ ఉంటాడు?' మహాత్ముడు మండిపడ్డాడు – 'మీరు నాశాంతిని భంగంచేయటానికి వచ్చారెందుకు? వెళ్ళండి. నా సాధనకు ఆటంకం కలిగించకండి. 'కన్ఫ్యూషియస్ శిష్యులను తీసుకుని బయటకు వచ్చాడు. ఆయన చెప్పాడు – 'ఈయన జ్ఞాని నిజమే కాని ఈయన సంసార విముఖుడు. సాంసారిక సుఖదుఃఖాలలో, పరిస్థితులలో ఈయనకు అశాంతి కనిపిస్తుంది. ఏకాంతస్థలంలో శాంతిని కోరే ఈజ్ఞాని తక్కువ స్థాయికి చెందిన జ్ఞాని.' తరువాత వారు ఒక గ్రామానికి వెళ్ళారు. అక్కడ ఒక నూనె తీసేవాడు గానుగ త్రిప్పుతున్నాడు. ఎద్దుకు గంతలు కట్టిబడి ఉన్నాయి. అతడు తనపనిలో పూర్తిగా మునిగి ఉన్నాడు. ఎంతసేపటినుండి పనిచేస్తున్నాడో తెలియదు. గానుగపై కూర్చుని హాయిగా ఏవో కూనిరాగాలు తీస్తున్నాడు. కన్ఫ్యూషియస్ ఇలా అడిగాడు – 'సోదరా! నీవు బ్రహ్మజ్ఞానివని విన్నాను. ఆ బ్రహ్మమును గురించి మాకు ఉపదేశించు' ఆ నూనె వర్తకుడు నవ్వి ఇలా చెప్పాడు – 'అయ్యా, ఈ ఎద్దే నా బ్రహ్మము, నా పరమాత్మ. దీనికి నేను సేవ చేస్తున్నాను, ఇది నాకు సేవ చేస్తున్నది. మేమిద్దరం సుఖంగా ఉన్నాము. సుఖమే బ్రహ్మము.' గురుదేవుడు బయటకు వచ్చాడు. తన శిష్యులతో ఇలా చెప్పాడు – 'ప్రబుద్ధుడైన గృహస్థునిగా ఉన్న నూనె వర్తకుడు, మధ్యమ జ్ఞాని. ఇతడి మనసులో జ్ఞానాన్ని సంపాదించాలనే కోరిక ఉంది. ఇతడు నెమ్మది నెమ్మదిగా తన గమ్యం వైపు ముందుకు పోతున్నాడు' వాళ్ళింకా ముందుకు వెళ్ళారు. గురువు చెప్పాడు – 'ప్రపంచ పరిస్థితులను అధ్యయనం చేయటం వలన మంచి జ్ఞానం లభిస్తుంది. గ్రంథం ఒక వ్యక్తి యొక్క దృక్పథం. ప్రవచనం ఒక వ్యక్తి యొక్క జ్ఞాన సాధనాసారం. అందువల్ల ప్రపంచాన్ని చూడు. తెలుసుకో, సత్యమైన వస్తువు ఎక్కడ ఉంది? మిథ్య ఎక్కడ ఉంది? స్పష్టమై, నిర్వికారమైన సత్యాన్ని నీ బుద్ధి స్వయంగా స్వీకరిస్తుంది. అట్టి దానిని నీ జీవితంలో అవలంబిస్తే మేలు కలుగుతుంది' ఇలా సంభాషణ చేస్తూ వారు ఒక వృద్ధురాలి ఇంటి వాకిలి వద్ద ఆగారు. పిల్లలు చాలా మంది వృద్ధురాలి దగ్గర అల్లరి చేస్తున్నారు. ఆ అవ్వ రాట్నం ఒడుకుతోంది. నడుమ నడుమ ఎవడో పిల్లవాడు అడిగితే మంచినీళ్ళు ఇస్తోంది. ఇంకొకడు అల్లరి చేస్తుంటే మందలిస్తోంది. మరొకడిని నవ్వుతూ నచ్చచెబుతోంది. పిల్లలు ఆడుకుంటుంటే తాను తన రాట్నం ఒడకటం మొదలు పెడుతోంది. కన్ఫ్యూషియస్ అక్కడికి రాగానే పిల్లలంతా పరుగెత్తి పోయారు. ఆయన అడిగారు – 'అవ్వా! దయచేసి నాకు చెప్పు. నీవు భగవంతుడిని చూశావా?'*

*అవ్వనవ్వి ఇలా చెప్పింది – 'ఆ,ఆ – ఆ, ఆ నాయనా వాడు ఇప్పుడే, ఇక్కడే ఆడుకుంటున్నాడు. నిన్ను చూస్తూనే పారిపోయాడు. అల్లరి, పిల్లల కలహం, నా సముదాయింపు, మళ్ళీ నవ్వు, ఇంతలో వినోదం. ఇదే కదా భగవంతుడంటే. నీవిక్కడికి రావడంతోనే వాడు వెళ్ళిపోయాడు' కన్ఫ్యూషియస్ శిష్యులను తీసుకొని ఇంటికి తిరిగి వచ్చాడు. నిష్కామజ్ఞాన స్వరూపమైన ఈ అవ్వయే నిజమైన జ్ఞాని. ఏదైనా ప్రయోజనాన్ని లేదా లాభాన్ని ఉద్దేశించినది జ్ఞానం కాదు. జ్ఞానం అనేది కామము నుండి విముక్తమైన ముక్త స్థితి. ఆ స్థితి యొక్క అనుభవరూపం జ్ఞానము.*

**విశ్వం గుర్తించే అరవిరిసిన కుసుమం - అదేకదా చిరుదరహాసం.**

ధారావాహిక : భక్తిగాథ-14

# సంప్రదాయం, సంయమనం భక్తికి అనివార్యం

**నమస్తే రుద్రమన్యవకఉతో తకఇషవే నమః ॥ బాహుభ్యాముత తేనమః (1) యా తే రుద్ర శివాతనూర ఘోరాఽ పాపకాశినీ ॥ తయా నస్తన్వా శంతమయా గిరిశంతాభిచాకశీహి** (2)

దుఖాఃల్ని పోగొట్టే ఓ రుద్రదేవా ! నీ క్రోధమునకు నమస్కారము. నీ అగ్నినేత్రానికి నమస్కారము. నీ రెండు భుజములకు నమస్కారము (1) పర్వత శ్రేష్ఠమైన కైలాసగిరిపైన ఉంటూ సమస్త విశ్వానికీ కల్యాణమును కలుగుచేయు రుద్రదేవా ! మంగళదాయకమూ, సౌమ్యమూ , పుణ్యప్రకాశకమైనటువంటిది నీ శరీరము, అనంత సుఖములను ప్రకాశింపచేయు మీ శరీరముతో మావంక చూచి మమ్మల్ని రక్షించండి. (2)

మధురమైన మేఘమంద్ర స్వరాలతో ఋషులూ, దేవతలూ, తమ శివార్చనను పూర్తిచేస్తూ శివరాత్రివ్రత పారాయణ పూర్తి చేశారు.

అందరి మనస్సులలో శివభక్తి మధురగానం ప్రతిధ్వనిస్తోంది. ఇటువంటి భక్తిమయక్షణాలలో పులస్త్య మహర్షి భక్తిని గురించిన తత్వచర్చను ఇలా ప్రారంభించారు– "భక్తికి అర్థం అన్ని కాలాలలోనూ సార్థకమౌతుంది. భావశుద్ధి లేనిదే ఆలోచనలు కానీ, జీవనం కానీ, విశుద్ధం కావు. భవిష్యత్తులో ఏ మానవుల భావనలు స్థిరంగా ఉండక మారుతుంటాయో, వారి జీవితాలు దారితప్పి నిలకడలేని మార్గంలో నడుస్తాయి. మరీచి మహర్షి వారి మాటలను సమర్థిస్తూ ఇలా అన్నారు–" మీరు యథార్థమే చెప్పారు ఋషివర్యా! భావనలకు మర్యాద, సంయమనం అనే ఆనకట్ట ఉండాలి. అదిలేకుంటే భావనలు పతనమయ్యే ప్రమాదం ఉంటుంది. భావనలు పతనమైనపుడు జీవనం పతన మార్గంలో పయనించకుండా ఎవరూ అడ్డుకోలేరు.

ఋషులూ, దేవతా సమూహమూ వీరి చర్చను ఆలకిస్తున్నారు. నవసృష్టి సందేశాన్నిచ్చే విశ్వామిత్రబ్రహ్మర్షి దేవర్షి వేపు దృష్టి మరల్చారు. భావసమాధిలో లీనమైన దేవర్షిని వారి దృష్టి మేల్కొలిపింది. వారు సచేతనులై మందహాసం చేస్తూ ఇలా అన్నారు– "నేను నా తదుపరి భక్తి సూత్రాన్ని వినిపిస్తాను.

**అన్యథా పాతిత్యాశంకయా** (13)

"లేకపోతే పతనమయ్యే సందేహం కలుగుతుంది."

ఈ సూత్రంలోని మర్మమిది– "శాస్త్ర మర్యాదలూ, సంయమనమూ అనే ఆనకట్టవల్ల భావనలు సురక్షితంగా ఉండాలి. లేకపోతే పతనమయ్యే ప్రమాదం ఉంటుంది."

ఈ మాట వింత అయినది. విచిత్రమూ, విలక్షణము అయినది. ఒక దృష్టితో చూచినపుడు అలౌకికమైన భక్తికి మర్యాదలనే లౌకికబంధాన్ని కలిగిస్తున్నట్లుంది. కానీ ప్రగాఢమైన చింతనలో ప్రవేశించినపుడు సత్యమేమిటంటే– ఎవరికీ పరమహంసలుగా ఉండాల్సిన అవసరం లేదు. ఈ శరీరమున్నంత వరకు మర్యాదలను పాటించాలి. దేహభ్రాంతి లేనపుడూ, అస్తిత్వమే భగవంతునిలో లీనమైనపుడూ– ఆ మాట వేరు.

ఈ విషయం అందరికీ అవగతమైంది. అగ్నితో సమానమైన తేజస్సుగల అంగీర మహర్షి ఇలా అన్నారు– "ఈ సందర్భంలో భూరిశ్రవుడనే బ్రాహ్మణుని కథ గుర్తుకువస్తున్నది. మీరు అనుమతిస్తే ఆ కథ వినిపిస్తాను." తప్పక చెప్పండి అని విశ్వామిత్రమహర్షి కుతూహలం వ్యక్తంచేశారు. ఇతర ఋషులందరూ శ్రుతి కలిపారు. అంగీర మహర్షి చెప్పడం మొదలుపెట్టారు–

భూరిశ్రవుడు అంగదేశంలో నివసించేవాడు. అతని బాల్యమూ, కిశోరావస్థా ఋషుల ఆశ్రమంలోనే గడిచాయి. సంధ్యావందనమూ, గాయత్రీ అగ్నిహోత్రమూ అతని నిత్య కర్మలుగా ఉండేవి.

గురుకులంలో అతను వేదాలు చదివాడు, ఋచీక మహర్షి అతనికి ఆచార్యుడు. ఋచీక మహర్షి ఆనాటి తత్వజ్ఞాన ఆచార్యుడుగా ప్రసిద్ధి చెందినవారు. పరమజ్ఞాని ఐన ఆ మహర్షి అంతఃకరణ నిరంతరం భవానీ భక్తితో నిండిఉండేది. వారు తమ

పరమాత్ముడెరిగిన ఒకే ఒక భాష - అదే మానవ హృదయఘోష.

శిష్యుని ఆ భక్తి మంత్రంతో దీక్షితులను చేశారు. తనప్రియ శిష్యునికి ఇలా బోధించారు– "ఎల్లప్పుడూ తపోనిరతునిగా ఉండాలి. ఇది ఆధ్యాత్మిక జీవితంలోని పరమరహస్యం. తన దారిలో నడిచే తపస్సంపన్నుణ్ణి తపస్సు సదా రక్షిస్తుంది. ఆపదలు బాహ్యమైనవైనా, అంతరంగములోనివైనా బీజావస్థలో తపోజలంలో మరుగుతాయి. తపస్వి ఐన వాని ఎదుట పరిస్థితులు నిలబడలేవు."

ఇది వారిచ్చిన చివరి ఉపదేశం. తర్వాత భూరిశ్రవుడు గృహస్థ జీవనంలో ప్రవేశించాడు. అతని ధర్మపత్ని సుచిత అచ్చంగా ఆ జగదంబ యొక్క అంశ. శీలం, సదాచారం ఆమె అణువణువునా నిండి ఉన్నాయి. ఆమె తపోనిరతుడైన భర్తతో సంతోషంగా ఉంది. కానీ దురదృష్టవశాత్తు భూరిశ్రవుడు దుష్టసహవాసాలలో పడిపోయాడు. వ్యసనపరులైన మిత్రులు లభ్యమయ్యారు. వారి సహవాసంతో అతడు చెడుమార్గంలో నడువసాగాడు. సంధ్య, గాయత్రీ అగ్నిహోత్రం– అన్నింటినీ వదలివేశాడు. ఉదయం సూర్యునికి అర్ఘ్యమివ్వాలన్న గుర్తు కూడ అతనికి ఉండడం లేదు.

ఋచీక మహర్షి ఉపదేశాలను భార్య గుర్తుచేసింది. తపోమార్గానికి తిరిగి వెళ్లవలసిందని ప్రాధేయపడింది. బలవంతపెట్టి, కోపగించి నియమాలను ప్రారంభింపచేసింది. కానీ రెండుమూడు వారాల్లోనే పరిస్థితి తారుమారైంది. మరల దుస్సాంగత్యంలో పడిపోయాడు. నగరంలోని వారాంగన మంగళ వద్దకు పోసాగాడు. ఆమె సాంగత్యం వల్ల ఇంట్లోని ధనాన్నంతా నష్టపోయాడు. డబ్బులేదని గ్రహించిన వేశ్య అతన్ని తన ఇంట్లో నుండి గెంటివేసింది. ఆమెవల్ల అతను తన సంసారాన్నీ, ధనాన్నీ, ఆరోగ్యాన్నీ, తేజస్సునీ అన్నింటినీ పోగొట్టుకున్నాడు.

ఇప్పుడతనికి తన గురుకులం గుర్తుకువచ్చింది. అప్పుడప్పుడు తనగురువైన ఋచీక మహర్షిని తలచుకొని కుమిలి కుమిలి ఏడ్చేవాడు. అతని భావపూర్ణమైన స్మరణ, తత్వదర్శిఐన ఋచీక మహర్షిని తాకింది. ఒకరోజు వారు భూరిశ్రవుని ఇంటికివచ్చారు. తేజోహీనుడైన భూరిశ్రవుడు భార్యతోసహా వారిని ఆహ్వానించాడు. పరమ తపస్విఐన మహర్షికి తనలాంటి భ్రష్టుడు శిష్యుడయినందుకు అతను సిగ్గుపడ్డాడు. కానీ మహర్షిమాత్రం ఇప్పుడు కూడ శిష్యునియందు కృపకలిగి ఉన్నాడు.

వారిలా ఓదార్చారు– వత్సా ! భయపడకు, ఇప్పటికైనా తెలివితెచ్చుకో. ఇదంతా నీవు తపస్సునూ, మర్యాదలనూ అవహేళన చేసినందువల్ల జరిగిన పరిణామమే. జగదంబ చాలా దయగలది. ఆమెకు దారితప్పిన తన సంతానాన్ని ప్రేమించడం తెలుసు." తర్వాత వారు భూరిశ్రవుని భార్య సుచితతో ఇలా అన్నారు– "పుత్రీ! నీ గర్భంలో జగదంబ యొక్క అంశ ఉన్నట్లు నాకు తెలుస్తున్నది. గర్భ కాలం పూర్తయ్యాక నీకు ఆడశిశువు జన్మిస్తుంది. ఆమెకు భవాని అని పేరు పెట్టు ఆమెను మాతయొక్క అంశగా, భావించు." భూరిశ్రవునితో కూడ ఇలా చెప్పారు– "తల్లి నామస్మరణ, ఆమె మీద భక్తి నీకు మేలు కలుగచేస్తాయి. నీ శ్రద్ధను తిరిగి సమకూర్చుకో, సత్యం మీద నమ్మకం ఉంచు. సంయమనమూ, మర్యాదా భక్తుని జీవితంలో అనివార్యాలు.

ఈ విధంగ ఉపదేశించి ఋచీక మహర్షి సెలవుతీసుకున్నారు. భూరిశ్రవుడు సంపూర్ణంగా చైతన్యవంతుడైనాడు. సద్గురువు ఉపదేశాలను ప్రతి అక్షరం పాటించాడు. చెదరిపోయిన భావనలన్నీ తిరిగి కలుసుకున్నాయి. జగదంబ నామస్మరణ చేత కాలుష్యమంతా కడిగివేయబడింది. భక్తి ప్రగాఢమైంది. ఆంతరిక సౌందర్యం తిరిగి చేకూరింది. బాహ్యంగా అది ప్రతిబింబించింది. మర్యాదా పాలనవల్ల భూరిశ్రవుని జీవితం రూపాంతరం చెందింది.

తమ కథను ముగిస్తూ అంగీర మహర్షి ఇలా అన్నారు–

"భక్తుడు మర్యాదలను విశేషంగా పాటించాలి. ఈ విషయమే నేను చెప్పదలచాను."

వారి మాటలకు దేవర్షి ఇంకొక వాక్యాన్ని జోడించారు– "ఎందుకంటే ఇందువల్ల లోకశిక్షణ కూడ జరుగుతుంది."

★★★

*ఈ పత్రికను మీరు చదివిన తర్వాత*
*ఈ నెలలో అయిదుగురిచేత చదివించండి.*

మానవత్వానికి మరుగు మానవ హృదయం - కావాలందుకే మృదుభావం.

బోధకథ

# నిజమైన తీర్థయాత్ర

ఒకచోట హరికథాకాలక్షేపం జరుగుతూ ఉన్నది. పిల్లలు, పెద్దలు అనేకమంది మిక్కిలి శ్రద్ధగా ఆలకిస్తున్నారు. హరిదాసు చిన్న చిన్న పిట్టకథల ద్వారా అనేక ఉదాహరణలు చెప్తూ ప్రజలను ఆకర్షించుకుంటున్నాడు. కథాసందర్భంలో తీర్థయాత్రల ప్రస్తావన వచ్చింది. తీర్థయాత్రలు చేయటంవల్ల గొప్పపుణ్యం వస్తుందని చెప్పాడు. శ్రోతలలో ఒక ధనవంతుడున్నాడు. ఆమాటలాతనికి బాగా నచ్చాయి. తక్కువ ఖర్చుతో స్వర్గప్రాప్తికి కుతూహలపడ్డాడు. ఇంటికి వెళ్లి భార్యను పిలిచి చెప్పాడు. వారంరోజులలో మనం బయలుదేరి కాశీ, రామేశ్వరం మొదలైన యాత్రలు చేసివద్దాం అన్నాడు.

ఆతని భార్యకామాటలు నచ్చలేదు. "యాత్రలకోసం ఇంత డబ్బును ఖర్చుపెట్టటం నాకిష్టం లేదు. కావాలంటే మీరు వెళ్లి రండి. నావంతు డబ్బును మాత్రం నాచేతికిచ్చి వెళ్లండి. ఆ డబ్బుతో అతిథి అభ్యాగతులను సేవిస్తూ ఒక ఉపయోగకరమైన పనిచేస్తాను. మీరు సంతోషంగా వెళ్లి రండి. మీ సంతోషానికి నేను అడ్డురాను."– అంది.

ఆ సేఠ్ ఒక్కడే బయలుదేరాడు. వెళ్లే సమయంలో భార్య ఒక గుమ్మడి పండును భర్త చేతికిచ్చింది. "ఏమండీ! ఈ గుమ్మడి పండును నా ప్రతినిధిగా తీసికొని వెళ్లండి. మీరెక్కడెక్కడ స్నానం చేస్తే అక్కడల్లా ఈ పండుకు స్నానం చేయించండి. ఏ దేవుని దర్శిస్తే ఆ దేవుని దర్శనం చేయించండి. తిరిగి వచ్చేటప్పుడు ఈ పండును భద్రంగా నాకు తెచ్చి ఇవ్వండి"– అని వేడుకుంది. భర్త సంతోషంగా "సరే" నన్నాడు. జాగ్రత్తగా గుమ్మడి పండును భద్రపరచుకుని తీసికొని వెళ్లాడు. ఇప్పటిలాగా ఆరోజుల్లో ప్రయాణ సౌకర్యాలంతగా లేవు. అతను తిరిగి రావటానికి సంవత్సర కాలం పట్టింది. భార్య చెప్పినదానిని "తు చ" తప్పకుండా చేసి గుమ్మడి పండును భార్య చేతికందించాడు.

తీర్థయాత్రలు చేసి క్షేమంగా తిరిగి వచ్చినందుకు సంతోషంగా బంధుమిత్రులకు విందు భోజనం ఏర్పాటుచేశాడు. ఆతని భార్య తీర్థయాత్రలు చేసిన గుమ్మడి పండును ప్రత్యేకంగా కూరగా వండించింది. రకరకాల శాకాలు వడ్డించబడ్డాయి. అతిథులంతా భోజనాలముందు సిద్ధంగా కూర్చున్నారు. "మహాపవిత్రమైన ప్రసాదం" అంటూ గుమ్మడి కాయకూరను అందరికీ కొంచెం కొంచెం వడ్డించింది. సంవత్సర కాలం గడవటాన ఆ గుమ్మడి పండు వడిలిపోయి ముడుచుకుంది. లోలోపల కొద్దిగా కుళ్లిపోయింది. అందువల్ల చిరుచేదుగా తయారైంది కూర.

పాపం అతిథులందరూ ప్రత్యేక ప్రసాదం అనుకుంటూ కన్నుల కద్దుకుని ముందుగా దానినే నోట్లో పెట్టుకున్నారు. వెంటనే 'ఛీ' అంటూ క్రిందకు త్రోసివేశారు. కొందరైతే ఇది మమ్మల్ని అవమానించటానికే వండించారని కోపోద్రిక్తులయ్యారు. ఆ ధనికుడు గజగజలాడుతూ ఆపండు విషయాన్ని పూర్తిగా వివరించి చెప్పి క్షమాపణ కోరాడు.

ఆ యిల్లాలు క్షమాపణలు కోరి ఈ విధంగా చెప్పింది– "ఈ పండు మావారితోపాటు తీర్థయాత్రలు చేసివచ్చింది. అన్ని చోట్ల పుణ్యస్నానాలు చేసింది. దైవదర్శనాలు చేసింది. కాని తినయోగ్యమైన రుచిని కోల్పోయింది. అదేవిధంగా మానవుడు తీర్థయాత్రలు చేసినంత మాత్రాన, యాత్రాస్థలాలలో కర్మకాండలు జరిపించిన మాత్రాన పుణ్యాత్ముడైపోడు. ఆ విషయాన్ని మీకు తెలియచెప్పటానికే నేనాపండును వండించాను. నా తప్పును మన్నించి తృప్తిగా భోజనం చెయ్యండి."

అందరూ కోపాన్ని మరచిపోయి ప్రశాంతంగా భోజనం చేశారు. వారి మధ్యలో ఉన్న ఒక సాధువు ఇలా బోధించాడు–

"నాయనలారా! ఇది నిజం. కేవలం కర్మకాండలవలన పుణ్య ఫలం దక్కదు. దానికీ గుమ్మడిపండే నిదర్శనం. పుణ్యప్రాప్తి జరగాలంటే మన జీవన క్రమంలో సంయమన ముండాలి. మన మనసుల్లో సేవాభావం రావాలి. మన శరీరాన్ని, మనస్సును అదుపులో ఉంచుకుని సేవాభావంతో దయాగుణంతో ధర్మకృత్యాలు చేయాలి. అందుకోసమే తీర్థయాత్రలు చేసిరావాలి. కేవలం కర్మకాండలపైననే దృష్టిని కేంద్రీకరించి అసలైన మానవతను మరచిపోకూడదు. అదే నిజమైన ఈశ్వరారాధన. అదే అసలైన తీర్థయాత్ర. ఈ విషయాన్ని తెలియ చెప్పటానికే ఈ యిల్లాలు ఈవిధంగా చేసి చూపించింది. ఆమెకు మనం ఋణపడి ఉన్నాం."

అందరూ అవునవును అంటూ ఆనందంగా తమతమ ఇండ్లకు వెళ్లిపోయారు.

★★★

గొప్పవారికైనా వస్తుంది మరణం - గొప్పదనానికే ఉండదు మరణం.

ధారావాహిక : దేవసంస్కృతీ సౌరభం-19

# దర్శనాలలోని వైరుధ్యాలు

భారతీయ దర్శనాలలోని విషయాలు సాపేక్షతతో కూడినవి. అనగా అవి దేశ, కాల, పాత్ర, పరిస్థితులకు చెందిన విభిన్న స్థితులను దృష్టిలో పెట్టుకుని ఏర్పాటు చేయబడినవి. వాటి సిద్ధాంతాలలో అక్కడక్కడ వైరుధ్యం కనబడితే, దానికి కారణం కాల, పరిస్థితులలో మార్పు అనిగ్రహించాలి. వాటిని ఉపయోగించేటప్పుడు దేశ, కాల, పరిస్థితులను దృష్టిలో పెట్టుకోవాలి. కళ్లుమూసుకుని వాటిని వాడడం మొదలుపెడితే మనం మన దార్శనిక సిద్ధాంతాల ప్రయోజనం పూర్తిగా పొందలేకపోవడమే గాక గడబిడలను, అవినీతిని, అవ్యవస్థను కలిగించినవారమౌతాము.

ఉదాహరణకు భాగ్యవాదము, ఈశ్వరేచ్ఛ అన్నవాటిలో మనకు నమ్మకముంది. ఏదైనా జరగకూడనిది, ఇష్టంలేనిదీ జరిగితే మనం, "ఇదే నా భాగ్యము (అదృష్టం)లో కలదు" అని, "ఇది భగవదేచ్ఛ" అని అనుకుంటాం. ఎంత ప్రయత్నించినా కూడా మనిషికి తనపనిలో సఫలత కలగనప్పుడు, నిరాశ కలిగినప్పుడు చిత్తానికి శాంతిని కలిగించడానికి వాటిని అనుకోవడం ఉచితమే! దాని వల్ల మనస్సు కొంచం చల్లపడుతుంది. కానీ మనం ఏదైనా ఉపయోగం లేని పనిచేస్తే, లేదా మన మూర్ఖత్వమువలన హాని పొందితే– అది నా భాగ్యఫలమని, ఈశ్వరేచ్ఛ అని అనడం సరికాదు. మనము ఆవిధంగా తలిస్తే అది అజ్ఞానమౌతుంది. పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని పైన తెలిపిన దార్శనిక సిద్ధాంతాలను వాడుకోవాలి.

ఇంకొక సిద్ధాంతం కూడా ఉంది. "నేను ఈశ్వరుడను" అను ఈ వేదాంత సిద్ధాంతం మనం మనలోపల ఈశ్వరత్వం కలదని భావించినప్పుడు వర్తిస్తుంది. ఈశ్వరత్వమంటే సద్గుణాలు, దేవతలవంటి గుణాలు, దైవీ సంపద, మంచి లక్షణాలు, ఇవన్నీ మన నడవడిలో నిండి ఉండాలి. మనం వాటిని వికసింప జేసుకుంటూ పోవాలి. సిద్ధాంతాన్ని పురుషార్థంనుంచి, కృషినుంచి, పరిశ్రమనుంచి తప్పించుకోవడానికి కూడా వాడుకోవచ్చు. మనం అంతా ఎరిగినవారమని, మనం స్వయంగా ఈశ్వరులమేనని, మేము మమ్మల్ని బాగుచేసుకోవలసిన అవసరమే లేదని– మొదలైన వాటిని కూడా అనుకోవచ్చు.

మరొక సిద్ధాంతముంది. అది భార్యాభర్తల శరీరాలు రెండూ ఒకే ఆత్మకు చెందినవేకదా? దాంపత్య జీవనాన్ని సుఖంగా, భార్యాభర్తలను పరస్పరం సంతుష్టితో ఉంచడానికి ఇది అమూల్యమైన స్వర్ణ సూత్రం. దీనియొక్క ఉద్దేశ్యం భార్యాభర్తలు చివరిదాకా ఒకరికొకరు ప్రేమపాశంతో బంధింపబడి ఉండాలని, వేరుకాకూడదని. ఐతే భర్త మరొక స్త్రీపట్ల, భార్య పరపురుషుని యందు మనసు పడకూడదు. భర్త చనిపోతే, లేదా భార్య చనిపోతే ఇద్దరిలో ఒకరు వేరయిపోతారు. అప్పుడుపైన తెలిపిన సిద్ధాంతాన్ని విడిచివేయాలి. చివరికి ఎప్పుడో ఒకప్పుడు విడిపోవడం జరుగుతుంది. ఎల్లప్పుడూ ఒకరితో ఒకరు కలిసి ఉండడము కుదరని పని. అట్టిస్థితిలో చిత్తాన్ని శాంతంగా ఉంచడం కోసం, సంతులనంతో ఉంచడంకోసం, "పతి, పత్నులు జలప్రవాహంలో కొట్టుకుపోతున్న కట్టెయొక్క రెండుముక్కలవంటివారు, ప్రవాహవేగంలో కొట్టుకుపోతూ ఒకదాని దగ్గరకింకొకటి వచ్చి కొంతదూరంవరకూ కొట్టుకుపోయి తరువాత వేరవుతాయి, అదేవిధంగా జీవన భాగస్వామి మరణిస్తే శోకించరాదు, అనేక జన్మలలో మన ఆత్మలు అనేక శరీరాలను ధరించాయి." అని చెప్పవచ్చు. ఒకప్పుడు మనం పతిగా, మరొకప్పుడు పత్నిగా శరీరాలను ధరించి వచ్చాం. పూర్వజన్మలలో మనకు ఎవరెవరితో సంబంధముందో తెలియదు. కనుక శోకించడము వ్యర్థము." అని.

మనదగ్గర సంతోషంగా ఉండడానికి కావలసిన శిక్షణ ఇవ్వబడుతుంది. మనం చేసే ప్రయత్నాలకు తగిన ఫలితం రానప్పుడు ఈ యోజన పనికివచ్చునట్లుగా రూపొందింపబడింది. దేనికీ కర్త, ధర్తాకాని వ్యక్తి తాను సంతోషాన్ని అభ్యాసం చేస్తున్నానని అంటే ఆమాట హాస్యాస్పదమే ఔతుంది. పరిస్థితులు మనను వివశు లను చేసినందువలన పురుషార్థం చేయడానికి స్థానంలేని స్థితిలో కూడా సంతోషంగా ఉండడం తగిన పద్ధతి. కఠినమైన సంఘర్షణ నుంచి పారిపోవడానికి ఈ నియమాన్ని ఏర్పాటు చేయలేదు. హిందూ సంస్కృతికి చెందిన ఏ సిద్ధాంతాలు మీకు లభించాయో వాటిని పరిస్థితుల అనుకూలతను గమనించి దేశ, కాల, పాత్రతలను పూర్తిగా దృష్టిలో పెట్టుకుని ప్రయోగించాలి. అవి వాటి వాటి స్థానంలో మంచివే కనుక వాటిని ఆచరణలో పెట్టడం జరగాలి.

★★★

క్షమాగుణం చాల మంచిది - క్షమించి మరచిపోవడం మరీ మంచిది.

గీతాజయంతి ప్రత్యేకం

# యోగత్రయం-మన సంకల్పం

శ్రీమద్భగవద్గీతలో 18 అధ్యాయాలున్నాయి. ఇది ఒక అలౌకిక గ్రంథం. ఈ మహాసాగరంలో 'జ్ఞాన-కర్మ-భక్తి' యోగాలు మూడు త్రివేణీ సంగమంలా పెనవేసికొని ఉన్నాయి. ఈ అధ్యాత్మిక సంగమంలో స్నానం చేసినవారు ఈ సంసారం అనే మాయా చక్రంనుండి విడిపడిపోతారు. సంసార సాగరాన్ని ఈదుకుంటూ ఒడ్డుకు చేరడానికి సమర్థులు అవుతారు. ఈ త్రివేణీ సంగమ సూత్రాలు నడుస్తున్న కాలానికి చాలా ఉపయోగపడతాయి. ఆధ్యాత్మిక ప్రపంచంలో విజయాన్ని చేకూరుస్తాయి. ఈ జ్ఞాన-కర్మ-భక్తి యోగాలలోని శ్లోకాలను మన పరిస్థితికి అనుకూలంగా మలచుకుని ఉపయోగించుకోవాలి. అవి అన్ని వేళలా, వివిధములైన సందర్భాలలో చక్కగా ఉపయోగపడతాయి. వాటిని సద్వినియోగం చేసికోవడంలోనే మనం వివేకాన్ని ఉపయోగించాలి.

గీతలో ఉన్న కర్మ-జ్ఞాన-భక్తి యోగాలలోని మార్మిక విషయాలను శోధించి చూచినట్లైతే క్రమంగా వ్యావహారిక-సైద్ధాంతిక- భావనాత్మక ప్రయోజనాలు లభిస్తాయి. వాటిద్వారా క్రియాశీలురు, ఆలోచనాపరులు, భావుకులు తయారు కాగలుగుతారు. ఇదే విషయాన్ని కృష్ణపరమాత్మ క్రింది శ్లోకం ద్వారా స్పష్టం చేశాడు.

**లోకేస్మి న్ద్వి విధా నిష్ఠాపురాప్రోక్తామయాన ఘ ।**
**జ్ఞానయోగేన సాంఖ్యానాం కర్మయోగేన యోగినామ్ ॥**

-6-6

భావం: ఈ మానవలోకంలో రెండు విధాలైన నిష్ఠలు ఉన్నాయని నేను మొట్టమొదట చెప్పాను. వాటిలో జ్ఞాననిష్ఠ జ్ఞానయోగం నుండి, యోగనిష్ఠ కర్మయోగం నుండి చెప్పబడ్డాయి.

నిష్ఠ అంటే ఏమిటి?- మనస్సును స్థిరంగా ఉంచుకుని కర్మయోగమును, జ్ఞానయోగమును సంపాదించుకోవాలి. శాశ్వత-అశాశ్వత విషయాల్లోను, అనుకున్నది లభించినా-లభించకపోయినా, కోర్కెలు తీరినా- తీరకపోయినా తటస్థభావంతో నిర్లిప్తంగా ఉండగలగడమే కర్మయోగం. అశాశ్వతమైన ప్రాపంచిక విభవాలకు ప్రభావితులు కాకుండా ఉండి, పరమాత్మవైపు స్థిరంగా ఉండగలగడమే జ్ఞానయోగం. కాని కృష్ణపరమాత్మ చెపుతున్నాడు-

**"ఉత్తమః పురుషస్త్వన్యః పరమాత్మే త్యుదాహృతః ।"**

"ఆ పరమాత్మ వినాశనానికి అతీతుడు. శాశ్వతత్వానికి ఉన్నతుడు. అందువల్లనే శాస్త్రాల్లో, వేదాల్లో పురుషోత్తముడుగా ప్రసిద్ధి చెందాడు. అటువంటి పరమాత్మునిపట్ల ఎల్లప్పుడూ శరణాగతి కలిగి ఉండడమే భక్తియోగం. అందువల్ల అశాశ్వత ప్రధానంగా కర్మయోగం, శాశ్వతత్వానికి ప్రధానంగా జ్ఞానయోగం, పరమాత్మ ప్రధానంగా భక్తియోగం ఆధారపడి ఉన్నాయి.

అన్నింటిలో కర్మయోగమే ఈ విశ్వంలో మూలాధారమైనది. కర్మయోగం అంటే- నిరాసక్తంగా ఉండి, నిష్కామభావనతో శ్రమించి, సామర్థ్యాన్ని చూపగలడం. కర్మయోగంలో తానుచేసిన పనులన్నీ ఇతరులకొరకే ఉపయోగపడతాయి. ఫలితాన్ని ఆశించి చెయ్యకూడదు.

**"కర్మణ్యే వాధి కారస్తే మా ఫలేషు కదాచన ।"** వ్యక్తి తనకోసం కర్మలు చేస్తే బంధనాల్లో చిక్కుకుంటాడు. ఇతరుల ప్రయోజనాల కోసం కర్మలు చేసినట్లైతే, దాని ఫలితంగా బంధనాలనుండి స్వయంగా బయటపడతాడు. అప్పుడే కర్మయోగం అనుభవానికి వస్తుంది. నిష్కామ కర్మయోగంవల్ల మానవుని బంధనాలు విచ్చిపోతాయి. బంధనాలు విడిపోవడంతో అంతరంగం నిర్మలం అవుతుంది. నిర్మలమైన మనస్సులో జ్ఞానం అంకురిస్తుంది.

గీతలోని తత్వజ్ఞాన స్వరూపాన్ని జ్ఞానం పరిచయం చేస్తుంది. సహజంగా జ్ఞానం తత్వస్వరూపాన్నే కాకుండా, ఈ జగత్తునూ పరిచయం చేస్తుంది. ప్రపంచపు రీతి తెలియగానే పండినపండు చెట్టు నుండి రాలిపడినట్లు ఇహలోకంపై వ్యామోహం పటాపంచలవుతుంది. జ్ఞానోదయంకాగానే నిజస్వరూపం తెలిసివస్తుంది. ఆవిధంగా కాక ప్రపంచపు పోకడను సమర్థించినట్లైతే సుఖాలమీద కోర్కెలు పెరిగిపోతాయి. కోర్కెలు పెరిగిన వెంటనే సకల పాపకార్యాలు వెంటబడి వస్తాయి. తత్వజ్ఞానం కలిగిందంటే ఈ మోహాలు, కోర్కెలు సకలం నశించి పోతాయి. పవిత్రత జీవితాన్ని పెనవేసికుంటుంది. అందువల్ల విశ్వంలో జ్ఞానాన్ని పోలిన అంశం మరొక్కటిలేదు. మానవునికి పవిత్రతను ఆపాదించేది జ్ఞానం ఒక్కటి మాత్రమే అని తెలుసుకోవాలి.

చెడును వదలాలంటే ఫస్టు - దగ్గరే ఉంచుకో మంచిని గూర్చిన లిస్టు.

గీతలో కృష్ణ పరమాత్మ చెపుతున్నాడు–

**నహిజ్ఞానేన సదృశం పవిత్రమిహ విద్యతే ।**

**తత్స్వయం యోగ సంసిద్ధః కాలే నాత్మని విన్దతి ॥**

ఇటువంటి జ్ఞానాన్ని పొందడానికి శాస్త్రాల్లో 8 రకాలైన సాధనలను చెప్పారు. (1) వివేకం (2) వైరాగ్యం (3) శమము మొదలైన ఆరు సంపదలు (శమము, దమము, శ్రద్ధ, ఉపరతి, తితిక్ష, సహనము) (4) ముముక్షత (5) శ్రవణము (6) మననము (7) నిదిధ్యాసనము (8) తత్త్వ పదార్థ శోధన. వీనిలో మొట్టమొదటిది వివేకం. దీని ద్వార సత్య– అసత్యాలకు, ఉచిత– అనుచితాలను మధ్యగల భేదాన్ని గ్రహించవచ్చు. సత్యా సత్యాలను వేర్వేరుగా చూడగలిగి, అసత్యాన్ని వదిలిపెట్టడమే వైరాగ్యం. ఇంద్రియ భోగాలనుండి మనస్సును మళ్లించడం శమము" ఇంద్రియాలను కోర్కెల నుండి దూరంగా తీసికొనిపోవడం దమము. మంచి ఆలోచనలు, భావనలు, ఈశ్వరభక్తి మొదలైన వాటిపై నమ్మకం ఉంచడం శ్రద్ధ. జీవన వ్యాపారాలనుండి విముఖంగా ఉండడం ఉపరతి. చల్లదనం, వేడిమి వంటి ద్వైదీభావాలను ఇష్టపూర్తిగా సహించడం తితిక్ష. అంతరంగంలో ఎటువంటి అనుమానాలు లేకుండ ఉండడం సహనం. సంసార చక్రాన్నుండి విడిపడి పోవాలన్న తీవ్రమైన కోరిక ముముక్షత.

ముముక్షత కలిగిన తర్వాత సాధకుడు పదార్థాలను, కర్మలను త్యజించి, బ్రహ్మనిష్ఠ గలిగిన గురువును సంపాదించుకుంటాడు. గురువుదగ్గర ఉంటూ శాస్త్రాలను, శాస్త్రార్థాలను వినడం, నిర్ణయాలు చేసికోవడం శ్రవణం. శ్రవణం వలన అనేక సందేహాలకు ఆధార సహితంగా సమాధానాలు దొరుకుతాయి. పరమాత్ముని గూర్చి అన్ని వేళలా ఆలోచించడం మననం. ప్రపంచపురీతులను సమర్థించడం, పరమాత్మపై అవిశ్వాసంతో వ్యతిరేకంగా మాట్లాడడం విపరీతభావన అనిపించుకుంటుంది. ఈ విపరీతభావనను తొలగించుకోవడమే నిదిధ్యాసనం. ప్రకృత విషయలనుండి విడివడి, ఒక్క పరమాత్మ తత్వాన్ని మాత్రమే ఆలోచించడం తత్వపదార్థసంశోధన. ఈవిధంగా జ్ఞానప్రాప్తి కోసం ఈ 8 సాధనాలతో పరమాత్మునివైపు పయనించడం జరగాలి.

జ్ఞానయోగసాధకుడు అన్ని సంబంధాలను, అన్ని పదార్థాలను అశాశ్వతమైనవిగా భావించి పరమాత్మునివైపు పయనించాలి. కర్మయోగ సాధకుడు దీనిని చాల తేలికగా భావిస్తాడు. ఆతడు పదార్థాలను ఇతరుల సేవలోనే వినియోగిస్తాడు. జ్ఞానయోగికి తీవ్రమైన వైరాగ్య భావన కావాలి. ఆతడు అందరిలో పరమాత్మను, పరమాత్మలో అందరినీ దర్శిస్తాడు. ప్రతిప్రాణిలో ఈశ్వరుని దర్శించి గౌరవంగా, ప్రేమగా సేవించడం భక్తి మార్గసాధన. జ్ఞానయోగం, కర్మయోగంలో "నేను" అన్న పదం (అహంకారం) నష్టాన్ని కలిగిస్తూ ఉంటుంది. అహంకారాన్ని నశింపచేసికోవడం చాల కష్టం. కాని భక్తియోగంలో అహంకారం తనంత తానుగానే మాయం అయిపోతుంది. 'నేను' అన్న పదం అంతరించిపోతుంది. భక్తి యోగసాధకుడు సమదర్శి అవుతాడు.

'నన్ను' వెలుగులోకి తెచ్చినవాడు, నాకు ఆధారభూతమైనవాడు అయిన పరమాత్ముడు నిత్యుడు. అందువల్ల అశాశ్వతమైన ఈ జడజగత్తుకు స్వరూపంతో సంబంధంలేదు. స్వరూపానికైతే భగవంతునితో సహజసిద్ధమైన సంబంధం ఉంది. ఈ సంబంధాన్ని దృష్టిలో పెట్టుకునే 'నేను'తో నిజమైన పరిచయం కలుగుతోంది. ఈ ఘనిష్ఠ సంబంధాన్ని గుర్తించిన మరుక్షణమే మనస్సు భగవంతునిలో లీనమైపోతుంది. కృష్ణపరమాత్మ గీతలో చెపుతున్నాడు–

**"నివసిష్యసి మయ్యేవఅత ఊర్ధ్వం న సంశయః ।"**

12/8

ఇక్కడ "అతఊర్ధ్వం" అంటే– "మనస్సు, బుద్ధి భగవంతునిలో పూర్తిగా లీనమైపోయిన మరుక్షణంలో భగవంతుని దర్శనం లభిస్తుంది."

అప్పుడు ప్రపంచం మీద విరక్తి, భగవంతుని మీద అనురక్తి కలుగుతాయి. కట్టెపుల్లను మండించిన, అగ్ని, అందులోని తేమ సంపూర్ణంగా అర్పణ చేసుకొంటాయి. తరువాత తమ ఇష్టదైవంలో లీనమైపోతాయి. అదే విధంగా విరక్తి ఆసక్తిని చంపివేస్తుంది. తరువాత పరమాత్మ సన్నిధిలో శాంతిని పొందుతుంది. భక్తియోగం అంటే ఇదే.

ఈ సంవత్సరం డిసంబరు 9వ తేదీన గీతాజయంతి పర్వదినం వచ్చింది. ఈ పవిత్రమైన పర్వదిన సందర్భంగా గీతలోని జ్ఞాన–కర్మ–భక్తియోగాల గురించి క్లుప్తంగా తెలుసుకున్నాం. దీనిలో ఏ కొంచెం పాటించగలిగినా జీవితం సార్థకమౌతుంది. ఈ గీతా మహాసంగమంలో ప్రతీవ్యక్తీ, ప్రతీ రోజూ మునిగిలేస్తూ ఉండాలి. ఆ పవిత్రస్నానాల వల్ల మన మనస్సులో ఉన్న దోషాలన్నీ కరిగిపోతాయి. వాటి స్థానంలో భక్తిరేఖలు ప్రకాశిస్తూ ఉంటాయి. అందువల్ల గాయత్రీమంత్రంలాగానే గీతను కూడ ప్రతీరోజు పఠించడం మన కర్తవ్యం. ఈ గీతా జయంతి సందర్భంగా మనం ఈ సంకల్పాన్ని తీసుకోవాలి.

★★★

ఎవరూ వద్దనటం లేదు ఆంగ్లం - అలాగని ఆవల పెట్టొద్దు ఆంధ్రం.

ధారావాహిక : గాయత్రీ మహావిజ్ఞానం-37

# బిందు సాధన

బిందువుయొక్క అర్థం 'వీర్యం' అని 'అన్నమయ కోశం' అనే ప్రకరణంలో చెప్పబడింది. ఆనందమయకోశ సాధనలో బిందువు యొక్క అర్థం 'పరమాణువు' అని చెప్పడం జరిగింది. బ్రహ్మ సామీప్యాన్ని చేరుకోగలుగుతాం. అప్పుడే సూక్ష్మాతి సూక్ష్మమైన అణువుదాకా మనం వెళ్లిన తర్వాత మాత్రమే బ్రహ్మంయొక్క సామీప్య సుఖాన్ని అనుభవించగలుగుతాం. అందువల్ల బిందువును 'బ్రహ్మ చర్యం' అని కూడ అంటారు.

ఏ వస్తువునైనా చూర్ణంచేసి మైక్రోస్కోపు లోనుండి చూస్తే చిన్న చిన్న ముక్కల రాశి కనిపిస్తుంది. ఈ ముక్కలు వేరొక రకమైన ముక్కలతో కలసి తయారవుతాయి. వీటిని కూడ వైజ్ఞానిక యంత్రాలతో పగులగొడితే పరమాణువులు వస్తాయి. వాటిని పగులగొట్టడానికి వీల్లేకుండా కనిపిస్తాయి. ఈ పరమాణువులలో ఇప్పటివరకు 100 రకాలు గుర్తించబడ్డాయి. వాటినే 'అణుతత్వం' అంటారు.

అణువులు రెండు రకాలు. (1) సజీవ అణువు (2) నిర్జీవ అణువు. రెండూ కూడ పిండం వలె గుండ్రంగా లేక ఒక గ్రహంలాగా కనిపిస్తాయి. కాని సహజంగా వాటిలోపల కూడ ముక్కలు ఉంటాయి. ప్రతిఒక్క అణువు తన పరిధిలో మహావేగంగా తిరుగుతూ ఉంటుంది. భూమికూడ సూర్యుని చుట్టూ తిరగడానికి సెకనుకు 18 మైళ్ల వేగంతో ప్రయాణిస్తుంది. కాని ఈ 100 రకాల పరమాణువుల వేగం సెకనుకు 4000 మైళ్లు అని చెపుతున్నారు.

ఈ పరమాణువు కూడ అనేక విద్యుత్కణాలతో కలసి తయారు అవుతుంది. ఇందులో రెండు జాతులున్నాయి. (1) ఋణకణము (2) ధనకణము. ధనకణము చుట్టూ ఋణకణాలు సెకనుకు 186,000 మైళ్లవేగంతో పరిభ్రమిస్తూ ఉంటాయి. ధనకణాలు ఋణకణాల ప్రదక్షిణమే కేంద్రమైనప్పటికీ అవి ప్రశాంతంగా ఉండవు. భూమి సూర్యుని చుట్టూ తిరుగుతూ ఉంటే, సూర్యుడు కృత్తికా నక్షత్రం చుట్టూ ప్రదక్షిణ చేస్తూ ఉంటాడు. అదేవిధంగా ధనకణం కూడ పరమాణువుయొక్క అంతర్గతికి కారణం. ఋణకణం నిరంతరం ప్రదక్షిణ చేయడానికి కావలసిన శక్తిని సూర్యునినుండి గాని, అగ్నినుండి గాని పొందుతుంది.

పరమాణువు నందలి శక్తిపుంజం ఒక్కటి బ్రద్దలయిందంటే లండన్ వంటి మహానగరాలు మూడింటిని భస్మంచేసి వేస్తుందని శాస్త్రవేత్తలు చెపుతున్నారు. ఈ విషయం తెలిసికూడ ఆటంబాంబును తయారు చేసికున్నాము. ఈ పరమాణువు విస్ఫోటన ఫలితాన్ని మనం రెండవ ప్రపంచయుద్ధంలో రుచి చూడడం జరిగింది. ఇంతకన్నా భయంకర విషయాలను గూర్చి శాస్త్రజ్ఞులు హెచ్చరిస్తూనే ఉన్నారు.

పరమాణుశక్తి సంగతి సరే. ఇప్పుడు వాని అంగాలైన ఋణ, ధనకణాల సూక్ష్మభాగాలను గురించి తెలుసుకుందాం. అవి కూడ వాటికన్నా సూక్ష్మతరమైన పరమాణువులతో తయారైనాయి. ఋణ కణాల్లో సెకనుకు 186,000 మైళ్ల వేగంతో పరిభ్రమణం జరుగుతుంది. ఇప్పుడు వానిలో ఉన్న అంతర్గత కర్షాణువుల గూర్చిన పరిశోధన జరుగుతోంది. ఫలితంగా కర్షాణువులలోపల సర్గాణువులు ఉన్నాయంటున్నారు. పరమాణువులకంటే ఋణకణాల, ధనకణాల యొక్క వేగం, శక్తి అనేకరెట్లు ఎక్కువ అని తెలుస్తోంది. దీని ప్రకారంగా ఈ సూక్ష్మ, సూక్ష్మాంతర, సూక్ష్మాతిసూక్ష్మమైన అణువులవేగం, శక్తి ఊహించుకోవచ్చు. పరమాణువు విచ్ఛేదంవల్ల లండన్ వంటి మూడు నగరాలు ధ్వంసమైనప్పుడు సర్గాణువుల శక్తిని అంచనా వేయడం సాధ్యంకాని పని. వాని అంతిమ సూక్ష్మ కేంద్రం సాటిలేనిది. మాటలకూ అందనిది. ఊహకు కూడ అందడం కష్టం.

భూమి చూడడానికి బల్లపరుపుగా ఉంటుంది. కాని వాస్తవానికి గుండ్రంగా ఉంటుంది. బంతి వలె గుండ్రంగా ఉండి తన చుట్టూ తాను తిరుగుతూ ఉంటుంది. ఒక్కసారి భూమి తనచుట్టు తాను తిరిగి రావడానికి 24 గంటల సమయంపడుతుంది. భూమికి ఇది రెండవ నడక. తన చుట్టు తాను తిరుగుతూనే సూర్యుని చుట్టూ తిరుగుతుంది. సూర్యుని చుట్టూ తిరగడానికి ఒక సంవత్సర కాలం పడుతుంది. అంతేకాదు. సూర్యుడు తన గ్రహ, ఉపగ్రహాలతో పాటు మహావేగంతో అభిజిత్ నక్షత్రం వైపుకుపోతూ ఉన్నాడు. అతడు కృత్తికా నక్షత్రం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నట్లు

**ఇతరులను నిందిస్తే నీ ముందు - నిన్నూ నిందిస్తారు ఇతరుల ముందు.**

భావింపబడుతోంది. ఈ బృందంలో భూమికూడ ఉన్నది. (ఇది భూమికి 3వ నడక.) బొంగరం తన ముల్లుపై తిరుగుతూ, అటూ ఇటూ ఒరుగుతూ లేస్తూ ఉంటుంది. దీనిని (మండలానేకీ చాల్) నడక అంటారు. ఈ విధంగా ఒక్కసారి చుట్టిరావడానికి దాదాపు 26,000 సంవత్సరాలకాలం పడుతుంది. కృత్తికా నక్షత్రం కూడ సౌరమండలంతోపాటు తన ఉపగ్రహాలను వెంటబెట్టుకుని ధ్రువనక్షత్రం చుట్టూ తిరుగుతుంది. ఇది భూమికి 5వ నడక.

సూక్ష్మ పరమాణువుయొక్క సూక్ష్మతమ భాగమైన సర్గాణువు వరకు మానవుని బుద్ధి పోగలిగింది. దానితోపాటు పెద్ద పెద్దవైన గొప్ప అణువుల రూపంలో భూమియొక్క 5వ నడక కూడ తెలిసి వచ్చింది. ఆకాశంలోని అసంఖ్యాకమైన గ్రహాలు, నక్షత్రాల పరస్పర సంబంధం ఎన్ని మహాణువులరూపంలో పూర్తి అవుతుందో తెలియడం లేదు. అది ఊహకు కూడ అందడం లేదు. దీనినికూడ అప్రతిభం అని, అప్రమేయం అని, అచింత్యం అని అనక తప్పడం లేదు.

సూక్ష్మానికంటె సూక్ష్మమైన, మహత్తుకంటె మహత్వమైన కేంద్రాలవరకు వెళ్లి మానసికంగా అలసిపోవడం జరిగింది. అందువలన చిన్న విషయంకాని, పెద్ద విషయంకాని ఊహించలేక పోతున్నాము. ఆ కేంద్రాన్నే 'బిందువు' అంటారు.

అణువును యోగ పరిభాషలో 'అండము' అని కూడ అంటారు. ఒక వీర్యకణము ఒక అండం. అది ఎంత చిన్నదంటే సూక్ష్మదర్శినితో చూచినా కంటికి కనిపించదు. వికసించి స్థూల రూపాన్ని పొందినప్పుడు పెద్ద అండంగా మారుతుంది. ఆ అండం లోపల ఉన్న పక్షికి అన్నిరకాల అవయవాలు ఉంటాయి. ఆ అవయవ విభాగాల్లో అంతులేని సూక్ష్మ విభాగాలు, వాటిల్లో కూడ లెక్కలేనన్ని కోశాండాలు ఉంటాయి. ఈ విధంగా శరీరంకూడ ఒక అణువు. దీనినే అండం అని లేక పిండం అని అంటారు. అఖిలమైన విశ్వబ్రహ్మాండంలో లెక్కలేనన్ని సౌరమండలాలు, ఆకాశ గంగలు, ధ్రువచక్రాలు ఉన్నాయి.

ఈ గ్రహాల దూరాన్నీ, విస్తీర్ణాన్నీ గురించి చెప్పడం సాధ్యం కాదు. భూమి ఒక పెద్ద పిండం అయితే సూర్యుడు భూమి కన్నా 13 లక్షల రెట్లు పెద్ద. సూర్యుని కన్నా కూడ కోట్లాదిరెట్లు అధికమైన విస్తీర్ణంగల నక్షత్రాలు ఆకాశంలో ఉన్నాయి. కాంతివేగం సెకనుకు 1,86,000 మైళ్లు కదా! ఒక గ్రహమునుండి కాంతి భూమిని చేరడానికి 30 లక్షల సంవత్సరాలు పడుతుంటే దాని మధ్యగల దూరాన్ని అంచనా వేయవచ్చు. ఒక గ్రహం పూర్తిగా నశించిపోయినా గాని, దాని కాంతి ఇంకా రాబోయే 30 లక్షల సంవత్సరాలదాకా ప్రయాణం చేస్తూనే ఉండవచ్చు. కొన్ని నక్షత్రాల ప్రకాశం భూమి దాకా వస్తుంది. కాని భూమిమీదకు కనిపించనంత దూరంలో అనేక గ్రహాలు ఉన్నాయి. ఇవన్నీ తమచుట్టూ తాము తిరుగుతూ, ఇంకా దేనిచుట్టూనో తిరుగుతూ ఉండవచ్చు. ఆవిధంగా తిరుగుతూ తిరుగుతూ ఏ దిశకో దూసుకుపోతూ ఉండవచ్చు. ఆకాశంయొక్క విస్తీర్ణాన్ని అంచనావేయడం మానవ మస్తిష్కానికి సాధ్యం కావడం లేదు.

ఇంత పెద్ద బ్రహ్మాండం ఒక అణువు లేక అండం. అందువల్ల బ్రహ్మ+అండం= బ్రహ్మాండం అంటారు. మన దృష్టికి వచ్చిన బ్రహ్మాండంతోపాటు లెక్కలేనన్ని బ్రహ్మాండాలు సృష్టిలో ఉన్నాయి అని మన పురాణాలు చెపుతున్నాయి. వాటి సమూహమంతా కలిస్తే ఒక మహా అండం. ఆ మహాండంతో పోలిస్తే భూమి మరీ చిన్నది అయిపోతుంది. పరమాణువుకన్నా సర్గాణువు చిన్నదైనట్లు, మహాండంకన్నా భూమి చాల చిన్నది.

ఈ విధమైన లఘువులో లఘువు, మహత్తులో మహత్తు అయిన అండాలలో ప్రసరించిన శక్తి వాటిని చైతన్య పరుస్తూ ఉంది. ఆ శక్తినే బిందువు అని పిలుస్తారు. ఆ బిందువే పరమాత్మ. ఆ పరమాత్మనే 'అణోరణీయాన్', 'మహతో మహీయాన్' అని పిలుస్తారు. ఇదేవిధంగా ఉపనిషత్తుల్లో పరబ్రహ్మయొక్క పరిచయం చెయ్యబడింది.

ఈ బిందువును గురించి ఆలోచించడం వల్ల జీవునికి ఆనంద మయకోశములో ఉన్న పరబ్రహ్మ స్వరూపం తొంగి చూస్తుంది. దానితో పరబ్రహ్మకు, మహాండానికి పోల్చి చూచుకుని నా అస్తిత్వం ఎంత? అనుకుంటాడు సాధకుడు.

మన అల్పత్వం తెలియడం వల్ల అంతరాంతరాల్లో దాగొన్న అహంకారం, గర్వం నశిస్తాయి. మరోసారి సర్గాణువుతో తన

**పట్టుకోవాల్సింది మహాత్ముల పాదాలు కాదు - వారందించే మహోపదేశాలు.**

దేహాన్ని పోల్చి చూచుకుని తన శరీరం ఎంత పెద్దదో, ఎంత శక్తివంతమైనదో తెలిసికుంటాడు. అప్పుడు తాను అశక్తుడను కానని రూఢిపరచుకుంటాడు. ఆ శక్తిని వినియోగించడం తెలిసికొన్న నాడు తనకు అసంభవమైన అంశం ఈ ప్రపంచంలోనే లేదని ముందుకు సాగుతాడు.

మహాండంతో మన శరీరాన్ని పోల్చుకుంటే చాల క్షుద్రమైనదిగా కనిపిస్తుంది. మన శరీరంతో మహాండాన్ని పోల్చి చూస్తే అది అనుపమేయం. అదేవిధంగా సర్గాణువుల దృష్టిలో మన శరీరం ఒక బ్రహ్మాండ స్వరూపం. ఒక దివ్యశక్తిగా దర్శనమిస్తుంది. "నేను మధ్య బిందువును. నేను కేంద్రమును. సూక్ష్మంలో సూక్ష్మంగాను, స్థూలంలో స్థూలంగాను నిండి ఉన్నాను." అని భావిస్తాడు.

లఘుత్వంయొక్క మహత్వాన్ని గూర్చిన ఏకాంత సాధనయే బిందు సాధన అంటారు. ఈ సాధనద్వారా సాధకునికి సామాజిక జీవితంలోని అవాస్తవికత, అల్పత్వం చక్కగా అర్థమౌతాయి. నేను అనంతశక్తి నుండి వచ్చిన వాడను. కావున ఈ సృష్టికి మహత్వపూర్ణ కేంద్రమును. మన శక్తిని సదుపయోగం చేస్తే చిరస్మరణీయంగా ఉండి పోతాం. ప్రపంచంలో కోరిన మార్పును తేవచ్చు. దురుపయోగం చేసినట్లైతే జపాను మీద ప్రయోగించిన ఆటంబాంబులాగా సర్వనాశనానికి మూలకారణం అవుతాం.

విశ్వామిత్రుడు రాజాహరిశ్చంద్రుని శరీరాన్ని ఆటంబాంబుగా తయారుచేసి అసత్య ప్రపంచం మీద ప్రయోగించాడు. లక్షల సంవత్సరాలు గడచిపోయినా దాని ఏక్టివ్ కిరణాలు (సత్యంయొక్క ప్రభావం) ఇంతవరకు నశించిపోలేదు. దాని ఆధారంగా అనేక మంది సత్యవాదులు తయారయ్యారు. మహాత్మాగాంధీ చిన్నతనంలో హరిశ్చంద్ర నాటకం చూచి, చరిత్ర చదివి మిక్కిలి ప్రభావితుడయ్యాడు. అదేవిషయం తన ఆత్మకథలో వ్రాసికున్నాడు. తాను హరిశ్చంద్రుడు కావాలని ఉవ్విళ్లూరాడు. సంకల్పబలంతో నిజంగా హరిశ్చంద్రుడే అయ్యాడు. ఈనాడు హరిశ్చంద్రుడు లేడు. కాని ఆయన ఆత్మ అదేవిధంగా గొప్ప గొప్ప కార్యాలు చేస్తున్నది. చేయిస్తున్నది. ఈ ప్రపంచంలో ఆయన ద్వారా తయారైన మనకు తెలియని గాంధీలు ఎంతమంది ఉన్నారో చెప్పలేం. గీతను చెప్పిన కృష్ణపరమాత్మ ఇప్పుడులేడు. కాని ఆయన చెప్పిన గీత ఎంతోమందికి అమృతాన్ని తాగిస్తోంది. ఇది శరీరం యొక్క సూక్ష్మప్రభావమే అని గట్టిగా చెప్పవచ్చు. దాని ద్వారా ప్రత్యక్ష, అప్రత్యక్ష రూపంలో స్వ, పర భేదాలు లేకుండా అందరికీ శుభాలను కలుగచేస్తున్నది.

కార్ల్‌మార్క్స్ యొక్క సూక్ష్మ శక్తి కేంద్రంనుండి ప్రసరించే చేతన సగం ప్రపంచాన్ని కమ్యూనిష్టులుగా చేసివేసింది. పూర్వకాలంలో మహాత్ముడైన క్రీస్తు, మహమ్మద్, బుద్ధుడు, కృష్ణుడు మొదలైన మహా పురుషులు ఎందరో ప్రజలను ప్రభావితులను చేశారు. కంటికి కనిపించిన మహా పురుషులే కాకుండ, అనేకమైన గొప్పగొప్ప ఆత్మలు అదృశ్యరూపంలో లోక కల్యాణ కారకాలైన కార్యాలు కొనసాగిస్తున్నాయి. మనదేశంలో యోగి అరవిందులు, రమణమహర్షి, రామకృష్ణ పరమహంస, సమర్థ గురురామదాసు మొదలైన మహాపురుషులు చేస్తున్న అదృశ్య కార్యాలను స్థూలదృష్టితో గ్రహించలేము. యుగపరివర్తనా సమయం దగ్గరపడుతోంది. దానికోసం పరివర్ధక ప్రవృత్తులు, విధ్వంసక ప్రవృత్తులు సూక్ష్మ జగత్తులో తమతమ పథకాలను అమలు చేసికుంటున్నాయి. ఆ మహాకార్యాలు ఏవీ మన స్థూలదృష్టికి కనిపించవు. ఒకవేళ చూడగలిగితే మానవ జాతి అద్భుతమైన పరివర్తన చెంది విశ్వాన్ని మొత్తం ఒక్క ఊపు ఊపివేసేది. విశ్వం నూతన ప్రకాశం వైపు పరుగులు తీసేది.

విషయాన్ని దాటవేసి చర్చించడంవల్ల ప్రయోజనం లేదు. ఒక్క విషయాన్ని దృష్టిలో పెట్టుకోవాలి. బిందుసాధనవల్ల స్థూల– సూక్ష్మ విషయాల ఆలోచనలతో ఆత్మకు భౌతిక అభిమానము, మోహము నశించిపోతాయి. ఆంతరిక శక్తి వికసిస్తుంది. స్వపర భేదం లేకుండా లోక కల్యాణం కొరకు శ్రమించాలంటే ఆంతరిక శక్తి వికాసం ఎంతైనా అవసరం.

బిందుసాధనలో సాధకునికి ఆత్మస్థితి ప్రకాశమానం అవుతుంది. అతనిలోని వికారాలు నశించిపోతాయి. ఫలితంగా ఆతడు అనిర్వచనీయమైన ఆనందాన్ని అనుభవిస్తాడు. ఆవిధంగా తన జీవన లక్ష్యాన్ని నెరవేర్చుకుంటాడు.

★★★

**అనుకున్నది చేయలేనప్పుడు - చేయగలిగిందే అనుకోవాలెప్పుడు.**

ధారావాహిక: దివ్యజీవన దర్శనం-57

# సరికొత్త వెలుగులో-3

## దివ్య చేతన అవతరణ

శ్రీ అరవిందులు ఆరోజులలో ఏకాంతంలో ఉన్నారు. 1926 ప్రారంభంలోనే ఆశ్రమం బాధ్యతనూ, సాధకుల బాధ్యతనూ ఆయన శ్రీమాతకు అప్పగించారు. అప్పుడు శ్రీమాత వయస్సు సుమారు 50 సంవత్సరాలు. ఆ సంవత్సరం నవంబరు 24న ఒక సమావేశంలో పాల్గొన్న సాధకులకు ఒక దివ్య అనుభూతి కలిగింది. సాధకులు తీవ్ర ధ్యానంలో ఉన్నారు. సమాధి స్థితికి చేరుకున్నారు. ఆ అనుభూతి 45 నిమిషాలవరకు నిలిచిఉంది. ఆతర్వాత ఆ నీరవనిస్తబ్ద శాంతి ముగిసింది. సాధకులు మామూలు స్థితికి వచ్చారు. ఒక దివ్య స్వప్నాన్ని దర్శించినట్లు వారికి అనిపించింది. ఈ సామూహిక అనుభూతి కారణంగా, ఆ స్పర్శలో పనిచేసిన దివ్య- అదృశ్య ఘటనాక్రమాలు కారణంగా- అది సిద్ధి దినం అని ప్రకటించబడింది. ఈ దివ్య సంఘటన తర్వాత శ్రీ అరవిందులు దాదాపు పూర్తిగా ఏకాంతంలోకి వెళ్లిపోయారు.

రజనీ భాయి శ్రీరామ్‌కు ఈ సంగతులను తెలిపారు. శ్రీరామ్‌కు వీటిగురించి అంతకుముందే తెలుసు. రజనీ భాయ్ ఆయన బసకు ఏర్పాట్లు చేశారు. భోజనాదులు ముగించుకున్న తర్వాత అక్కడికే రమ్మని శ్రీరామ్‌కు చెప్పారు. శ్రీమాతను కలుసుకోవడానికి సమయాన్ని కూడ తీసుకున్నారు. మూడవ జామున రజనీ భాయి కూడ శ్రీమాతను కలుసుకోవలసి ఉంది. ఆ సమయం ఆశ్రమంలోని కార్యకర్తలకూ, నైష్ఠిక సాధకులకూ కేటాయించబడింది. సాయంత్రం దర్శనంలో 10-12 మంది వ్యక్తులు ఉన్నారు. వారిలో కొందరు సాధకులుకూడ ఉన్నారు.

శ్రీమాత ఆశీస్సు ఇస్తూ కుడిచేయి ఎత్తారు. కొత్త ఆగంతుకునిపై దృష్టి నిలిపారు. ఆ కొత్త ఆగంతుకుడు శ్రీరామ్. ఆయన తనను పరిచయం చేసుకునేలోగా శ్రీమాత ఆయనను పేరు పెట్టి పిలిచారు. శ్రీరామ్ ముఖంపై ఆశ్చర్యం కానవచ్చింది. దాన్ని చూచి ఆమె ఇలా అన్నారు-

"నీవు ఆశ్చర్యపడవలసిన అవసరం లేదు. నేను సిద్ధి ద్వారా నీ పేరును తెలుసుకోలేదు. రజని నన్ను కలుసుకునేవారి జాబితాలో నీ పేరు వ్రాశాడు. దాన్నిబట్టి గ్రహించాను."

## చిన్న చిన్న విషయాలు

ఈ మాట చెప్పి శ్రీమాత నవ్వారు. శ్రీరామ్ కూడా నవ్వారు. అక్కడ ఉన్న ఇతర వ్యక్తులుకూడ నవ్వారు.

రమ (గోశాలలోని ఒక ఆవు) సరిగా మేత మేయడంలేదని ఒక కార్యకర్త ఫిర్యాదు చేశాడు. దానికి జబ్బుచేయలేదు. చక్కగా పాలు ఇస్తోంది. కాని గడ్డీ, నీళ్లూ తీసుకోవడంలేదు. ఏమి చేయాలి- అని అతడు అడిగాడు.

శ్రీమాత కళ్లు మూసుకున్నారు. కొద్దిసేపు మౌనంగా ఉన్నారు. ఆతర్వాత ఇలా అన్నారు-

"ఆవుల కాపరి దాని దూడను కొట్టాడు. అందువల్ల దానికి కోపం వచ్చింది. దానికి తన విచారాన్ని తెలుపవలసిందని ఆవుల కాపరికి చెప్పు."

ఆశ్రమంలోని ఒక ఇంటిలో కిటికీలు సరిగా మూతబడడం లేదు. వాటికి మరమ్మత్తు జరిగింది. అయినా తలుపులు మూతబడడం లేదు. శ్రీమాత ఇందుకుకూడ ఏదో ఆంతరిక కారణాన్ని సూచిస్తారని ఆ విషయం అడిగిన వ్యక్తి ఆశించి ఉండవచ్చు. అలాంటిదేమీ జరగలేదు. తలుపులను మరోమారు మరమ్మత్తు చేయించుమని శ్రీమాత అన్నారు. మరమ్మత్తు చేసిన వ్యక్తి శ్రద్ధగా పని చేసి ఉండదు, అతడి పనిమీద ఒక కన్నువేసి ఉంచాలి- అని కూడ శ్రీమాత అన్నారు.

కార్యకర్తలు చిన్న చిన్న విషయాలను కూడ శ్రీమాత దృష్టికి తెస్తున్నారు. శ్రీరామ్‌కు ఆశ్చర్యం కలుగుతోంది. ఇలాంటి చిన్న చిన్న సమస్యలను కార్యకర్తలే స్వయంగా పరిష్కరించుకోవాలని ఆయన భావించారు.

ఒక కార్యకర్త మహాత్మా గాంధీ గురించి ప్రస్తావించాడు. సేవాగ్రామ్‌లో జవహర్లాల్ నెహ్రూ, సర్దార్ పటేల్, ఇతర నాయకులు

మనసుకు నేస్తం మంచి విరామం - విరామానికి నేస్తం మంచి పుస్తకం.

స్వరాజ్య ఉద్యమానికి సంబంధించిన ఏదో కార్యక్రమంపై చర్చ జరుపుతున్నారు. కార్యకర్తల మధ్య సమన్వయం కొరవడింది. అందువల్ల ఉద్యమం దెబ్బతింటోంది. ఆ సమస్యపై జరుగుతోంది చర్చ. బాపూజీ కూడ ఆ చర్చలో పూర్తిగా నిమగ్నం అయినారు.

ఈ చర్చ జరుగుతూ ఉండగా– ఒక మేకపిల్ల పరుగు పరుగున ఆ నాయకులమధ్యకు వచ్చింది. బాపూజీ దగ్గర కూర్చున్నది. బాపూజీ దృష్టి దాని కాలుమీద పడింది. ఆ కాలికి దెబ్బ తగిలింది. ఆ కాలుమీద బాపూజీ దృష్టి పడేవిధంగా మేకపిల్ల కూర్చున్నది– తన బాధ చెప్పుకోవడానికి వచ్చినట్లు. "మీరంతా చర్చిస్తూ ఉండండి. నేను ఈ మేకపిల్లకు కట్టుకట్టి వస్తాను"– అని అంటూ గాంధీజీ లేచినిలబడ్డారు. చర్చిస్తూన్న నాయకులు ఒకరి ముఖాలు ఒకరు చూస్తూ ఉండిపోయారు. మేకపిల్లకు తగిలిన దెబ్బ ఉద్యమ సమస్యకన్న ప్రధానం అయినందుకు నెహ్రూగారు విసుక్కుని ఉండవచ్చు.

ఈ సంఘటన గురించి విని, శ్రీమాత మొదట నవ్వారు. ఆతర్వాత ఇలా అన్నారు–

"చేతనయొక్క ఒక స్థాయికి చేరిన తర్వాత ఎదురుగా ఉన్న కర్తవ్యమే ప్రధానం అవుతుంది. పనియొక్క స్వరూపానికీ, ఆకారానికీ అంత విలువ ఉండదు."

## విశిష్ట ఆశయం

సాధకుల చెప్పే విషయాలు పూర్తికాగానే, శ్రీమాత శ్రీరామ్‌వైపు చూచి ఇలా అన్నారు–

"మీరు కొత్తవారు. అయినా మాకు కొత్తవారు కారు. సంప్రదింపుల కోసం ఇక్కడికి రావలసిన అవసరం లేదు. ఆ పని భావాతీత స్థాయిలో జరుగుతోంది. ఈ సమావేశం వెనుక ఉన్న ఉద్దేశ్యం మరింత నిగూఢం అయినది. కనుకనే మిమ్మల్ని ఆపాను."

శ్రీరామ్ అందుకు జవాబు చెప్పలేదు. ఆయన మౌనంగా శ్రీమాతవైపు చూస్తూ ఉండిపోయారు. ఇతర సాధకులుకూడ అప్పుడు అక్కడ ఉన్నారు. శ్రీమాత దర్శనం పూర్తయిందని సూచిస్తూ, వారికి వెళ్లవలసిందని సైగ చేశారు. ఆమె శ్రీరామ్‌ను ఆపారు.

చర్చను ప్రారంభిస్తూ శ్రీమాత ఇలా అన్నారు–

"శ్రీ అరవిందులు ఏకాంతంలో ఉన్నారు. ఆయన బయటికి వచ్చివెళుతూ ఉంటే, మరో స్థలంలో మీతో కలియడం జరిగి ఉండేది. ఒక నూతన మానవుని ఆవిర్భావం కోసం ఆయన ప్రయత్నిస్తున్నారు. ఆయనకు ఆ పనిని అప్పగించిన శక్తులే మిమ్మల్ని ఇక్కడికి పిలిచాయి."

శ్రీరామ్ ఇలా అన్నారు–

"అయితే నాకు అలాంటి స్ఫురణ కలుగలేదు. నేను నా ఇష్ట దైవం యొక్క ప్రేరణతోనే ఇక్కడికి వచ్చాను."

అందుకు శ్రీమాత ఇలా అన్నారు–

"మీరు ఇతర క్షేత్రాల యాత్ర కూడ చేసిఉన్నారు. అయితే అది అంత ప్రధానం కాదు. ఈ ఆశ్రమం ఒక పరిశోధనశాల అని శ్రీఅరవిందులు భావిస్తున్నారు. ఇక్కడ భవిష్యత్తు గురించి పరీక్షలు జరగాలి. ఆయన మీనుండి కొన్నింటిని ఆశిస్తున్నారు."

ఈ మాటలు విన్న శ్రీరామ్ ముఖంలో ఉత్సుకత కానవచ్చింది– తర్వాతి సంగతి వినడానికి ఆయన తనను తాను సిద్ధం చేసుకుంటూన్నట్లు.

శ్రీమాత కొద్దిగా ఆగి ఇలా అన్నారు–

"ప్రపంచం గురించి ప్రధానంగా మూడు సిద్ధాంతాలు ఉన్నాయి. మొదటిది ఆదిశంకరుల భావాలనూ, బుద్ధుని భావాలనూ పోలిన సిద్ధాంతం. ప్రపంచం ఒక భ్రమ, అవిద్య. ఆ కారణంవల్ల ఇక్కడ దుఃఖమే దుఃఖం. ఇక్కడ చేయదగినది ఒక్కటే– ఇక్కడనుండి వైదొలగిపో. విడుదల పొందు. అవ్యక్త బ్రహ్మలో లీనం అయిపో.

"రెండవ సిద్ధాంతం వేదాంతం. ఈశ్వరుడు సర్వవ్యాపి. మూలతత్వంగా ఆయన అంతటా ఉన్నాడు. అయితే వ్యక్తమయిన ఆయన రూపం వికృతమైనది; తమస్సుతో ఆవరించబడి ఉన్నది. దానినుండి విముక్తి పొందడానికై ఆత్మచేతనలో స్థిరంగా నిలబడు. జగత్తు గురించి ఆలోచించకు.

"మూడవ సిద్ధాంతం ఆధునికమైనది, నవీనమైనది. ఈ సిద్ధాంతాన్ని శ్రీ అరవిందులు ప్రతిపాదించారు. దాని ప్రకారం– ఇప్పుడున్న ప్రపంచం అసంపూర్ణమైనది. దాని స్వరూపం

దైవత్వానికి పునాది మానవత్వం - మానవత్వానికి పునాది దయాతత్వం.

అస్పష్టంగా, వికృతంగా ఉంది. అది దివ్య చేతన నిర్దేశించిన ప్రకటీకరణ కాదు. దాని నిర్మాణం భగవానుని అన్ని రూపాలలో అన్ని కోణములలో వికసించవలసి ఉంది."

శ్రీమాత చేసిన ఈ నిర్దేశం ప్రకారం- ఒక నూతన జగత్తు ఆవిర్భవించవలసి ఉంది. అధ్యాత్మ దిశలో కృషి జరుపుతున్న వ్యక్తులందరూ భగవానుని ఈ ఇచ్ఛను అర్థంచేసుకోవాలి.

ఈ సంభాషణలోనే శ్రీమాత శ్రీరామ్‌ను 'యోగి' అని సంబోధించారు. మరునాటి ఉదయం శ్రీ అరవిందులతో సమావేశం నిర్ణయమయింది. ఆయన పూర్తిగా ఏకాంతంలో ఉన్నారు. సిద్ధి దినం, దర్శనం రోజులు మినహా బహిరంగంగా కాని, వ్యక్తిగతంగా కాని ఆయన బయటికి రారు.

## కొత్త బాధ్యత అప్పగింత

కొన్ని ప్రత్యేక సందర్భాలలో ఈ నియమానికి మినహాయింపు ఉంటుంది. శ్రీ అరవిందులతో ఏకాంతంగా సమావేశం కావడం ఇలాంటి మినహాయింపే. వారిద్దరిమధ్య ఎలాంటి చర్చ జరిగింది? వారు ఒకరిని ఒకరు ఎలా అభివాదన చేశారు? ఆ సమావేశంలో జరిగిన నిర్ణయం ఏమిటి? ఈ విషయాలపై అధికారికమైన సమాచారం ఏదీలేదు. కొన్ని సంవత్సరాల తర్వాత శ్రీరామ్ ఆ విషయాన్ని గురించి సూచించారు. అంతే. దాని ప్రకారం- 1937లో జరిగిన ఈ సమావేశంలో వ్యక్తుల పరిశోధనశాలను ఏర్పాటు చేసే పని శ్రీరామ్‌కు అప్పగించబడింది. వ్యక్తులలో సునాయాసంగా దివ్య భావాలు మేలుకొనేందుకు అనువైన వాతావరణాన్ని నిర్మాణం చేయడానికి అరవింద ఆశ్రమం సంస్థాపరంగా కృషి చేస్తోంది. వ్యక్తుల నిర్మాణం అనే కార్యం శ్రీరామ్‌కు అప్పగించబడింది. బయటికి మామూలు వ్యక్తులుగా కనిపిస్తున్నప్పటికీ, లోపల సమర్థులూ శక్తివంతులూ అయిన వ్యక్తులను ఆయన నిర్మాణం చేయాలి. నలువైపులా దివ్య చేతన ఆవిర్భవించేందుకై వ్యక్తిగతంగానూ, సంస్థాగతంగానూ ఆయన కృషిచేయాలి.

శ్రీ అరవిందులు ఇలా అన్నారు-

ముందు ముందు జీవితం మరింత జటిలం అవుతుంది. అప్పుడు మరిన్ని సమస్యలను ఎదుర్కొనవలసి వస్తుంది.

కుటుంబం గురించి కొంత ఉదాసీనత వహించడం సాధనకు తప్పనిసరి. కుటుంబాన్ని ఉపేక్షించకూడదు. కానీ, మోహంలో, మమకారంలో మునిగిపోయి కుటుంబం కోసం మరణించకూడదు, బలికూడదు. మనిషి ఆధ్యాత్మిక జీవితంలో ప్రవేశించినప్పుడు కుటుంబ సంబంధాలు సడలిపోవడం ప్రారంభ మవుతుంది; కొత్త సంబంధాలు వికసిస్తూ ఉంటాయి. పాత సంబంధాలతో ముడిపడి ఉండడం అంటే సామాన్య ప్రకృతితో ముడిపడి ఉండడమే. ఈ సమావేశం సుమారు 40 నిమిషాలపాటు సాగింది.

శ్రీరామ్ ఆశ్రమంలో మరి రెండురోజులు గడిపారు. శ్రీమాతతో జరిగిన చర్చలో ఆశ్రమానికి సంబంధించిన మరికొన్ని అంశాలు వెల్లడి అయినాయి. అవి శ్రీ అరవిందుల ఆలోచనల ప్రతి బింబాలు. శ్రీ అరవిందుల ప్రకాశం- ఆశ్రమం యొక్క లక్ష్యం జీవితంలో యోగం అంతర్భాగం కావడం. అందుకోసమై జీవితాన్ని స్వీకరించవలసి ఉంటుంది. స్వీకరించినప్పుడు వైరుధ్యాలను కూడ స్వీకరించవలసి ఉంటుంది. ఆ వైరుధ్యాలను తొలగించడమే యోగం చేసే పని. కనుక- జీవితాన్ని వ్యతిరేకించే ఏ పనీ ఆశ్రమంలో జరగకూడదు.

శ్రీరామ్ మనస్సులో స్వంత ఆశ్రమం గురించిన ఒక దృష్టి ఏర్పడసాగింది.

★★★

## చందాదారులకు మనవి

1. చందాదారులు చందా కట్టేసమయంలో వారి **పూర్తి పేరు, చిరునామా, పోస్టలు పిన్‌కోడ్ నెంబరు, ఫోన్ నెంబరు,** తెలియచేయవలసినది.
2. మాసపత్రిక అందని యెడల చందాదారులు, ఆనెల 15వ తేదీ తర్వాత గాయత్రీ చేతనా కేంద్రానికి ఫోను ద్వారా గాని, పోస్టుకార్డు ద్వారా గాని వారి పేరు, కోడ్ నెంబరు వివరముగా తెలియపరచినచో పత్రిక పంపబడుతుంది.

**గమనిక :** కార్యాలయం ఫోను నెంబరు : 040-23700722, 040-23157468

సాధకుడు సమాజంలో చరించాలి - సాధకునిలో సంసారం చరించరాదు.

మహిళాజాగరణ

# వీరనారి పొణకా కనకమ్మ

## సామాజిక వివక్షపై పోరాటం

సామాజిక వివక్ష అంటే 'అంటరానితనం' ఒకటే కాదు. జమీందారులు-రైతులు; రైతులు-రైతుకూలీలు; పురుషులు-స్త్రీలు వీరి మధ్య ఘర్షణ, భేదభావాలు- హెచ్చుతగ్గులు- ఇవికూడా సామాజిక వివక్షకు చెందిన అంశాలే! జమీందారుల నిరంకుశ వ్యవహారానికి వ్యతిరేకంగా, రైతులపక్షాన; స్త్రీల సమగ్రాభివృద్ధికి 'స్త్రీ విద్య' ద్వారా ప్రయత్నించినవారు శ్రీమతి పొణకా కనకమ్మ గారు.

స్వేచ్ఛాభారతికోసం సాగిన జాతీయోద్యమం నెల్లూరుజిల్లాలో సంఘ సంస్కరణోద్యమంగా రూపుదాల్చి అలనాడే స్త్రీ చైతన్యం, మద్యనిషేదం. అస్పృశ్యత నివారణగా వెలుగులు ప్రసరించాయి. ఎన్ని యుగాలు గడిచినా ఈ కిరణాలు నవసమాజానికి కాంతి రేఖలుగా ప్రకాశిస్తూనే ఉంటాయి. నాడు ఉద్యమం ఊపిరిగా ఉత్తుంగ తరంగంలా నాయకురాలై ముందుకు నడచి....... స్వాతంత్ర్య సమరోద్యమ జ్యోతిగా వెలుగొందిన సింహపురి వీరవనిత..... ఆదర్శ మహిళ పొణకా కనకమ్మ.

## కుటుంబ పరిచయం

పొణకా కనకమ్మ 10 జూన్ 1892లో జన్మించింది. నెల్లూరు జిల్లాలోని మడమనూరు గ్రామానికి చెందిన కావమ్మ, మరుపూరు కొండారెడ్డి ఆమె తల్లిదండ్రులు. కనకమ్మకు తొమ్మిదో ఏడు రాగానే, ఆమె మేనమామ పొణకా సుబ్బరామిరెడ్డితో బాల్య వివాహం జరిగిపోయింది. పోట్లపూడిలో నూటయాభై ఎకరాలున్న భూస్వామి కుటుంబం వారిది. పాఠశాలలో ప్రాథమిక విద్య తప్ప హైస్కూలులో కానీ, కళాశాలలో కానీ కనకమ్మ చదువుకోలేదు. స్వయంకృషితో ఇంట్లోనే హిందీ, తెలుగు, సంస్కృత భాషలను అధ్యయనం చేసింది, ఆయా భాషల్లోని సాహిత్యంలో మంచి పరిచయాన్ని కలిగించుకొని ఉన్నది.

## సాహిత్య సేవ

కనకమ్మ మంచి రూపవతి, పట్టుదల కలిగిన మనిషి. దానికితోడు వాక్పటిమ, సాహిత్యాధ్యయనంతో వచ్చిన సంస్కారం తోడైంది. పొణకావారి ఇంట్లో కనకమ్మకు మంచి గౌరవం లభించేది. ఆ ఉమ్మడి కుటుంబంలో కనకమ్మ మాటకు ఎదురు ఉండేది కాదు. సంఘసేవను ఆరంభించి స్వామి వివేకానంద గ్రంథాలయాన్ని స్థాపించి గ్రంథాలయోద్యమానికి ఊపునిచ్చింది. ప్రతి ఏటా వార్షికోత్సవం జరిపి, ఆంధ్రదేశంలో ఉండే కవులను, రచయితలను, మేధావులను ఆహ్వానించే పోట్లపూడిలో వారిల్లు సాహిత్య చర్చావేదికగా విరాజిల్లింది. రాయప్రోలు సుబ్బారావు కూడా తరచూ వారింటికి వచ్చేవారు. పోట్లపూడిలోనే జాతీయ పాఠశాలను స్థాపించింది.

## జాతీయోద్యమం-భాగస్వామ్యం

గాంధీజీ జాతీయోద్యమంలో ప్రవేశించకముందు, పోట్లపూడిలో 1910లోనే జాతీయోద్యమాన్ని ప్రారంభించింది. అక్కడి వారిల్లు కవులు, పండితులకే కాకుండా జాతీయోద్యమ నాయకులకు కూడా విడిదిగా తయారైంది. 1904లో విదేశీ వస్తు బహిష్కరణలో భాగంగా ఆమె పోట్లపూడిలో అదే గ్రామానికి చెందిన నెల్లూరు వెంకటరామా నాయుడుతో కలిసి చేనేత మగ్గాలను నెలకొల్పారు. ఆమంచర్ల ఆదినారాయణ చరఖాలు, మగ్గాలను అనేక ఇళ్లలో ప్రవేశపెట్టి ఖద్దరువస్త్రాలను ఉత్పత్తి చేసి విక్రయించేవారు. ప్రజల్లో విద్యాగంధాన్ని వ్యాప్తి చేసేందుకు కనకమ్మ పోట్లపూడిలో 'సుజనరంజని' సమాజాన్ని స్థాపించారు. ఇందులో వెంకటరామానాయుడు, వి. పట్టాభిరామిరెడ్డి, పెళ్లేటి ఆదినారాయణరెడ్డి, గండవరం హనుమారెడ్డి, వెన్నెలకంటి రాఘవయ్య తదితరులు సభ్యులుగా ఉండేవారు. ఆరోజుల్లోనే మహాత్మాగాంధీని నెల్లూరుజిల్లాకు తీసుకువచ్చి పల్లెపాడులో గాంధీ ఆశ్రమాన్ని ప్రారంభింపజేసింది. పల్లెపాడు ఆశ్రమం ఆ రోజుల్లో జాతీయోద్యమనాయకులకు రహస్య స్థావరంగా కూడా ఉపయోగ పడేది. పొణకా కనకమ్మ చేస్తున్న సేవలకు వెన్నెలకంటి రాఘవయ్య, పొటూరి సుబ్బరామయ్య, వేమూరి లక్ష్మయ్యవంటివారు సహకరించేవారు. తమ కుటుంబ ఆస్తినంతా అమ్మి ఆనాడు జాతీయోద్యమానికి వెచ్చిస్తుంటే కనకమ్మ భర్త పొణకా సుబ్బరామిరెడ్డి ఏమాత్రం అభ్యంతరం చెప్పేవాడు కాదు. పైగా తన భార్య చేస్తున్న

**కృపణత్వానికి నేస్తం రాక్షసత్వం - రాక్షసత్వానికి నేస్తం పైశాచికత్వం.**

సేవకు మహామురిసి పోయేవాడు. సుబ్బరామిరెడ్డి భార్య కనకమ్మ చేపట్టిన ఉద్యమాల్లో పాల్గొనకపోయినా, ప్రేక్షకుడిలా చూసి ఆనందించేవాడు. వారి ఆస్తి హారతికర్పూరంలా కరిగిపోయింది. జాతీయోద్యమం కోసం అప్పులు చేశారు. చివరికి భూములన్నిటినీ అమ్మాల్సిన పరిస్థితి ఏర్పడింది, భూములు అమ్మి అప్పులు తీర్చుకున్నారు. బతుకుతెరువు కోసం ఇంత సేవ చేసిన ఆ పోట్లపూడిని విడిచి మరొక ప్రాంతానికి వలస వెళ్ళిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

## బ్రతుకుతెరువుకై వలస-కష్ట పరంపర

మనుబోలు దగ్గర ఉన్న పిడూరు గ్రామానికి వారి కుటుంబమంతా తరలి వచ్చింది. ఆ ఊరి శివార్లలో ఒక పూరిల్లు వేసుకుని జీవించారు. పోట్లపూడిలో భూములు అమ్మి అప్పులు తీర్చగా మిగిలిన డబ్బులో 20 వేల రూపాయలను వెంకటగిరి జమీందారుకు ప్రీమియంగా ఇచ్చి దాదాపు ఐదువందల ఎకరాల భూమిని కౌలుకు తీసుకున్నారు. వెంకటగిరిరాజాకు ఏటా ఐదువేల రూపాయల చొప్పున శిస్తుచెల్లించే విధంగా 1918లో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ భూమికి నీటి వసతినిచ్చే బందరు చెరువు సరియైనదే, కానీ చెరువుకు సరైన మరమ్మత్తులు లేక నీటిమట్టం తగ్గిపోయి పంటలు దెబ్బతిన్నాయి. పోట్లపూడిలో జాతీయోద్యమానికి అంకురార్పణ చేసిన కనకమ్మ వెంకటగిరి జమీందార్లకు వ్యతిరేకంగా సంఘం పెట్టిందని ఆగ్రహించి కౌలుకు ఇచ్చిన భూములను జమీందారు వేలం వేశాడు. పోట్లపూడిలో ఉన్న భూమిపోయింది. పిడూరులో కౌలుకుతీసుకున్న భూమి కూడా పోయింది. ఊరిబయట వేసుకున్న పూరిల్లు అగ్నికి ఆహుతై పోయింది. కనకమ్మ కుటుంబమంతా నిరాశ్రయమైపోయింది. వెంకటగిరి సంస్థానంలో దర్శి, పొదిలి ప్రాంతాల్లో జమీందార్లకు వ్యతిరేకంగా మొదలైన రైతు ఉద్యమం ఊపునందుకోలేదు. వెంకటగిరి జమీందార్లకు వ్యతిరేకంగా పొణకా కనకమ్మ లేవదీసిన ఉద్యమం మనుబోలు, వెంకటగిరి, నాయుడుపేట, సూళ్ళూరుపేట ప్రాంతాల్లో మంచి ఊపునందుకుంది.

## జమీందారీవ్యతిరేక ఉద్యమం రైతు సంఘస్థాపన

నెల్లూరు జిల్లా జమీందారీ రైతు సంఘాన్ని పొణకా కనకమ్మ 1929 అక్టోబరు 19వ తేదీన స్థాపించింది. ఈ సంఘంలో మద్దిపూడి వెంకట నారాయణ రెడ్డి, మద్దిపూడి రంగారెడ్డి, కళ్యాణ వెంకటరావు, కళ్యాణ వెంకట రమణారావు కార్యవర్గ సభ్యులుగా ఉన్నారు. రైతులపై జమీందార్ల దౌర్జన్యాలు నశించాలని, రైతులను వెట్టిచాకిరీ నుండి విముక్తి చేయాలని ఈ ఉద్యమం ముందుకు సాగింది. 1929వ సంవత్సరం డిసెంబర్‌లో ఈ రైతు సంఘం మహాసభను నెల్లూరులో నిర్వహించింది. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో ఆరోజు జస్టిస్‌పార్టీ పాలన సాగుతున్నది. ఆచార్య ఎన్..జి. రంగా ఈ మహాసభకు హాజరయ్యాడు. జమీందారీ విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలని రంగా పెట్టిన తీర్మానాన్ని మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ మహాసభలోనే జమీందారీ వ్యతిరేక రైతు ఉద్యమానికి ఒక పత్రిక స్థాపించాలని తీర్మానించారు. ఈ తీర్మానాన్ని అనుసరించి 'జమీన్‌దారీ రైతు' పత్రిక ప్రారంభమైంది. ఆ పత్రికను ప్రభుత్వం నిషేధించింది. నిషేధాలు ఎత్తివేశాక 1934 సెప్టెంబర్ 21న 'జమీన్ రైతు' పేరుతో పత్రిక పునర్జన్మనెత్తింది. నెల్లూరు జిల్లాలో బ్రిటిష్ వారు జమీందారులను గుర్తించి 1892 నుంచి శిస్తు వసూలు చేసే అధికారం వారికి అప్పగించారు. కనకమ్మ పుట్టిన మరుసటి సంవత్సరం నుంచే జమీందార్లకు అధికారికంగా దాఖలైన శిస్తు వసూలుచేసే హక్కు రద్దయ్యేంత వరకూ కనకమ్మ విశ్రమించలేదు. ఉద్యమానికి ఊతంలా నిలబడిన 'జమీన్ రైతు' పత్రిక కోసం ఒక ట్రస్టును ఏర్పాటుచేసి పాతిక వేలరూపాయల నిధిని పోగుచేశారు. ఆ నిధితో రెండు శాశ్వతభవనాలను కూడా కొన్నారు. ఒక భవనానికి 'కనకమ్మ సదన్', మరొక భవనానికి 'రంగాభవన్' అని పేరు పెట్టినప్పటికి, అనంతరం 'కనకమ్మ సదన్' ను అమ్మివేశారు. ఒకపక్క జమీందారీ వ్యతిరేక ఉద్యమం, మరోపక్క జాతీయోద్యమం... కనకమ్మ కుటుంబం అవస్థల్లో కూరుకుపోయింది. చివరికి ఆమె నెల్లూరు చేరుకుంది.

**బాణంలా దూసుకుపోతాడు ఉత్సాహి - శలభంలా భ్రమిస్తాడు అవివేకి.**

## స్త్రీ విద్య-జాతీయ విద్యాలయ స్థాపన

అవిద్యతో, అజ్ఞానాంధకారంలో మగ్గుతున్న మహిళలకు స్త్రీ విద్య ద్వారా దారి చూపేందుకు కనకమ్మ 1923లో నెల్లూరు నడిబొడ్డున ఒక జాతీయ విద్యాలయాన్ని ప్రారంభించింది. క్రమేపీ ఇది కస్తూరిదేవి విద్యాలయంగా రూపాంతరం చెందింది. ఆంధ్రకేసరి ప్రకాశం పంతులు ఈ విద్యాలయాన్ని తొలుత ఒక అద్దె ఇంట్లో ప్రారంభించారు. అప్పట్లో రాష్ట్రంలోనే ఇది ఏకైక బాలికల పాఠశాల. జాతీయోద్యమంలో చురుగ్గా ఉన్న కనకమ్మను బ్రిటిష్‌వారు అరెస్టు చేయడంతో ఆమె ఏనుగురాఘవరెడ్డిని ఆ స్కూలు కార్యదర్శిగా నియమించారు. 1929లో స్కూలు కోసం స్థలాన్ని కొనుగోలు చేశారు. భవన నిర్మాణానికి గాంధీ మహాత్ముడే స్వయంగా శంకుస్థాపన చేశారు. ఆ సందర్భంలోనే స్కూలుకు కస్తూరిదేవి పేరు పెట్టారు. భవననిర్మాణ ప్రారంభసమయంలోనే కనకమ్మ మరోసారి అరెస్టయ్యారు. 1944 జూలై 16న ప్రస్తుతమున్న భవనంలో కస్తూరిదేవి విద్యాలయం ప్రారంభమయింది. కొంతకాలం తరువాత ఆమె అక్కడే ఇండస్ట్రియల్ ట్రైనింగ్ స్కూలును ప్రారంభించారు. చేనేత అద్దకం, ఎంబ్రాయిడరీ. టీచర్ ట్రైనింగ్ లాంటి కోర్సులను ప్రారంభించారు. 1945లో స్కూలుకు అనుబంధంగా ఒక హాస్టలును కూడా కనకమ్మ ఏర్పాటు చేశారు. ఆ హాస్టల్‌లో అన్నికులాల బాలికలతో పాటు, ఎస్.సి. బాలికలు కూడా ఉండేటట్లు ప్రత్యేక ప్రయత్నం చేసిన కారణంగా కుల వివక్ష, కులస్పృహలేకుండా బాలికలందరూ కలసి చదువుకునే ఆదర్శ పద్ధతికి ఆమె శ్రీకారం చుట్టారు. 1930 ఏప్రిల్ 11న మహాత్ముని పిలుపు మేరకు మైపాడు సముద్రతీరంలో జరిగిన ఉప్పుసత్యాగ్రహంలో కనకమ్మ పాల్గొన్నారు. ఆమె ఓరుగంటి మహాలక్ష్మమ్మతో కలిసి ఉప్పు తయారు చేశారు. అలంకరించిన కుండలలో సముద్రం నుంచి నీళ్లు తెచ్చి పొయ్యిలు పెట్టి ఉప్పు తయారు చేశారు. ఈ విధంగా తయారైన ఉప్పును పొట్లాలు కట్టి మైపాడు, నెల్లూరులో విక్రయించారు. ఈ కార్యక్రమంలో కనకమ్మ అరెస్టయ్యారు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు బెజవాడ గోపాలరెడ్డి ఇక్కడ జరిగిన ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని తొలిసారిగా అరెస్టయ్యారు. కనకమ్మ నాయకత్వంలో మరో 20 మంది మహిళలు అరెస్టయ్యారు. రుక్మిణమ్మ, వేనాటి చెంచుపోలమ్మ, మహాలక్ష్మమ్మ తదితరులు అరెస్టయిన వారిలో ఉన్నారు. 1922లో మద్యాన్ని నిషేధించాలని కోరుతూ కనకమ్మ ఉద్యమించారు. కోట, సైదాపురం, రాపూరు తదితర ప్రాంతాలలో మద్యం షాపుల ముందు బి.శేషురెడ్డి, వేమూరు లక్ష్మయ్య, మన్నేపల్లి హనుమంతరావు, ఆర్.రామసుబ్బయ్య, బాలసరస్వతమ్మలతో కలిసి పికెటింగ్‌లు నిర్వహించారు. ఎప్పుడూ ఇంటి గడప దాటి బయటకు రాని టి.సుదర్శనమ్మ కూడా కనకమ్మ అందించిన స్ఫూర్తితో నెల్లూరు పురవీధుల్లో తిరిగి అందరినీ కలసి ఖద్దరు వస్త్రాలను విక్రయించారు. నెల్లూరు జిల్లా కాంగ్రెస్ కమిటి ఖద్దరు వస్త్రాలపై ప్రచారం నిర్వహించడానికి బాలసరస్వతమ్మను నియమించింది. ఓరేపల్లి వెంకట సుబ్బమ్మ కుమార్తె మైత్రేయ నెల్లూరులో జరిగిన ఆలిండియాస్వదేశీ ఎగ్జిబిషన్‌లో పాల్గొని తాము నేసిన చేనేత వస్త్రాలను ప్రదర్శించి బంగారు పతకాన్ని బహుమతిగా పొందారు. ధీరులైన మగవారికి ఏమాత్రం తీసిపోని గుండె ధైర్యం, ఆధిపత్యాన్ని సహించలేని తత్వం, ముందూ, వెనుకా చూడకుండా పోరాటాలలో ముందుకురికే సాహసం పొణకా కనకమ్మ సొంతం. తాను వెళ్లే దారిలో అసంఖ్యాక జనం పయనించేందుకు ఆమె స్ఫూర్తినిచ్చారు. కనకమ్మ అంటే ఒకరి పేరు మాత్రం కాదు. యావత్ ఆంధ్రప్రదేశ్ ప్రజానీకం శాశ్వతంగా గుర్తుంచుకోదగిన మహిళ పొణకా కనకమ్మ.

నెల్లూరు చరిత్ర పుటల్లో శాశ్వతంగా నిలిచిపోయిన పొణకా కనకమ్మ స్వాతంత్ర్య సమరయోధురాలే కాదు, మంచి వక్త, రచయిత్రి కూడా. పిడూరులోని ఆమె ఇల్లు అగ్నికి అహుతైనప్పుడు దాదాపు మూడు వేలపుస్తకాలు కాలిపోయాయి. అందులో ఆమె అముద్రిత రచనలు కూడా ఉన్నాయి. శశిరేఖ, హిందూ సుందరి, భారతి, అనసూయ తదితర పత్రికల్లో ఆమె రచనలు అచ్చయ్యాయి. 'చెట్టునీడ ముచ్చట్లు' అన్న శీర్షిక కనకమ్మ జీవితాన్ని జ్ఞప్తికి తెచ్చుకోవడం అంటే, నెల్లూరు జిల్లా చరిత్రలో ఉజ్వలఘట్టాలను మననం చేసుకోవడమే !

శ్రీమతి పొణకా కనకమ్మ 15 సెప్టెంబరు 1963 తనువును చాలించారు.

★★★

### పాఠకులకు విజ్ఞప్తి

ప్రతినెల వార్తలు, ఫొటోలు ఆలస్యంగా వస్తున్నవి. అందువలన ప్రచురణకు ఇబ్బందిగా ఉంది.
దయచేసి ప్రతినెల 10వ తేదీలోగా పంపించగలందులకై కోరుచున్నాము.

**ఆలోచింప చేసేదే మంచి పుస్తకం - దాంతోనే వికసిస్తుంది మస్తకం.**

ధారావాహిక : నా స్మృతిపథంలో గురుదేవులు-28

# గురుదేవులు ఇచ్చిన భరోసా

విపరీతమైన వర్షాలతో ఒకసారి యమునానదికి వరద వచ్చింది. ఉదయంపూట యజ్ఞం జరుగుతూ ఉంది. నేను నదిలోని నీటిని గమనిస్తూ ఉన్నాను. తపోభూమిలోని వెనుకవైపు ద్వారాలు, కిటికీలు అన్నీ మూసివేయించాను. అయినా నదినీరు రోడ్డుపైనుండి తపోభూమిలోకి వచ్చింది. నేను త్వరగా యజ్ఞాన్ని ముగింపజేసి, పవిత్రాగ్నిని, సమిధలు, యజ్ఞానికి అవసరమయిన యితర వస్తువులు, ఆహార పదార్థాలు, అన్నీ మూడో అంతస్థులోని ఒక గదిలోకి మార్పించాను. అక్కడ అప్పుడు విద్యార్థులు ఉన్నారు. వారందరినీ తపోభూమి విడిచి వెళ్లండి అన్నాను. నీరు దాదాపు నడుములోతు వరకూ వచ్చింది. మృత్యుంజయశర్మకు ఫోను చేసాను. పరిస్థితి చెప్పి, ఇక్కడి వారందరినీ అఖండ జ్యోతికి పంపిస్తున్నట్లు చెప్పాను. వారికి కావలసిన ఏర్పాట్లు అక్కడ చేయుమని చెప్పాను. ఆయన వెంటనే ఒకధర్మశాలలో వారికి ఉండే ఏర్పాట్లూ, భోజన ఏర్పాట్లూ చేశారు. కావలసిన సంబారాలు బజారు నుండి కొనుగోలు చేశారు, ఫోను చేసిన తర్వాత మేడపైకి బయలుదేరాను. అప్పటికి నీరు గొంతువరకూ వచ్చింది. పదినిముషాలు అక్కడే ఉంటే ప్రాణాలు పోవడం ఖాయం. మూడో అంతస్తుకు వెళ్లాను. ఆరాత్రి నాకు నిద్రలేదు. ఒక ధోవతి, బనియను మాత్రమే అక్కడ ఉన్నాయి. యజ్ఞ సామాగ్రి ఉన్నది. ఉదయం టీ త్రాగే అలవాటు నాకు. విద్యార్థుల గదులలోకి వెళ్లి చూశాను. ఒక బకెట్టులో నీరు ఉంది. ఈనీరు నాకు ఒకవారంరోజుల దాకా సరిపోవచ్చని అంచనా వేశాను. మరో గదిలో కొన్ని పాలు కనిపించాయి. టీపొడి, పంచదార కనిపించాయి. మరొక గదికి వెళ్లాను. ఒకచోట కొంత బ్రెడ్ ఉంది. గాయత్రీ మాత దయవల్ల యివన్నీ లభించాయని సంతోషించాను. కొంచం పాలతో టీ తయారు చేసుకొన్నాను. మెట్లదగ్గర స్నానానికి గూడా కొంత నీరు కనపడింది. పూజాసామాగ్రి గదిలో ఉంది.

మూడో అంతస్తులోనే భక్తితో యజ్ఞం చేశాను. హారతి ఇచ్చాను. రెండు బ్రెడ్ ముక్కలు తిని, టీ త్రాగాను. నదిలోని నీటిమట్టం ఇంకా పెరిగింది. మేడపైకి ఎక్కి చూశాను. నదిలో గేదెలు, మనుషులు కొట్టుకొని పోతూ ఉన్నారు. భయంకరమైన దృశ్యం. మనస్సులో వ్యాకులత. ఏమిచేయలేని స్థితి అది. ఆనీటి మట్టం, ఆ ఉరవడి మూడు దినాలు ఉన్నది. నేను మామూలుగా యజ్ఞం చేస్తూనే ఉన్నాను. హారతి రెండు పూటలా ఇస్తున్నాను. నాదగ్గర ఒక రేడియో ఉంది. వార్తలలో ఆ నీటిమట్టం మరో అయిదు అడుగులు పెరగవచ్చని సూచించారు. బహుశా నేను కొట్టుకొని పోవచ్చు ఆ వరదలో. నన్ను గాయత్రీ మాత మాత్రమే రక్షించాలి. చుట్టు ప్రక్కల మేడలపైన జైసింగ్‌పూర్ నుండి వచ్చిన మనుషులు ఉన్నారు. వారికి ఆహారం ఏర్పాటులేదు. సహాయ కార్యక్రమాలకు మిలిటరీ రంగంలోకి దిగింది. వారు ఆహారం పంపించాలా అని నన్ను అడిగారు. నాదగ్గరకు ఎలా చేరుతుంది? ఒక ద్వీపంలో ఉన్నట్లుగా ఉంది. హెలికాప్టరు లోనుండి మేడపైకి ఆహారం పడేస్తామన్నారు. నేను వద్దన్నాను. నాకోసం ఆహార పదార్థాలు వృధా చేయవద్దనీ, ప్రక్క మేడలపైన ఉన్నవారికి ఇవ్వమనీ సూచించాను. వారు అలాగే చేశారు.

నేను అఖండ జ్యోతికి పంపిన మనుషులు ఆందోళనలో ఉన్నారు. "పండిట్‌జీ నీటిమధ్యలో చిక్కుకున్నారు. వారికి ఆహారం లేదు. మృత్యుంజయశర్మ ఆందోళనతో హరిద్వార్‌లోని గురూజీకి ఉత్తరం వ్రాశారు. గురూజీకి ఫోనులో చెప్పారు. తపోభూమి మునిగిపోయిన విషయం, నీటిలో నేను చిక్కుకున్న విషయం చెప్పి, చాలా నష్టం జరిగిపోయిందని చెప్పారు. ఆ సాయంత్రం మృత్యుంజయ శర్మ ఒక పడవ ఏర్పాటు చేశారు. తపోభూమి వద్ద షుమారు ఏడు అడుగుల నీరు ఉంది. ఇద్దరు ఈతగాళ్లను పడవలో కూర్చోబెట్టారు. పాలు, ఆహారం, బట్టలు వారితో పంపారు. తపోభూమి ప్రధానగేటుకు తాళం వేశాను నేను. ఆ ఇద్దరు యీతగాళ్లు గేటుపైకి ఎక్కి, పడవలోని సామానును ఒకచేత్తో ఈదు కొంటూ నాకు చేర్చారు. బాబూ మీరు ఇంతకష్టం ఎందుకు తీసుకున్నారని వారిని మందలించాను. "మీరు ఈ పరిస్థితిలో ఉంటే

**శోభనిచ్చేది రెండే పెద్దలకు క్షమాగుణం - పిన్నలకు వినయ గుణం.**

అక్కడ మాకు ఆహారం సహించడంలేదు. నిద్ర పోలేక పోతున్నాము."– అన్నారు వారు. మూడురోజులకు సరిపడా ఆహార పదార్థాలు తెచ్చారు. నా గురించిన వార్తలతో వెళ్లిపోయారు. హరిద్వార్ నుండి గురుదేవులు నాకు ఒకలేఖ పంపారు. మిలిటరీ వారు ఒక త్రాడుసాయంతో ఆ లేఖను నాకు అందించారు. "కుమారా, తపోభూమి అంతా నష్టపోయినా, భవనం కూలిపోయినా నాకు బాధలేదు. నీకు ధైర్యం పోతే మాత్రం తపోభూమి అంతా నష్టపోతుంది. అందుచేత ధైర్యం విడువకు. మిగతాది నేను చూసుకొంటాను''– అని వ్రాశారు. ఆ ఉత్తరం పదేపదే చదువుకున్నాను. నాకు విపరీతంగా ధైర్యం వచ్చింది. గురుదేవులు నావెంటే ఉన్నారు, భయపడవలసింది ఏమీలేదని అనిపించింది. ప్రతిరోజూ రెండు పూటలా గాయత్రీమాతకు హారతి ఇస్తున్నాను. అఖండ అగ్నిలో ఒక్కో సమిధా వేస్తున్నాను. నాలుగోరోజుకు వరద తగ్గు ముఖం పట్టింది. రెండు గంటలలో నీరంతా వెళ్లిపోయింది. క్రిందకు దిగి గాయత్రీ మాత మందిరంలోకి వెళ్లాను. గాయత్రీమాత మెడవరకూ నీరు వచ్చింది. నోటిదగ్గరకు రాలేదు. చీపురుతో మందిరాన్ని శుభ్రపరచాను. ఈ సమయంలోనే యమునానది వరదనీరు తగ్గి పోయిందని చుట్టుప్రక్కల అలజడి వినిపించింది. ఈ సంగతి తెలిసి తపోభూమి సభ్యులు, విద్యార్థులూ అందరూ అక్కడకు జేరారు. నేను చీపురుతో చిమ్మడం చూసి, అందరూ తలా ఒక చీపురు తీసుకొని ఆప్రదేశాన్ని శుభ్రపరచడం ప్రారంభించారు. కాగితాలు తడిసి అతుక్కొని పోయాయి. ముద్రణాసామాగ్రి, యంత్రం, పాడైపోయాయి. గోడలలో పగుళ్ళు కనపడ్డాయి. అవన్నీ మామూలు పరిస్థితికి రావడానికి ఒకనెల పట్టవచ్చు. పట్నంలోని ప్రజలు, మునిసిపల్ అధికారులు వచ్చారు. మీరు ఆందోళన చెందకండి, మేము సహాయం జేస్తామని భరోసా ఇచ్చారు.

మునిసిపల్ సిబ్బంది ఆ కాగితాలన్నీ మేడపై భాగంలో ఆరబెట్టారు. మథురలో ముద్రణాలయాలు చాలా ఉన్నాయి. వాటి అధిపతులూ, ప్రజాప్రతినిధులు వచ్చారు. 'పండిట్‌జీ, మీకు కావలసిన సహాయం మేము చేస్తాము. ఆందోళన పడకండి'– అన్నారు. కాని అందరికీ ఒకటే భయం. వంద సంవత్సరాలకైనా

## ముందుగా పురుష ప్రయత్నం కావాలి

*అది వర్షాకాలం. వర్షాలు బాగా పడడంతో నాలుగువైపులా బురద నిండుకుంది. అలాంటి సమయంలో ఒక బండివాడు, తన బండిలో ప్రయాణిస్తుండగా, ఒక చక్రం బురదలో కూరుకుపోయింది. అప్పుడు అతను ఆకాశం వైపు దీక్షగా చూసి, చేతులు జోడించి, పరమేశ్వరుని ప్రార్థించసాగాడు. "హే పరమాత్మా ! నేను అత్యంత దీనుడను, ఈ కష్టం నుండి నాకు ముక్తిని ప్రసాదించు, రక్షించు." ఈ మాటలు వింటూనే ఆకాశం నుండి పరమేశ్వరుడు క్రిందికి చూశాడు. అతను హాయిగా సుఖంగా బండిలోనే కూర్చుని భగవంతుని ప్రార్థిస్తున్నాడు. అది చూచి పరమేశ్వరుడు– "ఓ మూర్ఖుడా ! సోమరితనంతో కూర్చుంటే పనికాదు. లేచి ఎద్దులను గట్టిగా అదిలించు. నీ భుజంతో బండి చక్రాన్ని కదిలించటానికి నీ పూర్తి బలాన్ని ఉపయోగించు, అప్పుడు నేను ఏమన్నా సహాయం చేయగలను. అంతేకాని, బద్ధకంగా, సోమరితనంగా కూర్చునే వాళ్లకి నేను ఎలాంటి సహాయాన్ని అందించను." అని అనగానే ఆ బండవాడు పరమేశ్వరుని ఆజ్ఞమేరకు ఆవిధంగానే చేయసాగాడు. ఇంతలో ఒక బాటసారి కొంత సాయం అందించాడు. చక్రం బురదలోంచి బయటపడింది. గాలిలో దీపంపెట్టి 'దేవుడా నీ మహిమ' అంటే సరిపోదు.*

*ఆత్మామదలంబ్ జిసికో కుచ్ బీన ప్యారా !*
*దేతే ఉసే న జగదీశ్వర్ భీ సహారా!!*

తపోభూమి బాగుపడుతుందా అని. కాని పట్టణ ప్రజలంతా సహాయానికి వచ్చారు. తపోభూమి నష్టపోకూడదని అందరికీ పట్టుదల. వారంరోజులు శుభ్రపరచడమే సరిపోయింది. దేశ ప్రజలందరూ నాకు పూర్తి సహకారం అందజేసారు. జిల్లా కలక్టరు కావలసిన సిమెంటు ఇచ్చారు. విద్యార్థులందరూ ఒక ఏడాది చదువు నష్టపోయినా పరవాలేదు, తపోభూమి త్వరలో యథాస్థితికి రావాలని పని చేయడం ప్రారంభించారు. వరద తాకిడి ప్రదేశాలకు బృందాలుగా బయలుదేరాము. సహాయం అందజేసాము. విద్యార్థులూ, ప్రజలూ, అందరి సహకారంతో తపోభూమి మళ్లీ మామూలు స్థితికి వచ్చింది.

★★★

క్రోధావేశంతో నరాలను రగిలించకు - కాలుతూ కాలుతూ కాల్చివేస్తాయి..

రమణజయంతి ప్రత్యేకం

# కంచిమీదుగా నా అరుణాచలయాత్ర-1

*(పాల్ బ్రంటన్ అనే పాశ్చాత్య ఆధ్యాత్మిక జిజ్ఞాసువు రచించిన "త్రూ కంచి టు అరుణాచల" అనే గ్రంథాన్ని శ్రీ అక్కిరాజు రమాపతిరావు తెలుగులోనికి అనువదించారు. రమణ జయంతి సందర్భంగా ఆ గ్రంథం మొదటి భాగాన్ని ఈ సంచికలో ప్రచురిస్తున్నాము. మిగతా మూడు భాగాలనూ తర్వాతి సంచికలలో ప్రచురిస్తాము.)*

నేను టిఫిన్ తీసుకొంటున్నాను. పని కుర్రాడు వచ్చి ఎవరో చూడడానికి వచ్చారని తెలియచేశాడు. బిస్కెట్లూ, టీ ముందున్నాయి. ఈ వ్యక్తి ఎవరా అన్న ఉత్సుకత కలిగింది.

ఈ వచ్చిన వారు సుప్రసిద్ధ రచయిత వేంకటరమణి. పరిచయ పత్రాలెన్నో నా సూట్‌కేస్‌లో అడుగున భద్రంగా ఉన్నాయి. కాని వాటిని ఉపయోగించుకోవాలన్న ఆసక్తి నాకేమాత్రమూ లేకపోయింది. ఈ పరిచయ పత్రాలన్నీ నాలో అణగిమణగి ఉన్న విచిత్రమైన ఆసక్తికి ప్రతిఫలంగా చేరినవే. ఇందులో ఒక్క పరిచయ పత్రాన్ని మాత్రం బొంబాయిలో ఉపయోగించాను. నాలోని ఆర్తి అక్కడే ప్రారంభమయింది. ఇంకొక్క పరిచయ లేఖను మద్రాసులో ఉపయోగపరచవలసి వచ్చింది. కేవలం ఇది పరిచయ లేఖ మాత్రమే కాకుండా, వ్యక్తిగత విషయాలు కూడా కొన్ని అందులో ఉన్నాయి. అది ఎవరికైతే ఉద్దేశింపబడిందో వారికి సంబంధించి ఉన్నాయి కనుక, ఆ లేఖ ఆ వ్యక్తికి వెంటనే చేర్పవలసి వచ్చింది. ఈ లేఖే వేంకటరమణిని నా గుమ్మం ముందుకు తీసుకొని వచ్చింది.

వేంకటరమణి మద్రాసు యూనివర్సిటీ సెనేట్ మెంబరు. అయితే ఇంతకన్నా, ప్రతిభావంతుడైన రచయితగా, అందునా పల్లె జీవితాన్ని గొప్పగా వర్ణించగల కథకుడుగా, నవలా రచయితగా బాగా ప్రసిద్ధుడు.

రవీంద్రనాథ్ ఠాగూర్ వంటి మహాకవి చేతను, హాల్డేన్ దొరవారి వంటి ప్రతిభావంతుల చేతను మెప్పుపొందినవాడు. వేంకటరమణి వచనం అందమైన రూపకాలతో నిండి ఉంటుంది. ఆయన కథలన్నీ నిరాదృతములైన పల్లెపట్టులను, అక్కడి విషాద వాతావరణాన్ని కళ్ళకు కట్టేట్లు వర్ణిస్తాయి.

ఇట్టే ఉభయులకూ ఆసక్తికరమైన ప్రస్తావనలోకి వచ్చేశాం. అనేకానేక విషయాలను గూర్చి పరస్పరం ముచ్చటించుకున్న తరువాత నేను ఏ ఉద్దేశంతో, ఏ ఆర్తితో యీ దేశంలో అడుగుపెట్టానో అతడికి చెప్పుకోవాలని అనిపించింది. ఎంతో ఆసక్తితో, దేశంలో మహనీయులైన యోగిపుంగవులు, అదిన్నీ తమ మహత్త్వాన్ని ప్రత్యక్షంగా ప్రదర్శించగలవారు ఉన్నారా? అని ప్రశ్నించాను. అంతేకాదు. బూడిద పూసుకున్న సన్యాసులు కాని, మాయ మంత్రాల ఫకీరులు కాని, నా అన్వేషణకక్కరలేదు అని కూడా స్పష్టం చేశాను, హెచ్చరికగా.

కొంచెం తలవాల్చి అడ్డంగా తిప్పాడు వేంకటరమణి. 'ఆ కాలం ఎప్పుడో గడిచిపోయింది. ప్రస్తుతం ఈ దేశంలో కూడా ప్రాపంచిక సుఖ భోగాలపట్ల ఆసక్తి అధికమైంది. పతనావస్థలో కూరుకొని పోవటం ఒకవైపు, ఆధ్యాత్మిక వాసన లేని పాశ్చాత్య సంస్కృతీ వ్యామోహం ఇంకొకవైపు, పెచ్చు పెరుగుతున్న సమాజంలో, అట్టి మహాత్ములు అదృశ్యులై పోవడంలో అబ్బురం లేదు. అయినా ఎవరో కొందరు ఇంకా లేకపోలేదని నా దృఢమైన విశ్వాసం. ఏ అడవుల్లోనో ముక్కుమూసుకొని బంధాలకు దూరంగా జీవితాలను గడుపుతుంటారు వాళ్ళు. పూర్తి అన్వేషణా తత్పరత్వం వహిస్తే తప్ప అట్టి మహా యోగీశ్వరులను దర్శించడం దుర్లభం. ఈ దేశీయులకే ఇట్టి ప్రయత్నం బహుధా దుష్కరం. అటువంటిది మీ వంటి పాశ్చాత్యులకు అది సిద్ధిస్తుందా?

'అయితే ఆ యోగం నాకు పట్టడం అనుమానాస్పదమే నంటారా?'

'ఏమో ఎవరు చెప్పగలరు. మీరు అదృష్టవంతులైతే పుణ్య పరిపాకం వలన మీ కోరికను సిద్ధింపచేసుకోగలరేమో!'

హఠాత్తుగా ఇలా ప్రశ్నించాను ఏదో ప్రేరణ కలిగి.

'ఉత్తరార్కాడు ప్రాంతంలో కొండమీద నివసిస్తున్న మహాత్ముణ్ణి గూర్చి మీకు వినికిడి ఏమైనా ఉందా?'

ఆయన తెలీదన్నట్లు తలఊపారు.

ఆ తరువాత ఏవో సాహిత్య విషయాలపైకి మళ్లింది ప్రస్తావన.

**పేదలకై నడిపించే సేవాతంత్రం - ప్రేమకదే కదా మూల మంత్రం.**

సిగరెట్ అందించబోయాను. మర్యాదగా తనకలవాటు లేదని ఆయనగారు తీసుకోలేదు. నేను సిగరెట్ ముట్టించి తృప్తిగా పొగ పీలుస్తుండగా వేంకటరమణి అంతరించిపోతున్న హిందూధర్మాన్ని గూర్చి, ప్రాచీన ధర్మంలోని వైశిష్ట్యాన్ని గూర్చి ఉద్విగ్న హృదయంతో వినిపిస్తున్నాడు. నిరాడంబరమైన జీవనమూ, పరోపకార పరాయణత్వం, నిండుగా నిబ్బరంగా బ్రతకటం, ఆధ్యాత్మిక ప్రవృత్తీ మొదలైన మహాదర్శాలను గూర్చి ఆయన ప్రస్తావించారు. ఈ కాలానికి హిందూ సంస్కృతి నాశనమై పోవటమే కాకుండా అంతూ పొంతూ లేకుండా పెరిగిపోతున్న దుష్ట విషయాలను తలచుకొని కూడా ఆయన కటకట పడ్డారు. ముఖ్యంగా ఈ దేశంలో ఐదు లక్షల గ్రామాలూ, మురికివాడలతో, కృత్రిమ విలువల కాలవాలమై పోతున్న నగర జీవిత వ్యామోహానికి బలై, తమ ఔన్నత్యాన్నీ శోభనూ పోగొట్టుకోరాదన్న తహతహ ఆయన మాటల్లో వ్యక్తమౌతున్నది. అపారమైన పారిశ్రామికీకరణ వలన పాశ్చాత్య దేశప్రగతి ఎలా పరిణమించిందీ ఆయన మనసులో మెదులుతున్నట్లున్నది. అందువల్లనే ఆయన మనసు స్వసంస్కృతికి కలగబోయే విపద్దశను గూర్చి ఆందోళన చెందుతున్నది. వేంకటరమణి దక్షిణ దేశంలో ప్రాచీనమైన ఒక పల్లెలో సంపన్న కుటుంబంలో జన్మించాడనీ, దారిద్ర్యంతోనూ, భ్రష్టమైపోతున్న సంస్క ృతితోనూ, ప్రస్తుత కాలానికి దుర్దశలో ఉన్న గ్రామ జీవితాన్ని తలచుకొని చాలా వైకల్యం చెందుతున్నాడని తెలుసు కొన్నాను. వాళ్లు అనుభవించని సుఖ సంతోషాలను తాను అనుభవించడానికి ఎంత మాత్రం యిష్టపడడని అతని మాటలలో స్పష్టపడుతున్నది. అతణ్ణి బాగా అర్థం చేసుకోవడానికి అతడు చెపుతున్న విషయాలనన్నిటినీ శ్రద్ధగా ఆలకించాను. వేంకటరమణి వెళ్లిపోవడానికి లేచాడు. బక్కపలచగా, పొడుగ్గా ఉన్న అతడి ఆకృతి క్రమంగా రోడ్డుమీద కనుమరుగైంది.

మరుసటి రోజు ఉదయం, ఆయాసపడుతూ, అత్యాశ్చర్యకరంగా వేంకటరమణి దర్శనం నాకు లభించింది. ఒకవేళ అప్పటికే నేను ఆ ప్రదేశాన్ని విడిచివుంటానేమోనన్న ఆందోళనతో కాబోలు హడావుడిగా వచ్చాడు వేంకటరమణి.

నన్ను చూసి ఊపిరి పీల్చుకొన్న తరువాత 'నా పరమ గురువు చెంగల్‌పట్టులో ఒకరోజు విడిది చేస్తున్నట్లుగా రాత్రి నాకు వర్తమానం అందింది' అన్నారు వేంకటరమణి ఒక్క గుక్కలో. తరువాత ఉచ్ఛ్వాస నిశ్వాసాలను క్రమబద్ధం చేసి 'కుంభకోణంలో నివసిస్తున్న పరమాచార్యులు శ్రీ ఆది శంకరాచార్య స్వామి వలె దక్షిణ భారతావనికంతకూ ఆధ్యాత్మికాచార్యులు. లక్షలాది జనులాయనను భగవదంశగా ఆరాధిస్తారు. ఆ స్వామి కృపాకటాక్షం నాకు లభించింది. ఆయన ఆశీర్వాదం నాకున్నది. నా ఆచార్యవర్యులాయనే. నిన్న మీరడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పకుండా నిగ్రహించుకున్నాను నేను. ఇప్పుడు చెబుతున్నాను. మా దృష్టికి పరమఋషి ఆ మహానుభావుడు. అయితే ఆయన గారు యోగసిద్ధులేవీ చూపరు. ఆయన దక్షిణ భారతంలో ఒక దివ్య జ్యోతి. అచ్చమైన ఋషి. ఆధ్యాత్మిక జ్ఞాన స్వరూపులు. సమకాలీన స్థితిగతులను బాగా ఆకళింపు చేసుకొన్న వారు. వివిధములైన ఆధ్మాత్మిక పథములను తెలిసిన వారు కాబట్టి. ఆ మహానుభావుణ్ణి అడిగితే, మీరు దర్శించగోరే నిజమైన యోగి పుంగవుని ఉనికి, మనం తెలుసుకోవచ్చునేమో ! ఈ మహానుభావుడు యావత్తు దేశమూ, నగరాలు, జనపదాలు విస్తారంగా పర్యటించారు. కనుక మీరు ఉత్కంఠ చూపుతున్న విషయం గూర్చి వారికి తెలియవచ్చు. వీరు ఎక్కడ కాలుమోపినా, సాధకులు, సత్సంగులూ తమ భక్తి ప్రపత్తులను వెల్లడించడానికి వీరి వద్ద చేరుతూ ఉంటారు. కాబట్టి మీ ఆర్తిని వారు తీర్చగలరు. వారిని దర్శించేందుకు మీకేమైనా అభ్యంతరమా?"

'మీరు నాపై చాలా దయ చూపుతున్నారన్నమాట. అదేమిటలా అంటున్నారు? తప్పకుండా నేను వారిని దర్శిస్తాను. చెంగల్పట్టు ఇక్కడకెంత దూరమేమిటి?"

'ముప్ఫయి అయిదు మైళ్ళు మాత్రమే. కాని అక్కడ మీరు కొంచెంసేపు వేచి ఉండాలి.'

'తప్పకుండా వెళదాం.'

'అయితే నాకొక సందేహం కలుగుతున్నది స్వాముల వారు మీకు దర్శన భాగ్యం అనుగ్రహిస్తారా? అని ! అయినా నేను చేయదగిన ప్రయత్నమంతా చేసి చూస్తాను. కాని........'

'నేను యూరోపియన్‌ను. కానివ్వండి. నేనర్థం చేసికొన్నాను.'

'ఆశాభంగానికి మీరు సర్వదా సంసిద్ధులుగా ఉండాలి' అన్నారు వేంకటరమణి వ్యగ్రమైన స్వరంతో.

'పర్వాలేదు. వెళదాం రండి.'

**రోగిని సరిచేస్తుంది ఔషధం - రోగాన్నే సరిచేస్తుంది ప్రకృతి.**

లఘువుగా భోజనం చేసి చెంగల్పట్టుకు బయలుదేరాం. దారిలో అంతా స్వామి వారిని గూర్చి మిత్రుణ్ణి ఎన్నెన్ని ప్రశ్నలో అడిగాను. ఎంతో ఆసక్తిని కనపరిచాను. ఆ స్వామి వారు ఆహార విషయంలోనూ, శరీరాచ్ఛాదన విషయంలోనూ, అచ్చమైన సన్యాసులనీ, అయితే పరంపరాగతంగా వస్తున్న సంప్రదాయాన్ని బట్టి మఠం వారు అనుసరించవలసిన మర్యాదలనుబట్టీ, పల్లకీలోనే సంచారం జరపవలసి ఉంటుంది. ఆయన వెనుక మహా సంరంభంతో ఏనుగులూ, ఒంటెలూ, మఠం తాలూకు పరివారమూ, వేదపండితులూ, శిష్యకోటీ ప్రయాణం సాగిస్తారు. స్వామి ఎక్కడ అడుగు మోపినా అయస్కాంతం ఇసుమును ఆకర్షించినట్లుగా పరిసర ప్రదేశాల నుంచి జనులు తండోపతండాలుగా మూగుతారు వారి వద్ద. ఈ మహాజనంలో ఆర్తులు, జిజ్ఞాసులూ, చివరకు అర్థార్థులూ, రోగులూ, దీనులూ కూడా ఉంటారు. సంపన్నులు వేలకొద్దీ ద్రవ్యాన్ని శ్రీవారి పాదాలకడ నిత్యమూ సమర్పణ చేస్తూ ఉంటారు. స్వామి వారు వైరాగ్య పరమావధి కనుక యీ ద్రవ్యం వారికెందుకు? యోగ్యులకు పంచిపెడతారు. దరిద్రులకు ఓదార్పు, విద్యాభివృద్ధికి వినియోగం, జీర్ణ దేవాలాయాల ఉద్ధరణ, మరమ్మత్తులు లేక చెడిపోతున్న తటాకాదులను బాగుపరచటం, స్వామి వారు తమ వద్ద చేరిన ద్రవ్యంతో నిర్వహిస్తుంటారు. వర్షపాతం మీదనే ఆధారపడిన చెరువులను, దొన్నెలను దక్షిణ దేశంలో చాలా చూడవచ్చు. అట్టి వాని విషయంలో శ్రీవారు తగిన శ్రద్ధ చూపారు. ప్రతి విడిది పట్టునా హిందూ మతంలోని ఉత్కృష్టతను, పారమార్థిక భావాలను, జనుల మనస్సులకు హత్తుకునేట్టు స్వామి ఉపన్యాసాలు చెపుతూ, దివ్య ప్రబోధంతో జనుల మనస్సులను, హృదయాలను స్పందింపచేస్తారు. మామూలుగా స్థానిక దేవాలయంలో ప్రబోధోపన్యాసం యిచ్చిన తరువాత భక్తులు, ఆర్తులు సంశయాలతో, వ్యక్తిగతమైన సమస్యలతో తమ వద్దకు చేరిన వారందరినీ మన్నించి ఓదార్పులూ, సమాధానాలు చెపుతారు.

## శ్రీ శంకర భగవత్పాదులు

శంకర భగవత్పాదుల నుండి మఠాధిపత్యాన్ని వహిస్తున్న పరంపరలో శ్రీవారు అరవై ఎనిమిదవ వారని తెలుసుకున్నాను. ఈ మఠాలను గురించీ, ఆచార్యవర్యుల మహిమల గూర్చీ శక్తి యుక్తుల గురించీ తెలుసుకోవాలనే ఉత్కంఠతో శంకరభగవత్పాదుల విషయమై కూడా వేంకటరమణిని అడిగి అనేక విషయాలు తెలుసుకొన్నాను. రెండువేల సంవత్సరాల క్రితం శంకర భగవత్పాదులు అవతారమెత్తినారనీ, పరమ సంయమీంద్రుల కోవకు చెందిన పరమ బ్రహ్మణ్యుడైన చరిత్రాత్మక పురుషుడాయన అనీ తెలుసుకున్నాను. శంకర భగవత్పాదుల వారు అపార మేధావిలసనం కల మీమాంసికుడనీ, అగ్రశ్రేణికి చెందిన వేదాంతద్రష్ట అనీ చెప్పవచ్చును. తన కాలానికి హిందూ సంఘమంతా, హీనదశను పొందటం, ఆధ్యాత్మిక సంపద అంతా అస్తుబిస్తు కావటం, గమనించి పునరుద్ధరణకు పూనుకున్నాడు. ఆయన కారణజన్ముడు. ఒక మహోద్యమానికి కర్త అని అనిపించడం సత్యమే. అష్టాదశ వర్ష ప్రాయం నుంచే ఆసేతు శీతాచలం పాదచారియై పర్యటించాడు. కుతర్కాలను, వితండవాదాలను ఖండిస్తూ కుహనామతాలను భంజిస్తూ తన మతాన్ని సహేతుకంగా ప్రతిపాదిస్తూ అనుయాయుల నెందరినో చేర్చుకున్నాడు.

ఆయన ఎంత కుశాగ్రబుద్ధి అంటే ఆయనతో తలపడిన వారిలో ఏ ఒక్కరూ ఆయన ముందు తలయెత్త లేకపోయేవారు. శంకర భగవత్పాదుల వారు తమ జీవితకాలంలోనే దేవాంశ సంభూతులుగా కీర్తింపబడ్డారు. మామూలుగా మహాపురుషుల జీవితాలన్నీ అవతార పరిసమాప్తి అనంతరం కాని లోక ప్రసిద్ధాలు కావు. శంకర భగవత్పాదుల వారి విషయంలో అట్లా కాకుండా, వారి జీవిత కాలంలోనే సాక్షాద్భగవదవతారమే అన్న ఆరాధన వారు పొందారు. బహుముఖమైనవి వారి ధ్యేయాలు. వేద సమ్మతమైన ప్రాచీన మతపునరుద్ధరణమే ఆయన పరమాశయమైనా, అనపేక్షితాలైన అనేక దుష్టశక్తులు, మతాన్ని ఆలంబనం చేసుకొని విజృంభించడాన్ని ప్రతిపాదిస్తూ శుష్కకర్మలను తీవ్రంగా నిరసించారు శంకరులు. తాను సన్యసించినప్పటికీ తల్లికి ప్రేతకర్మలను స్వయంగా ఆచరించటం ద్వారా సనాతనుల కోపానికి గురియైనారు. ఈ పని చేసినందుకు గాను పురోహితులు భగవత్పాదులను వెలివేశారు.

కర్మకాండనంతా సమూలంగా నిరసించి సత్య ప్రతిపాదనం చేసిన బుద్ధ భగవానునికి ఈ పరివ్రాజక వారసుడని చెప్పాలేమో ! సమకాలికుడైన ఆచార్యవర్యులతో వాదిస్తూ జాతి మాత్రం చేతగాక, జన్మమాత్రం చేతగాక, జ్ఞానం వల్లనే ఎటువంటి వారైనా,

**వర్తమానంలో వచ్చే కష్టాలు - భవిష్యత్తుకవే నిక్షేపాలు.**

భగవదనుగ్రహం పొంది, మోక్షార్హులౌతారని శంకరులు ప్రతిపాదించారు. జ్ఞానాన్వేషణకు, కులమూ, వర్ణమూ, జన్మమూ ఏ మాత్రమూ ప్రతిబంధకాలు కావు. పరమ గతికి కొనిపోయేది జ్ఞానమేనని శంకరుల సిద్ధాంతం. అన్ని మతాలూ, ఈషద్భేదాలతో, పరమేశ్వర పాదసన్నిధినే లక్ష్యంగా చేసుకొన్నవని భగవత్పాదు లనుశాసించారు. అద్వైతమార్గాన్ని ప్రసాదించారు. ఇంతే కాకుండా పండితులూ, విద్వాంసులూ, ఆచార్యవర్యులూ శంకర విరచిత గ్రంథాలను నేటికీ అధ్యయన, అధ్యాపనలు గావిస్తూనే ఉంటారు. శంకరులు ప్రతిపాదించిన అద్వైత మతాన్ని వ్యాఖ్యానించడంలో పలుత్రోవలు తొక్కుతున్నా, పలు వివాదాలు చెలరేగినా ఈ దేశంలో అద్వైతం పట్ల ఎవరికీ కూడా అగౌరవ దృష్టి లేదు. భగవత్పాదుల వారు కాషాయాంబరధారియైన పలాశ దండాన్ని చేబూని హిందూదేశమంతా నాలుగు దిక్కులా పర్యటన గావించారు. అత్యద్భుతమైన కౌశలాన్ని ప్రదర్శించి, దేశంలో నాలుగువైపులా ప్రధానమైన స్థానాలలో ఆది శంకరుల వారు నాలుగు ఆచార్యపీఠాలను స్థాపించారు. ఉత్తరాన బదరీనాథ్‌లోను, తూర్పున పూరీలోను, ఇంకా ఇతరత్రా ఇలాంటి ఆచార్యపీఠాలను నెలకొల్పారు శంకరులు. వీటన్నింటికీ కేంద్రంగా దక్షిణదేశంలో తాను ఏ ప్రదేశాన్నుంచి, తమ ప్రచారం ప్రారంభించారో, ఆ ప్రదేశంలో ఒక గొప్ప దేవతాలయమూ, మఠమూ స్థాపించారు. నేటికి కూడా దక్షిణదేశం దేవతాత్మకంగా శంకర భగవత్పాద ప్రతిపాదిత, అద్వైత ప్రచారశీలురైన సాధు సన్యాసులు దేశం నలుమూలలా సంచారం చేసేందుకు బయలుదేరుతూనే ఉంటారు. శంకర భగవత్పాదులు ముప్ఫై రెండేళ్ళ వయస్సున బ్రహ్మసిద్ధి పొందినారని ఐతిహ్యం ఉన్నది. కాని కొందరు భగవత్పాదుల వారు బ్రహ్మసిద్ధి పొందడం సంగతిని ఒప్పుకోక అదృశ్యమైపోయినారని చెప్పే గాథ కూడా ఒకటి ఉన్నది.

మూల పురుషుడైన ఆది శంకర భగవత్పాదులను గూర్చి ఇంతగా ప్రస్తావించటంలోని అవసరమేమిటో, కామకోటి పీఠాధిపతియైన ఇప్పటి శ్రీవారిని చూడటంతో నాకు బాగా అవగతమైంది. సాక్షాత్తూ ఆదిశంకర భగవత్పాదుల వారి వలెనే నేడున్నూ శ్రీవారు దివ్యబోధను కొనసాగిస్తున్నారు. దీనికి సంబంధించినదే అయిన ఒక సంప్రదాయ విశ్వాసం కూడా ఉన్నది. అది శంకర భగవత్పాదులు, తమ భక్తులకూ, శిష్యులకూ తామెల్లప్పుడు కూడా ఈ పీఠాధిపతులైన ఆచార్యవర్యులతో ఛాయామాత్రంగా వెన్నంటి ఉంటూ, భక్తులను కరుణిస్తూ ఉంటామని అనుగ్రహించినారట. ఇట్టిదే ఒక విశ్వాసం టిబెట్ దేశపు 'లామా'లకు సంబంధించినది కూడా ఉంది. మామూలుగా పీఠాధిపత్యం వహిస్తున్న స్వాముల వారి నిర్యాణ సమయంలో, స్వాములు పేర్కొన్న లేత వయస్సు వ్యక్తికి తదనంతర పీఠాధిపత్యం సంక్రమిస్తూ ఉంటుంది. సర్వ సామాన్యంగా ఇటువంటి వ్యక్తి పదేళ్ళ లోపు వయస్సులోనే ఉంటాడు. ఆ తరువాత వేద వేదాంగాలు సర్వ శాస్త్రాలూ, సమస్త విద్యలూ ఆయా రంగాలలో నిష్ణాతులైన విద్వద్వరేణ్యుల ద్వారా స్వామి అధ్యయనం చేస్తారు. యోగమూ, ఉపాసనా తదితరములైన ఆధ్యాత్మిక సిద్ధులు స్వామి కరస్థం చేసుకుంటారు తదుపరి, తరువాత ప్రజలలో బోధ ప్రారంభిస్తారు. ఈ పరంపరలో గొప్పదైన సంయమమూ గొప్ప చరిత్రా లేనివారెవరూ ఇన్ని శతాబ్దాల లోను మఠాధిపత్యం వహించలేదనే సత్యం గమనార్హం.

వేంకటరమణి, ప్రస్తుతం కామకోటి పీఠాధిపతులైన శ్రీవారి దివ్య చరిత్రను ఉజ్జ్వల ఘట్టాలలో వినిపించారు. శ్రీవారి బంధుకోటిలో, ఆయనకు వరుసకు సోదరుడైన వారొకరు కీళ్ళ నొప్పుల వ్యాధితో ఎన్నో సంవత్సరాలుగా మంచానికి అంటిపెట్టుకొని ఉండవలసి వచ్చింది. శ్రీవారు వారిని అనుగ్రహించి వారి వద్దకు వెళ్ళి చూసి ఆయన శరీరాన్ని స్పృశించినంత మాత్రం చేతనే ఆయన వ్యాధి సంపూర్ణంగా నిమ్మళించింది. శ్రీవారు ఆయనను తాకిన మూడు గంటల వ్యవధిలోనే ఆ రోగ గ్రస్తుడు లేచి పక్కమీద కూర్చోవడమే కాకుండా పక్క దిగి నడవడం, సంపూర్ణంగా రోగ విముక్తుడు కావటం జరిగింది. ఇంతేకాకుండా శ్రీవారు ఎదుటి వారి మనోభావాలను ఇట్టే గ్రహిస్తారు. చూసీ చూడటంతోనే అన్న నమ్మకం కూడా, ఎవరి సంగతి ఎట్లా ఉన్నా వేంకట రమణికి మాత్రం సంపూర్ణంగా ఉన్నట్లు స్పష్టమే.

★★★

**ముందుగా నాలుకను జయించు - అదే సకల విజయాలను కలిగించు.**

# గంగాజలం - వైజ్ఞానికత

గంగాజలములో ఉండే కొన్ని రసాయనిక పదార్థాల మిశ్రణం చాలా ఆశ్చర్యకరమైన పరిణామాలను సూచిస్తుంది. గంగాజలము సంవత్సరాల కొద్ది నిలువ ఉంచినా పాడవదు. ఇంకా తరచి చూస్తే పాడైన పదార్థాలు గంగలో కలిపితే తమ చెడు ప్రభావాన్ని పోగొట్టుకొంటాయి. హరిద్వార్ లోని గంగానది ఒడ్డున ముఖ్యంగా బ్రహ్మకుండంలో లక్షల మణుగుల ఎముకలను తోసేస్తారు. ఈ కుండం నుండి ఆ ఎముకలను పైకి తీసివేయడానికి ఏ రకమైన ఏర్పాట్లు లేవు. కాని గంగాజలం యొక్క ప్రభావం వల్ల అక్కడ ఎముకలన్ని కరిగిపోయి వాటి అవశేషాలు కూడా లేకుండాపోతాయి. ఈ విధంగా జరుగుతున్నప్పటికీ నేటికి గంగాజలం డాక్టర్లు పరిశోధనలో పరిశుద్ధంగా ఉన్నదని తేలుతోంది. అంటువ్యాధులు సోకిన ఎముకలు తమ విషంతో గంగాజలాన్ని విషపూరితం చేయవు సరికదా తామే విషరహితమైపోతాయి.

వైద్యులు వ్రాసిన గ్రంథాలలో అజీర్ణం, విషజ్వరం, బొల్లి, విరోచనాలు, ఉబ్బసం, పార్శ్వపునొప్పి మొదలైన అనేక రోగాలకి గంగాజల సేవనం చాలా లాభదాయకం అని ఉంది. ఆరోగ్యాన్ని పటిష్ఠం చేయడంలోను అంటురోగాల రోగాణువులను నాశనం చేయడంలోను గంగా తీరంలో ఉండమనడానికి కారణం అక్కడి జల వాయువు వల్ల కుష్ఠు నయమైపోతుందని. కుష్ఠు పెరుగుదల ఎక్కడిదక్కడే ఆగిపోవడం మొదట కనిపించే గుణం. మంచు కరిగి శుద్ధమైన నీరుగా నదిలోకి వస్తుంది. అంతేకాక ఏ పర్వతాలనుంచి ఈ జలం ప్రవహిస్తుందో ఆ ప్రదేశాలలో లాభకరమైన రసాయనిక ఖనిజాలు, మూలికలతో నిండిన వనాలు ఉన్నాయి. ఆ పదార్థాలన్ని గంగాజలంలో కలిసి ఒక గారడి చేయగలిగిన గుణాలనూ ఆ జలానికి కలుగజేస్తాయి. బంగారం, వెండికి సంబంధించిన కొంత భాగము గంగాజలంలో లభిస్తుంది. ఇది బలాన్ని వృద్ధి చేయడంలో ఉపయోగకరమైనది. గంగాజలం శుద్ధి చేయడంలో ఎంత శక్తివంతమైనదంటే నేటికీ నగరాలలోని చెత్త-చెదారాన్నంతటినీ దానిలోకి నెట్టివేస్తున్నా, నీరు మలినం కావడంలేదు. శుద్ధిగానే ఉంటున్నది. వందలకొద్ది నదులు, కాలువలు దారిలో వచ్చి చేరుతున్నా అవన్నీ గంగలో కలిసి గంగ నీటి గుణాలను సంతరించుకుంటున్నాయి. డాక్టర్ నెల్సన్ ప్రకారము కలకత్తా నుండి వెళ్లే ఓడలు హుగ్లినది నుండి గంగాజలాన్ని తీసుకొని లండన్ వెళ్లే వరకు ఏమీ పాడుకావు. లండన్ నుంచి వచ్చేటప్పుడు థేమ్స్ నది నీళ్ళు నింపితే అవి బొంబాయి చేరే సరికే పాడైపోతాయి.

ఫ్రాన్స్‌కి చెందిన డాక్టర్ డి హెటెల్ గారి ప్రకారం, తాను చేసిన వైజ్ఞానిక ప్రయోగాల ద్వారా గంగాజలంలో క్షయ, సంగ్రహణి రోగాల వంటి కఠినతరమైన రోగాలను బాగుచేసే శక్తి ఉంది. అంతే కాక దెబ్బలకు, గాయాలకు, కురుపులకు కూడా మందులాగ గంగాజలం పనిచేస్తుంది. ఈ డాక్టర్ గారు ఈ గంగాజలాన్ని కలిపి 'బేక్టీరియా ఫాజ్' అనే ఔషధాన్ని తయారుచేశారు. అది కఠినతరమైన రోగాలని కుదురుస్తుంది.

అమెరికాకి చెందిన ఒక యాత్రికుడు మార్క్‌ట్వైనే భారతదేశాన్ని దర్శించడానికి వచ్చి ఆగ్రా నగరానికి వెళ్లగానే ఒక ఆశ్చర్యకరమైన ప్రకటనను చదివాడు. అదేమిటంటే అంటురోగాన్ని వ్యాప్తిచేసే సూక్ష్మక్రిములను నాశనం చేసే వాటిల్లో ముఖ్యమైనది గంగాజలం. ఈ ప్రకటన అక్షర సత్యమని రుజువు చేయబడింది.

ప్రభుత్వ వైజ్ఞానిక విభాగానికి చెందిన కార్యకర్త మిస్టర్ హెన్‌కేన్ ఎన్నోరకాలుగా కలుషితమైన అంటువ్యాధులతో నిండిఉన్న నీటిని రక-రకాల నదుల నీళ్లతో ప్రయోగాలు చేశాడు. గంగాజలంతో చేసిన ప్రయోగంలో కొన్ని గంటలలోనే కీటాణువులన్ని నశించిపోవడం కనిపించింది. కాని ఇతర నదుల నీటిలో ఆ కీటాణువుల సంఖ్య అసాధారణమైన వేగముతో పెరిగిపోయింది. 1924లో జర్మనీకి చెందిన ప్రముఖ వైజ్ఞానిక డాక్టర్ జె ఆలివర్ భారతదేశానికి విచ్చేశారు. ఆతడు ఇక్కడి అన్ని నదుల నీటిని పరీక్షించారు. తాను పరీక్ష సలిపిన వాటికి సంబంధించిన విస్తృతమైన రిపోర్టులో ఆయన గంగాజలం గురించి వ్రాస్తూ "గంగాజలం ప్రపంచంలోని అన్ని జలాలకంటే స్వచ్ఛమైనది, పవిత్రమైనది. కీటాణువులను నశింపచేసే శక్తిగలది. ఆరోగ్యకరమైనది." అని పేర్కొన్నాడు. ఈ రిపోర్ట్ న్యూయార్క్‌కి సంబంధించిన ఇంటర్నేషనల్ మెడికల్ గెజిట్‌లో అచ్చువేశారు. యూరప్‌కి చెందిన జల విశేషజ్ఞుడు డాక్టర్ ఈ.ఎఫ్ కేహియాన్ కూడా భారతదేశపు జలాల పరీక్ష జరిపి గంగాజలమును గురించి ఈ విధంగా పేర్కొన్నాడు- గంగాజలం అత్యంత స్వచ్ఛమైనది, పవిత్రమైనది. దీనిలో రక్తాన్ని పెంచే శక్తి ఉంది. రోగులకి ఈ నీటి ద్వారా విచిత్రమైన మానసిక శాంతి లభిస్తుంది. ఈ కారణంగానే భారతదేశంలో మరణాసన్నమైన వ్యక్తి నోటిలో పోస్తే మృతప్రాయుడైన వ్యక్తి లేచి కూర్చున్న సంఘటనలు కూడా కనిపిస్తాయి. విజయనగరానికి చెందిన రాజు శ్రీకృష్ణదేవరాయలు మృతప్రాయుడై ఉన్నప్పుడు గంగాజలమును నోటిలో పోస్తే ఆ ప్రభావము వల్ల అతడు తిరిగి ఆరోగ్యవంతుడు అయినాడు.

గంగాజలం యొక్క విశేషగుణాలు దాని గొప్పతనం గురించి ఈ ప్రపంచంలో చాలా తక్కువ మందికే తెలుసు. ఈ గుణాలు, లాభాలు గురించి ఈ ప్రపంచానికి తెలిసిన రోజున ఆస్తికులైన హిందువుల వలె అందరు గంగను ఆరాధిస్తారు.

★★★

**మౌన వృక్షాన్ని పెంచి పోషిస్తే - శాంతి ఫలాలను అందిస్తుంది.**

# పవిత్రమైన మనస్సే సౌందర్యానికి పునాది

## మానసిక పవిత్రతతో సౌందర్యాభివృద్ధి

సౌందర్యాభివృద్ధికి ఉపకరణాలు అందమైన, నిర్మలమైన భావాలు, మానసిక శక్తి. అందమనే ఆదర్శాన్ని నిరంతరం మననం చేసికోవడం వల్లనే సౌందర్యం ప్రాప్తిస్తుంది అని విద్వాంసుడైన ఒక డాక్టరు చెప్పారు. సౌందర్యాన్ని భావనలో ఉంచుకోవడమన్నా, అందంగా ఉండడమన్నా రెండూ ఒక్కటే. ఎందుకంటే మనస్సు ఏదైనా అందమైన వస్తువుపై నిలపంగానే అది ఆ వ్యక్తియొక్క అంగంగా మారిపోతుంది. సౌందర్యాభివృద్ధికి తోడ్పడే విషయాలు మరెన్నో ఉన్నాయి– నమ్ర స్వభావం, ప్రేమ దృష్టి, పవిత్రమైన ఆలోచనలు, అహింసాత్మక భావాలు సౌందర్యాన్ని మరింతగా మెరుగుపరుస్తాయి, అంతేకాక వీటి ప్రభావం ముఖంలోనే ప్రతిబింబిస్తాయి.

నిజానికి, ఆంతరిక ఆలోచనాధారతోనే బాహ్య ఆకృతి తయారవుతుంది. అందువల్ల ప్రతి వ్యక్తి తనకు కావలసిన విధంగా ఆలోచించాలి, మాట్లాడాలి. తెలివైన తల్లి, మొదటినుండే తన పిల్లలపై పవిత్ర భావాల ప్రభావం పడేటట్టు జాగ్రత్త పడుతుంది. ఎందుకంటే, సౌందర్యమనేది అంతరంగికంగానే ఉత్పన్న మవుతుంది; అది సత్యంతోను, పవిత్ర ఆలోచలతోను స్థిరపడుతుంది. పూర్ణ సౌందర్యమనేది పూర్ణ మానసిక, శారీరిక ఆరోగ్యాలకు ప్రమాణము. అత్యుత్తమమైన, పవిత్ర భావాలు ప్రతి ఒక్క అవయవంనుండి ప్రసరించాలి. అప్పుడే శరీర భాగాలనుండి సౌందర్యం సంచరిస్తుంది, వికసిస్తుంది. మనస్సుయొక్క ప్రభావం శరీరం మీద పడితీరుతుంది. మనస్సు బాధను కలిగించనూగలదు. తొలగించనూగలదు. మనసు శోకతప్తమైతే ప్రాకృతిక సౌందర్యం, ఆరోగ్యం ఎక్కువకాలం స్థిరంగా ఉండలేవు. హృదయాంతరాళంలోని ఆలోచనల ప్రతిబింబమే ముఖములోని వెలుగునీడలు. **చిరునవ్వు, మానసిక ఉత్సాహం, ప్రసన్నత, ఆనందం వల్లనే అందమైన ముఖాకృతి తయారవుతుంది.** ముఖాకృతిలో సంభవించే సూక్ష్మమైన హెచ్చు– తగ్గులు ఏదో ఒక సమయంలో కాకుండా అలాగే కొనసాగితే మాత్రం ఆ మార్పు స్వాభావికమైపోతుంది. ఫలితంగా మనిషి అందంగానో, కురూపిగానో మారుతాడు. దుష్ట స్వభావం దాగి ఉన్న ఆకృతి ఎప్పటికీ అందంగా తయారవదు, కాని, "అంతరంగం ఉన్నతమైన భావాలతో ఓలలాడుతున్న ఆకృతి బాహ్యంగా మనోహరంగా లేకపోయినప్పటికీ, మంచిభావాల కాంతిని దాచి ఉంచలేదు"– అని ఒక అనుభవజ్ఞుడైన విద్వాంసుని కథనం. అందుకే పవిత్రాత్మలు కల్గిన మహాపురుషుల దర్శనంతో ఒక విశేషమైనటువంటి ఆనందానుభూతి కలుగుతుంది. బీదరికంతో దీనంగా ఉన్న వ్యక్తి కురూపిగా కనిపించినా, అతడే ఐశ్వర్యవంతుడయ్యాక మానసికంగా నిశ్చింతను పొంది ఉత్సాహంగా కనిపిస్తాడు. ఆతని మొహంలో విచిత్రమైన ఒక కాంతి కనపడుతుంది, నిజానికి ఆకృతనేది మనస్సుకు నిజమైన అద్దం, స్వభావానికి ఫొటో.

అందమనేది ప్రాకృతికమైనదనే మాట నిజమే. కాని చిరకాలం దాన్ని కాపాడుకోవడం, కాపాడుకోలేకపోవడం అనేది మన ఆధీనంలోనే ఉంటుంది. చాలా వరకు మనం తయారు చేసికున్న ఆకృతిని కష్టపడి ప్రయత్న పూర్వకంగా మార్చుకోగలం– ఇది నిర్వివాదమైన సత్యం. కొన్నిసార్లు, కొంతమంది స్త్రీ, పురుషుల ఆకృతులలో నిరుత్సాహమే కనపడుతుంది. కాని మనం అంతకు ముందు ఏ కారణాలవల్ల నిరుత్సాహం, అప్రసన్నత, దుఃఖం అనేవి కలిగాయి? నిజానికి అవి చింతాగ్రస్తమైన హృదయ వికారాలేనా? ఈ విధంగా మనిషి ప్రపంచంలోని ప్రతి వస్తువునీ నిరాశాపూరిత దృష్టితో చూస్తాడెందుకు? అని ఆలోచించాలి. ఈ స్వభావాన్ని పారద్రోలడానికి ఉన్నతమైన మనోబలాన్నీ, ఇచ్ఛాశక్తినీ ఉపయోగించాలి; పూర్ణానందాన్ని పొందిన మనిషి ఆశావాదిగా మారతాడు, అప్పుడు ఆశించిన శోభ ఆవిర్భవించి ఖచ్చితంగా ఆకృతి మారుతుంది. కావున, ఎప్పుడైతే మనిషి తనకు నచ్చిన వస్తువు లభించలేదో, తన అపజయాల అనిష్ట ప్రభావాన్ని వర్తమాన ప్రయత్నాల ద్వారా తుడిచివేసుకోవాలి; లోభత్వం కలిగి ఉన్నవారైతే నిరంతరం ఏదో ఒక లభించని వస్తువుపై ఆశలు నింపుకుంటారు. అటువంటివారు ప్రస్తుత పరిస్థితిలోనే తృప్తిని పొందడం నేర్చుకోవాలి. అదే వారికి

నీటిపైనున్న నావకు కలుగదే హాని - నావలో నీరు చేరితేనే గ్లాని.

పరమహితమైనది. కొంత మంది ముఖముల నుండి ఎప్పుడూ దుఃఖం, నిరుత్సాహం, చిరాకు, కోపం, సంకుచితత్వం, లోభం, కపటం, దంభం, శత్రుత్వం ఉట్టిపడుతూంటాయి, అటువంటి వారి ఆకృతుల ప్రాకృతిక సౌందర్యం ఎంతోకాలం వరకు నిలిచి ఉండదు. ముఖాకృతి మారడానికి మానసిక దశ మారడం చాలా అవసరం. దుఃఖం, నిరుత్సాహాల స్థానంలో ప్రసన్న చిత్తం, ఉల్లాసం, చిరాకు, కోపాల స్థానంలో సర్వ ప్రియత్వం, మనోరంజనాలు, సంకుచిత్వం స్థానంలో ఔదార్యం, సంతోషాలను ఉత్పన్నం చేసికోవాలి.

**రోగం గురించే ఆలోచించడం, రోగం వస్తుందేమోనని సందేహించడం వల్ల కూడా రోగాలు కలుగుతాయి; అలాగే దుస్సాధ్యమైన రోగాల గురించి ఆలోచనలు హృదయం లోంచి తీసిపారేస్తే, తప్పకుండా ఆరోగ్యవంతులైపోతారు**. తమను తాము అందమైనవారని అర్థం చేసుకోవడమే అందంగా మారడానికి అసలైన రహస్యం. వినాశకర ఆలోచనలు హృదయంలోంచి తొలగించుకుంటే నిరంతరం మీలో మీకే అందమైన ఒక ఆశ కనిపిస్తూ ఉంటుంది. ఏదో ఒక దివ్యరూపంగా మీ రూపాన్ని మారుతున్నట్టు ఊహించండి, చెడుకోర్కెలు తొలగించుకుని ఉత్తమ, పవిత్ర భావాలను చిత్తంలో ప్రవేశపెట్టండి, శోకం, రోగాల చింతన వదిలేసి, ఈశ్వరునిపై నమ్మకంతో ప్రస్తుతం ఉన్న స్థితిలో ఆనందంగా ఉండండి. ఎల్లప్పుడూ మనసును ప్రశాంతంగా ఉంచి చూడండి, మీ ఆకృతిపై సౌందర్యం తన ప్రకాశాన్ని తప్పక ప్రసరిస్తుంది. అందంతో పాటు ఉత్తమ ప్రకృతి కలిగి ఉండడమంటే బంగారానికి తావి అబ్బడం లాంటిదే. చెడుకోరికలు, వ్యభిచార భావాల మాత్రంతోనే ఆకృతి కాంతిహీనంగా, నిస్తేజంగా, మలినంగా మారిపోతుంది. ఉత్తములైన స్త్రీ పురుషులకు ఎంత దగ్గరగా వెళితే, అంతగా వారి ఆకృతిలో మంచితనం తెలుస్తుంది. అదేవిధంగా చెడ్డవారికి ఎంత దగ్గరగా వెళితే, అంతగా వారి ఆకృతిలోని దోషం కనిపిస్తుంది. సౌందర్య ప్రాప్తికి సత్యప్రియత, న్యాయము, పవిత్రత, మితభాషణము, దయ, సరళత్వము, ఆత్మీయత, ధైర్యం, ఉత్సాహం, వీరత్వం, పరోపకారం మొదలైనవి ముఖ్య సాధనలు.

సౌందర్యానికి నిజమైన సహకారి ప్రేమ. తల్లి దండ్రుల పరస్పర ప్రేమ ఉత్తమ సంతానాన్ని తయారు చేస్తుంది, భార్యా-భర్తల మధ్య గల ప్రగాఢ ప్రేమ, పిల్లల మనసుల్లో గూడుకట్టుకుని వారికి సౌందర్యాన్ని పెంపొందిస్తుంది. అందుకే **తల్లిదండ్రులు, పిల్లల మధ్య పరస్పర ప్రేమానురాగాలుంటే పిల్లలు అందంగా తయారవుతారు**; ఎప్పటికీ అందంగానే ఉంటారు.

బుద్ధి, ఆత్మిక ఉన్నతి, విద్య ఇవన్నీ అందాన్ని చాలా వరకు ఇనుమడింపచేస్తాయి. ఒకే ఇంట్లోని ఇద్దరు అక్కచెల్లెళ్లని తీసుకోండి, వారిలో ఒకరు మర్యాదస్తురాలై, మరొకరు అవిద్య, అమర్యాద కలిగినవారై ఉంటే గనుక మొదటమ్మాయే రూపవతి అయి ఉంటుంది. విద్యవల్ల కూడా ముఖంపై ప్రతిభ కనబడుతుంది. కనుక స్త్రీ పురుషులందరు వయోభేదం లింగ భేదం లేకుండ మానసిక పవిత్రను పెంచుకోవాలి.

★★★

## వెంటవచ్చే ధనం విద్య

*ఒక పెద్ద ఓడ సముద్రంలో పయనిస్తుంది. నిండుగ జనాలున్నారు. హఠాత్తుగా దానికి ఒక చిల్లు పడింది. అందులోంచి నీళ్ళు ఓడలోకి నిండడం మొదలైంది. కొంతసేపట్లో ఇక ఓడ మునిగిపోతుందని అర్థమౌతోంది. అందుకని అందులోని యాత్రికులు తమ ధనాన్ని, విలువైన సామాన్లను మూటకట్టి నడుములకీ, భుజాలకీ కట్టుకోవడం మొదలుపెట్టారు. ప్రయాణించే వారిలో ఒక గొప్ప కవి కూడా ఉన్నాడు. అతను మాత్రం నిశ్చింతగా కూర్చుని ఉన్నాడు. ఇది చూసి తోటి ప్రయాణీకులు కారణం అడిగారు. "కవీంద్రా ! మీ దగ్గర చాలా ద్రవ్యం ఉన్నప్పటికీ వాటిని మీరెందుకు నడుముకి కట్టుకోవటంలేదు?" దానికి ఆ కవి ఈ విధంగా జవాబిచ్చాడు. "నా దగ్గరున్న అత్యంత విలువైన, అవసరమైన వస్తువు నాలోనే ఉంది." అన్నాడు. కొద్ది సేపట్లో ఇక ఓడ మునిగిపోతుంది. అనగా, ప్రయాణికులు అందరూ నీళ్ళలోకి దూకారు. ఈత వచ్చిన వారంతా ఈదారు, రాని వారి శరీరం ధనము, విలువైన వస్తువులతో నిండి ఉండడం వల్ల భారంగా తయారై, అక్కడే మునిగిపోయారు. ఆ కవికి కూడా ఈదడం వచ్చు. ఎటువంటి బరువైన వస్తువు లేకపోవడంతో తేలికగా ఒడ్డువరకు ఈదగలిగాడు. ఆ ఒడ్డుకు దగ్గరలోనే ఒక గ్రామంలోకి ప్రవేశించాడు. ఆ ఊళ్లోనివారంతా ఈ కవీంద్రుని గొప్పతనం ముందే విని ఉన్నారు. కాబట్టి వారంతా ఆయన్ని ప్రేమగా ఆహ్వానించారు. కొద్ది కాలంలోనే ఆ కవి మళ్లీ ధనవంతుడయ్యాడు. తర్వాతంతా సంతోషంగా జీవించాడు.*

**మనం పొందింది మానవాకృతే - మరిచింది మాత్రం మానవ ప్రకృతి.**

మనం-మన ఆరోగ్యం-ఆహారం-1

# ఏంతినాలి? ఎందుకుతినాలి? ఎలాతినాలి?

మనం తినే ఆహారం రుచికి, ఆరోగ్యానికీ అనుగుణంగా ఉండాలి. శాస్త్రప్రకారం భోజనాన్ని ఒక ఔషధంలాగ అనగా ఎంత వరకు అవసరమో అంతే స్వీకరించాలి. ఆరోగ్య విషయాన్ని లెక్క చేయకుండా, రుచి కొరకే అన్నట్లు మనం భోజనం చేస్తాము. దీంతో సమస్యలు ఎక్కువవుతాయి. రుచి కొరకు తగినంత ఆహారం తీసుకుంటే పరవాలేదు. కానీ వ్యాపార రంగం పెరిగిపోయాక ఆకలికి బజారు వస్తువులను కొని తింటున్నాము. మార్కెట్‌లో ఆహారాన్ని గురించిన కొలతల పట్టీ కూడ ఉంటుంది. మనలోపమేమిటంటే మార్కెట్‌లో తెలిపిన ప్రకారం తీసుకొనే ఆహారం శ్రేష్ఠమైందీ, ఆరోగ్యానికి తప్పనిసరి అనుకుంటాం.

ప్రస్తుత పరిస్థితి పురాతన ఆహారస్థానంలో ఫాస్ట్‌ఫుడ్స్ వచ్చాయి. ఈ ఆధునిక ఆహారాన్ని సర్వశ్రేష్ఠమూ, గౌరవప్రదమూ అనుకునే స్థితికి వచ్చింది. ప్రకటనల ద్వారా ఇవి ఇంకా గొప్పవిగా అనుకుంటున్నాం. ఇది ఒక పరిశ్రమగా తయారైంది. బజారులో లభ్యమయ్యే ఈ ఆహార పదార్థాలను గౌరవనీయ కుటుంబాల వాళ్లు తీసుకుంటున్నారు. ఆరోగ్యానికి ఇవి ఎంత హానికరమో ఆలోచించడంలేదు. కడుపునిండడం కోసం ఆహారం అవసరం కానీ మార్కెట్ వస్తువులు అనడం ఒక స్టేటస్‌గా ఎంచబడుతోంది, ఇంట్లో తయారయ్యే ఆహారం కానీ, పాతపద్ధతులలో తయారు చేసే ఆహారాన్నీ తినడానికి సంకోచిస్తున్నారు. మూడు రూపాయలకు కిలో బంగాళదుంపలకు బదులు మూడువందల రూపాయలు కిలో ప్రకారం దొరికే ఛిప్స్ (పాకెట్లలో ఉన్నవి) తినడం గౌరవప్రద మనుకుంటున్నారు. కూజాలో నీళ్ళు తాగడానికి బదులుగా పాకెట్లలోనూ సీసాలలోని నీళ్ళను త్రాగుతున్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాన్ని సంపాదించగల మార్కెట్ పరిశ్రమ ఇది.

ఈ పరిశ్రమలో అన్నమూ, రొట్టెల స్థానంలో పిజ్జాలూ, బర్గర్లూ, నూడుల్స్ మొదలైన వాటికి ప్రోత్సాహం ఎక్కువైంది. ఉరుకు, పరుగుల ఈ ఆధునిక కాలంలో సమయం తక్కువగా ఉండడం వల్ల వీటి ఆకర్షణ ఎక్కువైంది. ఇది ఆరోగ్యానికి ఎంత హాని కలిగిస్తున్నదో ఆలోచించడం లేదు. అఖిల భారతీయ ఆయుర్వేద సంస్థ (ఎమ్స్) తయారు చేసిన ఒక రిపోర్టులో ఈ ఫాస్ట్‌ఫుడ్స్ వల్ల ఎంత దుష్పరిణామాలు ఉన్నాయన్నది విశదీకరించ బడింది. దీనిప్రకారం స్త్రీలలో నూటికి 55 మంది, పురుషులలో నూటికి 45 మంది ఈ విధమైన ఆహారం వల్ల దూబవళ్లు వచ్చిన వారున్నారు. నూటికి 76 మంది స్త్రీలు ప్రేగుల సంబంధమైన వ్యాధితో బాధపడుతున్నారని తేలింది.

ఈ ఆధునిక ఆహారంవల్ల డాక్టర్ల వ్యాపారం కూడ బాగా అభివృద్ధి చెందింది. ఆహారంవల్ల ఆరోగ్య సమస్య లెక్కువై డాక్టర్ల వద్దకు పరుగులు తీస్తున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆహార అలవాట్లవల్ల వచ్చిన ఈ భయంకర పరివర్తనను ఆపకపోతే భవిష్యత్తులో ఢిల్లీ "డయాబటీస్ కాపిటల్ ఆఫ్ ది వరల్డ్"గా తయారవుతుందనీ, ఈ విధమైన ఆహారంవల్ల వచ్చే హృద్రోగాలను గురించి కూడ హెచ్చరించారు.

ఆహార పదార్థాల మార్కెట్ పెద్ద పరిశ్రమగా రూపొందాక వీటి వాడుక ప్రాధాన్యమెక్కువైంది. మార్కెట్ బాగా వృద్ధిచెందింది. ఆరోగ్యం దిగజారి పోతోంది. వరల్డ్ వాచ్ ఇన్‌స్టిట్యూట్ రిపోర్టు ననుసరించి మనదేశంలో ఫాస్ట్‌ఫుడ్ పరిశ్రమ ఏడాదికి 40 శాతం కంటె అధికంగా వృద్ధి అయింది. 2005 చివర ఈ వ్యాపారం 4800 కోట్ల రూపాయలను మించిపోయింది. ఈ మొత్తాన్ని సామాన్య ప్రజల ఆహారం, ఆరోగ్యం కోసం ఖర్చుపెట్టినట్లైతే 35 లేదా 40 శాతం మంది సమస్యలు పరిష్కారమౌతాయి.

కాన్ఫడరేషన్ ఆఫ్ ఇండియా రిపోర్టు కూడ పైవిషయాన్నే సమర్థిస్తోంది. ఖాద్య పదార్థాల ఖర్చు సంవత్సరానికి రెండున్నర లక్షల కోట్లు సాధారణ భోజనం అనగా అన్నము, రొట్టె మొదలైనవి ఆరోగ్యకరం. ఖర్చు చాలా తక్కువ. కాని ప్రస్తుతం ఇంతకంటె 10 రెట్లు అధికమైన ఖరీదు చేసే ఆధునిక ఆహారాన్ని తీసుకుంటూ ఆరోగ్యాన్ని పోగొట్టుకుంటున్నాం. ప్రపంచంలోని పెద్ద పెద్ద కంపెనీల దృష్టికూడ భారతదేశం మీద పడింది. పిజ్జాహట్, మాక్‌డొనాల్డ్ మొదలైన కంపెనీలు ఇక్కడ ప్రారంభమైనాయి.

సాధ్యమైనంత వరకు స్వదేశీ స్వదేశీ - అసాధ్యమైతేనే విదేశీ.

నేడు పాశ్చాత్య సభ్యతను అనుసరిస్తున్నాం. మార్కెట్‌లో భోజనం తయారుచేసి ఏ విధమైన ఆహారం తింటే మన ప్రతిష్ఠ పెరుగుతుందో నిర్ధారిస్తున్నారు. ఆవిధంగా చేయనివారు నిమ్న శ్రేణివారిగా భావిస్తున్నారు. వ్యాపారస్తులు తమ వ్యాపారాన్ని పెంచుకోవడానికి ఎన్నో విధాలుగా ఉపాయాలు చేస్తున్నారు.

భారతదేశంలో చెప్తూతూ ఉంటారు. దుస్తులు ఇతరులకు అందంగా, గౌరవనీయంగా కనపడాలి, భోజనం మన అభిరుచి ప్రకారం ఉండాలి. కానీ పాశ్చాత్యులను గ్రుడ్డిగా అనుకరిస్తూ మనం దుస్తుల విషయంలోనూ మన సంస్కృతికి తిలోదకాలిస్తున్నాం. అలాగే భోజనం విషయంలోనూ అనుకరిస్తూ ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటున్నాం. మల్టీనేషనల్ కంపెనీలలోని ఖరీదైన ఆహారాన్ని తీసుకునే ముందు ఆరోగ్యానికి హాని కలగనంతవరకు కొంతమేర తినవచ్చు. తెలివితక్కువ తనంతో డబ్బుఇచ్చుకొని రోగ, శోకాల్ని కొనుక్కొనే వారి అజ్ఞానం ఏమని చెప్పాలి?

చరక సంహితలో ప్రకృతి ఏ వస్తువులనైతే భోజన రూపంలో అందిస్తోందో అది ఒక దివ్యౌషధం అని చెప్పబడింది. హిమాలయాల్లాంటి శీతలదేశాల్లో వేడిని కలిగించే ఔషధ మొక్కలు పెరుగుతాయి. ఎడారుల్లో తర్‌బూజా, ఖర్‌బూజా లాంటి శీతల పదార్థాలు పెరుగుతాయి. ఈ విధంగా శీతోష్ణస్థితి ననుసరించి ఆహారపదార్థాల ఉత్పాదన మనదేశ విశిష్టత, ఋతువులననుసరించి ఏమి తినాలి, ఏమి తినకూడదని కూడ మనవైద్యం చెపుతుంది. ఆచార్య వాగ్‌భట్ భోజనం ఎంత తినాలి, ఎలా తినాలి అని కూడ నిర్దేశించారు. వారు చెప్పిన ప్రకారం రెండువంతుల ఘన పదార్థం, ఒక వంతు ద్రవపదార్థం ఉండాలి. ఒక వంతు కడుపు ఖాళీగా ఉండాలి. కడుపులో ఖాళీలేకపోతే తిన్న ఆహారం జీర్ణంకాదు.

చరక సంహిత (2/6) ప్రకారం "అమాత్రా త్వం పున ద్వివిధా మాచక్షతే– హీనమ్ అధికంచ" అనగా ఆహారం రెండు విధాలు హీనమాత్ర, అతిమాత్ర. హీనమాత్ర భోజనం కావలసిన భోజనం కంటె తక్కువగా ఉంటుంది. ఇటువంటి ఆహారం శరీరం యొక్క బలాన్నీ, రంగునూ, వీర్యాన్ని, ఆయువును పుష్టిని క్షీణింపచేస్తుంది– వాత రోగాలకు కారణమై మనస్సు, బుద్ధి, ఇంద్రియాలకు చెడు చేస్తుంది. అతి మాత్ర భోజనం ఎక్కువ మోతాదులో ఉంటుంది.

## ముందుచూపు అవసరం

*గాలి సరిగా లేనికారణంగా ఒక ఓడ భారంతో, మెల్లగా నడవ సాగింది. అప్పుడు నావికులు నాయకుని దగ్గరకెళ్ళి, పడవలోని అనవసరపు వస్తువులను నీటిలో వేయడానికి అనుమతి కోరారు; ఆ నాయకుడికి ఆ సూచన నచ్చింది. సరే అన్నాడు. దాని ప్రకారంగా ఆ పడవ నడిపేవారు అనవసరమనిపించిన సామాన్లను సముద్రంలోకి పడవేసారు. వెంటనే ఓడ తేలికవడంతో వేగంగా నడవసాగింది. కాని కొంతసేపటికే పెద్ద గాలి వీచడంతో, తేలికగా ఉన్న ఓడ తడబడి బోర్ల పడింది. అందులోని మనుషులంతా మునిగిపోయారు.*

*ఏదైనా పని చేసేటప్పుడు రాబోయే కష్ట నిష్ఠురాలను ఆలోచించుకోవాలి.*

ఇటువంటి భోజనం సమస్త దోషాలకు మూలమని చరకుని అభిప్రాయం. సుశ్రుతుడు కూడ అధికంగా భోజనం చేయడంవల్ల సోమరితనం, బరువుగా ఉండడం, అలసట ఇలాంటివి ఉత్పన్న మౌతాయి అని తెలిపారు. ఉచిత మోతాదులో భోజనం చేయడం వల్ల ఆమాశయంలో ఏవిధమైన బరువు పడదు. హృదయ సంబంధమైన ఏ బాధా ఉండదు. కడుపు బరువుగా ఉండదు. మనస్సు, బుద్ధి, ఇంద్రియాలు ప్రసన్నంగా ఉంటాయి. బలం, వీర్యం, శరీరం పుష్టిగా ఉంటాయి. ఉదయం తిన్న భోజనం సాయంకాలానికీ, సాయంకాలం తిన్న భోజనం ఉదయానికి బాగా జీర్ణమవుతుంది.

ఫాస్ట్‌ఫుడ్స్‌లో భోజనంలో తగుమోతాదులో ఉండే గుణాలు లేవు. మన దేశంలో ఈ రకమైన ఆహారం శుభకరం కాదు, నష్టదాయకం కూడ. ఆరోగ్య కరమైన జీవనంకోసం తగిన మోతాదులో ఆహారం స్వీకరించాలి. దీనివల్ల మనం శారీరికంగా, మానసికంగా ఆరోగ్యవంతులుగా ఉంటాము. మనం ఎప్పుడూ ఏ రోగమూ లేకుండా ఆరోగ్యంగా, ప్రసన్నంగా ఉండాలి. ఇదే ఎక్కువ కాలం జీవించగలగడానికి దోహదపడే రహస్యం.

★★★

**ఎవరికీ అప్పులేనివాడే - ఎప్పటికీ ముప్పు లేనివాడు.**

గురుదేవుల అమృతవాణి

# సంస్కరింపబడిన వాణితో చమత్కారాలు

ఓం భూర్భువఃస్వః, తత్సవితుర్వరేణ్యం
భర్గోదేవస్య ధీమహి, ధియోయోనః ప్రచోదయాత్

## శౌర్యం - సాహసం

సాహసం, మనోబలం మాత్రమే సమస్త విజయాలకు మూలం. బందిపోటు నిర్భయంగా మందీబార్బలంతో తరలివస్తాడు. దోపిడీ చేసిన తరువాత తిరిగి అడవులలో, గుట్టలలోనికి, మిట్టలలోనికి ప్రవేశిస్తాడు. ఆ ప్రదేశాలు పొదలతో, కందకాలతో నిండి ఉంటాయి. వాడు రాత్రిపూట ఎక్కడ నిద్రిస్తాడు? ఎక్కడో ఒకచోట ఏ గుట్టచాటుకో పోయి పడుకుంటాడు. అక్కడ పాములుంటాయి. తేళ్లుంటాయి. అవి కాటు వేయవచ్చు గూడా! రాత్రి పూట అక్కడ దీపాలు వెలగవు. కరెంటు ఉండదు. అంతా కటిక చీకటి! నిర్జనమైన అరణ్యంలో, చీకటిలో ఎదురు దెబ్బలు తగులుతుంటాయి. ఐనా, ఎదురుదెబ్బల నెదుర్కుంటూ, పాములకు, తేళ్లకు, భూత, ప్రేతాలకు భయపడక ఆ గజదొంగ ధైర్యంగా సాహసంతో ముందుకు నడుస్తాడు. దీని పేరే దోపిడీ. ధైర్యానికి, సాహసానికి ప్రయోజనం తాను చేసిన దోపిడీసొత్తే.

శరీర నిర్మాణంలో, బరువులో మనిషికీ, మనిషికీ మధ్య పెద్దగా వ్యత్యాసం ఉండదు. బందిపోటుకూ, మామూలు మనిషికీ మధ్య గూడా తేడా ఏమున్నది? తేడా ఒక్కటే. అది సాహసంలో, ఆ సాహస బలంతోనే ఒకరిద్దరు గజదొంగలు సహచరులతో గ్రామమంతటా గగ్గోలు రేకెత్తిస్తారు. అందరినీ భయపెడతారు. సర్వాన్నీ తోచుకుని అంతర్ధానమవుతారు. గ్రామంలో50,60 మంది మనుషులుంటారు. కాని ఇద్దరు బందిపోట్లు లూటీ చేసిపోతారు. వీరిలో తేడా ఏమిటి? సాహసమే. చిన్న, పెద్ద, అన్ని పనులలోనూ కొంత రిస్కు ఉంటుంది. అయినా సాహసం పనిచేస్తుంది. ప్రపంచంలో మహాపురుషులేమి చేస్తారు? వారు రిస్క్‌తో కూడిన పనులుచేస్తారు. వారు నిరంతరం జీవితంతో జతకడతారు. వారు ఏ పద్ధతిలో రిస్క్ తీసుకుంటారు? రిస్క్ తీసుకోటానికి ఒక సాధనం కావాలి. దాని పేరు సాహసం. సాహసాన్ని పెంపొందించే సాధన జపం.

## జపంతోపాటు సామర్థ్యం కావాలి

మీరు జపం చేస్తున్నారు. బాగానే ఉంది. మీరు జపం చేయటంతో పాటు శౌర్యాన్ని కూడా పెంచుకోండి. ధైర్యం, శౌర్యం మీలో లేకపోతే, మీరు చేసే జపం తెలియకుండా ప్రాచీనమైన ఆచారాన్ని పాటించటమే అవుతుంది. దీనివల్ల మీకు ఎటువంటి ప్రయోజనమూ కలుగదు. అందువల్లనే జపంలో అనుష్ఠాన శక్తిని గురించి గొప్పగా చెప్పారు. అనుష్ఠాన ఫలితం చాలా ఎక్కువ. అనుష్ఠానాలలో చమత్కారాలు (Miracles) దర్శనమిస్తాయి. అనుష్ఠాన మహిమ ఎంతో కొనియాడబడి, కీర్తించబడింది. అదే గాయత్రీ మంత్రం. అదే మాల, అదే జపం. కాని అనుష్ఠానంలో శక్తి ఎందుకు ఉత్పన్నమవుతుంది? ఎందుకంటే, అందులో వగరు, చేదు ఎక్కువగా ఉత్పన్నమవుతాయి. మిమ్మల్ని నేను చాంద్రాయణ వ్రతం చేయటానికి ఇక్కడకు పిలిచాను. మీతో బాగా కఠినంగా ఉండాలని నిశ్చయించాను. అది ప్రతి అనుష్ఠానంలోనూ చేపట్టవలసినవి. చేపట్టాలి కూడా.

మాపట్ల మా గురుదేవులు కఠినంగా వ్యవహరించారు. ఈ కటుత్వం మమ్ములను బలిష్ఠంగా చేసింది. సమ్మెట దెబ్బలను తిని, తిని లోహం బలంగా మారుతుంది. కఠినంగా మారుతుంది. దాంతో ఆయుధాలు తయారు చేస్తారు. పనిముట్లు తయారుచేస్తారు. దెబ్బలు తిన్నతరువాత, ఒరిపిడి పట్టిన తరువాత, కొడవలి యొక్క లేదా ఖడ్గం యొక్క పదును తీక్షణమవుతుంది. మొన పదునవుతుంది. సాన పట్టకపోతే పదునురాదు. మెరుపు వస్తుందా? రాదు. మనవద్ద ఉన్న ఆయుధానికి గానీ, పనిముట్టుకుగాని మెరుపురావాలంటే, పదును కావాలంటే కాఠిన్యం అవసరం. పదును పెట్టటం అవసరం. అనుష్ఠాన ప్రక్రియ వెనుక ఈ సిద్ధాంతమే పనిచేస్తుంది. అనుష్ఠాన సామాన్య నియమాలను నవరాత్రుల సందర్భంగా మనం చెప్పుకున్నాం, ఆచరించాం. నవరాత్రి అనుష్ఠానం మీరు చేసి ఉంటే మీలో ఏ తేడా వచ్చింది? 27 మాలలు గాయత్రీ జపంచేయండి. 27 మాలల జపం ఏవిధంగా చేశారు? చాపమీద పడుకుని కూడా జపం చేయవచ్చు. అందులో ఆక్షేపణలేదు. మేముకూడా ఎటువంటి బంధాలు, ప్రతిబంధాలు విధించలేదు. మీ పట్ల కాఠిన్యత చూపలేదు. మీలోగల మనోబలాన్ని కొలవలేదు. ఇంత కటువుగా వ్యవహరించటానికి మీలో సంకల్పం, మనోబలం ఉన్నాయా? లేదా?

ఏమాత్రం చేయకుండా కష్టం - ఫలితం రానే రాదన్నది సుస్పష్టం.

## కష్టసహిష్ణుతలోనే వస్తుంది సామర్థ్యం

మన ఉపాసనలో సంకల్పం, మనోబలం ఉంటే, ఆ ఉపాసన సమర్థవంత మవుతుంది. శక్తివంతమవుతుంది. చమత్కారవంత మవుతుంది. ఫలితం చూపించటం మొదలవుతుంది. మా మీద ఏ కాఠిన్యత మా గురువుగారు చూపించారో దానిని మీరు కూడా గ్రహించి దాని మహత్యాన్ని అర్థం చేసుకోవాలి. అంతే కాదు. దాన్ని స్వీకరించటానికి తగిన సాహసాన్ని చూపండి. నా జీవితంలో సంవత్సరానికి ఒకటి చొప్పున 24 సంవత్సరాలలో 24 అనుష్ఠానాలను చేశాము. ఎంత సమయంలో పూర్తి చేశాను? ప్రతి రోజూ ఆరుగంటలు చేశారు. మేము కూడా ఆరుగంటలు చేస్తామనవచ్చు మీరు. మీకూ మాకూ తేడా ఏమిటి? మా శరీరం మీద చాలా బంధాలున్నాయి. వాటిలో ఏ లోపం జరుగ కూడదు. ఆసనం విషయంలో కాసేపక్కడ, మరికాసేపిక్కడ, లేచి తిరుగుతూ జపం చేయటం, పనికిరాదు. ఒకే చోట ఆసనం వేసుకుని కూర్చుంటే ఆరుగంటల జపం పూర్తయిన తరువాతనే లేవటం. చేసి చూడండి? మీరీవిధంగా చేయలేరు. ఎంత వత్తిడి ప్రతిక్షణం భరించాలో తెలుస్తుంది. ఆ విధంగా తపించి నేను వెలుపలికి వచ్చాను.

## నాలుకకు పదును పెట్టాలి, ఉడికించాలి, పక్వం చేయాలి

చాంద్రాయణ వ్రతం ఎన్నోరకాలు. మిమ్మల్ని చిన్న పిల్లలుగా భావించి కొంచెంతేలిక చేస్తున్నాను. మనోబలం లేనివారికి, తనువు, మనసు బలహీనంగా ఉన్నవారికి, మేము శిశు చాంద్రాయణ వ్రతాన్ని విధిస్తున్నాము. దానివల్ల కొంత వారు అర్థం చేసుకుంటారు. కొంత తృప్తిపడతారు మేమూ చేశామని, దాంతోపాటు తపస్సు యొక్క కఠోరత ఎటువంటిదో గ్రహించాలి. మనస్సు మనస్సే. దాన్ని సాధించవచ్చు, దానికి నేర్పవచ్చు. చాంద్రాయణ వ్రతంలో కొన్ని నియమాలు కఠినంగా ఉంటాయి. అటువంటి కఠినమైన నియమాలను మీకు చెప్పటం లేదు. ఎందుకంటే వాటిని మీరు భరించలేరు. మీరు మోయలేనంత బరువును మీ మీద వేయటంలేదు. కాని మా మీద ఉంచుకుంటాము. మీకు మేము అన్నపానాల విషయంలో కొంత చెప్పాము. వాటి విషయంలో మేము కఠిన నియమాలను శిరసావహించాము. ఎంత కఠినంగా వ్యవహరించాం? ఏ జిహ్వతో మంత్రాన్ని ఉచ్చరించాం? ఏ జిహ్వతో జపం చేశాం? ఏ జిహ్వతో భగవానుని ప్రార్థించాం? ఏ జిహ్వతో లోకులకు వరదానాలను ప్రసాదించాం? ఆశీర్వదించాం? ఏ జిహ్వతో సలహాలనిచ్చాం? (వారు పాటించేటట్లుగా), లోకుల హృదయాలలో ఆలోచన పెరిగేటట్లు ఏ జిహ్వతో ఉపన్యాసాలు చెప్పాం. అందుకు తగ్గట్లు పెరిగేటట్లు అ జిహ్వకు పదును పెట్టాలి. పక్వం చేయాలి. ఇనుమును, ఉక్కుగా మార్చటానికి ఏ విధంగా తపింపజేయాలో అంత చేయాల్సిందే. కత్తికి ఎంతగా పదును పెడితే సమర్థవంతంగా పనిచేస్తుందో ఆ విధంగా జిహ్వకు పదును పెట్టాలి. అప్పుడా జిహ్వ ఖడ్గం వలె పనిచేస్తుంది. ఈ విధంగా మా నాలుక మీద ఇంతటి నిబంధనలను విధించుకున్నాం. ఈ కాఠిన్యం మీరు తెలుసుకోవాలి. జిహ్వపట్ల మేము 24 సంవత్సరాలు అంత కఠినంగా వ్యవహరించాం.

## అణచివేతకు పరిణామం జిహ్వలో వచ్చిన బలం

ఇతరులు భోజనం చేస్తుంటే మాకు గూడా రుచి చూడాలనిపించవచ్చు. నాలుక అంటుంది, అందరూ రుచికరమైన భోజనం చేస్తుంటే మనం గూడా చేయవచ్చుగదా అని నేనంటాను, నీవు నేను చెప్పినట్లు వినాలని. నీవు నానోటిలో ఉన్నావు, నా ఇంట్లో ఉంటున్నావు, నామాట వినాలి అని. అయితే నాకు సెలవివ్వమని జిహ్వ అంటుంది. అదేమీ కుదరదు, నీవు నాకోసం పుట్టావు, నా ఇంట్లో ఉంటున్నావు, నీకు నేను బానిసను కాదు, నీవు నా బానిసవు. ఈ యుద్ధం సాగుతూనే ఉన్నది 24 సంవత్సరాలపాటు. ఆమధ్య నాకు గూడా కొంచెం మిఠాయి తినిపించుమని ఎన్నోసార్లు వేడుకున్నది. పెండ్లి పేరంటాలు, పండుగలు, పబ్బాలు వచ్చినప్పుడల్లా జిహ్వ గోలపెడుతూనే ఉన్నది. కాని నామీద బంధనం ఉన్నది, తినటం కుదరదన్నాను. నేను కొన్ని సిద్ధాంతాలకు కట్టుబడి ఉన్నాను. అందరూ అన్నీ తింటారు. కాని నేను తినను. సాధకునికి, సామాన్యులకు తేడా ఉంటుంది. సాధకుడు సాధకుడే! తపస్వి తపస్వియే. బ్రాహ్మణుడు బ్రాహ్మణుడే. మనుషులు, మనుషులే లోకులు పనికిమాలినవారు, సామర్థ్యపరులు, సోమరిపోతులు. లోకులు తక్కువ కట్టుబాట్లు కోరితే, సాధకులు కట్టుబాట్లకు కట్టుబడి ఉండాలి. నేను చెప్పిన మాటలు విని జిహ్వ సహకరించింది.

24 సంవత్సరాలు జిహ్వను అదుపులో ఉంచినందుకు పరిణామం, దానితో ఏ మంత్రం చెప్పినా, ఏ జప తపాలు చేసినా, అవన్నీ సమర్థవంతములైనాయి. అవి ఫలితాలనిచ్చాయి. అద్భుతాలు చూపించాయి. ఈ కటుత్వం లేకపోతే, మేమేమీ చేయగలిగే వారము కాదు. జప సంఖ్య పూర్తవుతుంది. అంతమాత్రాన ఏదైనా పరిణామం కలిగిందా? లేదు. ఎందుకంటే జిహ్వ ఎప్పుడైతే నియంత్రింపబడలేదో అప్పుడు పరిణామం కలుగదు. జిహ్వతో లోకులకు కథలు చెప్పవచ్చు. వ్యాఖ్యానాలు చెప్పవచ్చు. ప్రజలకు శుభం కలిగించవచ్చు.

**పరులపై మోపిన నిందలు - పురోగమనానికి బొందలు.**

అనుష్ఠానంతో పక్వం చేయబడిన జిహ్వ చాలా శక్తివంతమైనది. జిహ్వ యొక్క చమత్కారంతో ఒక కథ వినిపిస్తాను మీకు. ఋష్యశృంగ మహర్షి కొన్ని శబ్దాలనుచ్చరించి, కొన్ని మంత్రాలను పఠించి దశరథునికి పుత్రులు కలగాలని ఆశీర్వదించాడు. అది నూటికి నూరుపాళ్లు సఫలమైంది. ఆయన జిహ్వతో పలికినది పలికినట్లు జరిగింది నిజమే.

## తపస్సు వల్ల మంత్రాలకు సామర్థ్యం వస్తుంది

మంత్రాలలో కొంత శక్తి ఉంటుందా? ఉండదు. మంత్రాలలో ఎటువంటి శక్తీ ఉండదు. కొన్ని అక్షరాల సముదాయం మంత్రం. అది ముద్రణాలయాలలో ముద్రింపబడి లభిస్తుంది. మీరనవచ్చు వాటిని మేము టేపుమీద రికార్డు చేసుకుంటాము. ఎప్పుడు కావాలనుకుంటే అప్పుడు వినవచ్చు, వినిపించవచ్చునని. జపం చేస్తూ ఉంటాము. ఇది అమ్మవారి మంత్రం. ఇది తేలు మంత్రం. ఇది పాము కాటుకు మంత్రం. మేము టేపు చేసుకున్నాం. విన్నాం, వినిపించాం. మంత్రం తేలుకాటుకు పని చేసిందా? పాముకాటుకు పనిచేసిందా? దయ్యాలు పారిపోయినాయా? మేమేం చెప్పాలి? కాని ఇది మంత్రమే. వాటితో చమత్కారాలు జరుగుతున్నవా? శబ్దాలలో శక్తి ఉండదు. కాని మంత్రం వల్ల శక్తి కలుగుతుంది. మంత్రానికీ, శబ్దానికీ తేడా ఏమిటి? ఒకటే తేడా! మంత్రోచ్చారణ చేయటానికి సాధకుని వాణి, సాధకుని వ్యక్తిత్వం, సాధకుని శీలం, అన్నీ పనిచేస్తాయి. శబ్దాన్ని ఉచ్చరించటానికి జిహ్వ పనిచేస్తుంది. అంతే అంతకంటె పని జరుగదు. శబ్దాన్ని ఏ భాషలోనైనా పలుకవచ్చు. సంస్కృతంలో శ్లోకాలు చదువవచ్చు. ఏ భాషలోనైనా పలుకవచ్చు. మీ జిహ్వ సరిగా ఉండాలి. అది చాలు.

శబ్దాలనుచ్చరించటానికి పేరు మంత్రం. ఇందులో కేవలం కొన్ని శబ్దాలను, అక్షరాలను పదే పదే, ముందుకు, వెనుకకు పలుకటం, ఇదంతా చూస్తే చాలా సుగమంగానే కనిపిస్తుంది. మంత్రానికి కట్టుబాట్లేమీలేదు. ఫలానావారు చదివితే ఫలితం వస్తుంది, ఫలానావారు చదివితే ఫలితం రాదు, అనేదేమీ లేదు. ఇటువంటి కట్టుబాట్లుండగూడదు. కాని వాణిలో తేడా ఉన్నదని మనం గమనిస్తూనే ఉన్నాం. ఇప్పుడు శృంగి ఋషి కథను వినిపించాను. ఆయన గురించి మరొక కథ ఉన్నది. అదీ ఆయన జిహ్వకు సంబంధించినదే. ఋష్య శృంగుని తండ్రిపేరు శమీక మహర్షి, ఆయనే శృంగునికి దీక్షనిచ్చి, చదువు నేర్పారు. అప్పుడు శృంగి చాలా చిన్నపిల్లవాడు. ఎక్కడికో ఆడుకోటానికి పోయాడు. అప్పుడేమయింది? పరీక్షిన్మహారాజు ఆశ్రమానికి వచ్చాడు. శమీక మహర్షి తపస్సులో మునిగి ఉన్నాడు. ధ్యానంలో ఉన్నాడు. నన్ను చూచి లేచినిలబడలేదని పరీక్షిత్తుకు కోపం వచ్చింది. ఏమీ మాట్లాడలేదు, దగ్గరలో చచ్చిపడి ఉన్న పామును తీసి మహర్షి మెడలో వేశాడు. ధ్యానంలో ఉన్న శమీక మహర్షికదేమీ పట్టలేదు. ఆయన ధ్యానంలో మునిగి ఉన్నాడు. పరీక్షిత్తు వెళ్లిపోయాడు.

## ఋషి వాణి యొక్క చమత్కారం

శృంగి ఋషి తిరిగి వచ్చి తండ్రి మెడలో చచ్చిన పామును చూచాడు. పరీక్షిత్తు తండ్రిని అవమానించినట్లు తెలుసుకున్నాడు. బాగా కోపం వచ్చింది. కనులెర్రజేసి చేతిలో నీళ్లు తీసుకుని, ఈ చనిపోయిన సర్పము బ్రతుకుగాక అని నీరు చల్లగా, ఆ సర్పం బ్రతికింది. మిత్రులారా! మీకు వాక్శక్తిని గురించి తెలియజేస్తున్నాను. వాక్కు యొక్క చమత్కారాన్ని తెలియజేస్తున్నాను. సర్పం లేచి నిలచింది. దానితో శృంగి అన్నాడు, చూడు, నా తండ్రిగారిని అవమానించిన వాడెవడో, వాడెక్కడున్నా సరే, ఆకాశంలో ఉన్నా, నేలమీద ఉన్నా ఒకవారం రోజులలో వాడిని హతమార్చమని పోయి తక్షక నాగునితో చెప్పు. వాడు జైలులో ఉన్నాడో, పాతాళంలో ఉన్నాడో, ఇనుప పంజరంలో ఉన్నాడో, ఎక్కడున్నాడో నాకేమి తెలియదు. కాని ఆ తక్షకుడెక్కడున్నా, ఈ ద్రోహిని వెదకి పట్టుకోవాలి. ఎన్ని అడ్డుగోడలు ఉన్నా, వాడిమీద దాడి జరిపి హతం చేయాలి.

పరీక్షిన్మహారాజును వెతుక్కుంటూ తక్షక నాగు బయలుదేరాడు. సర్పంలో శక్తి ఉన్నదా? లేదు. మరణించిన సర్పాన్ని బ్రతికించి పంపిన వాక్కులో ఆ శక్తి ఉన్నది. అది శృంగి ఋషిశక్తి. సర్పం కదలిపోయిందా? లేదు సర్పంకాదు. అది ఏనాడో మరణించింది. అది ఎలా బ్రతికింది? ఎలా పరుగులు పెట్టింది? శృంగి శాపం చచ్చినపాము కళేబరంలో చేరింది. అది పరిక్షిత్తు వంకకు కదలింది.

## మంత్రమే శబ్ద భేది బాణం

శమీక మహర్షి కనులు తెరిచాడు. అంతా గమనించి అనర్థం జరిగిందని బాధపడ్డాడు. పరీక్షిత్తు అజ్ఞాని కావచ్చుగాని మా పుత్రుడు ఆవిధంగా చేసి ఉండవలసిందిగాదు. జరిగిందేదో జరిగిపోయింది. శబ్ద భేది బాణం వదలబడింది. అది లక్ష్యం వైపు దూసుకుపోతున్నది. మధ్యలో దానినెవరాపగలుగుతారు? అది ఆగదు, దానినెవరూ ఆపలేరు. శృంగి ఋషిశాపాన్ని ఎవరూ ఆపలేరు? ఇప్పుడేమి చేయాలి? శమీక మహర్షి పరీక్షిన్మహారాజుకు కబురు చేశాడు. "బాబూ, నీకు ఒక వారం గడువున్నది. నీ ప్రాణాన్నెవరూ

నిజాయితీని దహిస్తుంది ద్వేషాగ్ని - గుండెలను కాల్చేస్తుంది క్రోధాగ్ని.

నిలుపలేరు. కాని ఈ మిగిలిన ఏడురోజుల కాలాన్ని సార్థకం చేసుకోటానికి ప్రయత్నించు. అది చాలా మంచిది." అని పరీక్షిత్తుకు సందేశం అందింది. వారంరోజుల్లో అతడు మృతుడవుతాడు. దాన్నెవరూ ఆపలేరు.

మిత్రులారా! ఇక్కడ తక్షకుడు బయలుదేరాడు. పరీక్షిత్తుకు కొంత సమయమున్నది. ఇప్పుడేమి చేయాలని ఆలోచించాడు. ఇక్కడ ఒక కొత్త అధ్యాయం ప్రారంభమవుతున్నది. పాత అధ్యాయం పూర్తయింది. ఎవరికి? శృంగి ఋషికి. మంత్రమనిదేన్ని పిలుస్తారు? ఋషి వాక్కునుండి వెలువడిన వచనం మంత్రమవుతుంది. మంత్ర నిర్మాణం గురించి ఆలోచించవద్దు. శబ్దముల గుచ్ఛమే మంత్రం. శబ్దములు గుచ్ఛమేలాగవుతాయి? ఈ విధంగా. ఉదాహరణకు "ఓం ఐం హ్రీం క్లీం చాముండాయై విచ్చే" ఇది ఎలాగయింది? శబ్దముల గుచ్ఛమైంది. సంస్కృతంలోనే శబ్దాలను, మంత్రాలను చదువవసరం లేదు. ఇతర దేశాలలో మంత్రాలను సంస్కృతంలో చదవరు. దేశభాషలోనే వారి మంత్రాలుంటాయి. క్రైస్తవులకు సంస్కృత భాషలో మంత్రాలు లేవు. వారు ఇంగ్లీషులో మంత్రాలు చదువుతారు. జపానులో సంస్కృతం మాట్లాడరు. జపానువారు గూడా మంత్ర సాధన చేస్తారు. వారి మంత్రాలు ఏ భాషలో ఉంటాయి? జాపనీస్ భాషలో ఉంటాయి. అదే విధంగా ముస్లింలకు సంస్కృతం తెలియరు. ముసల్మానీ దేశాలలో గూడా మంత్రాలున్నాయి, కాని సంస్కృత భాషలోకాదు, మరే భాషలో? ముసల్మానీ భాషలో అరబీ ఫార్సీలలో ఉంటాయి.

## మంత్రం వెలువడుతుంది తపః పూతమైన వాణి నుండి

శబ్దముల కూర్పు, మంత్రాల శక్తి, మంత్రోచ్చారణల ప్రభావమేమిటి? అది మంత్రోచ్చారణ శక్తిగాదు. మీరెందుకు తెలుసుకోరు? ఋషి నోటినుండి వెలువడిన ఏ శబ్దమైనా అది మంత్రమై పోతుంది. అది సంస్కృతమైతేనేమి? అరబీ అయితేనేమి? జాపనీలోనైతేనేమి? ఇంగ్లీషులోనైతేనేమి? భాషతో దీనికి సంబంధం లేదు. మీరు కేవలం భాషను అర్థం చేసుకుంటున్నారు. శబ్దంలో పొరపాటు దొర్లినా, ఉచ్చారణలో దోషం కలిగినా, మాత్ర తప్పినా పట్టించుకుంటున్నారు. బాబూ! మంత్రం మాత్రమీద ఆధారపడి లేదు. వాల్మీకి శబ్దాల దృష్టిలో సరియైన ఉచ్చారణ చేయలేదు. నారద మహర్షి ఆయనకు "రామ" నామాన్ని నేర్పారు. ఆయన సరిగా 'రామ' నామాన్ని ఉచ్చారణ చేయలేకపోయినాడు. వాల్మీకి మరా, మరా అని జపించటం మొదలు పెట్టారు. ఉచ్చారణ గల్లంతయింది. మరా, మరా, రామ రామ అవుతుందా? అవును బాబూ రామ, రామ అవుతుంది. ఇది పిల్లలకు గూడా తెలుసు. కాని ఆయన తిరగవేసి చదివారు. ఆయన తిరగవేసి చదివిన అక్షరాల జపం గూడా సార్థకమైంది. ఎందువల్ల? అవి ఋషి వాణి నుండి వెలువడి వచ్చాయి గాబట్టి. ఋషి వాణి నుండి వెలువడినవి కాకపోతే అది పరిహాసమవుతుంది. ఎగతాళవుతుంది.

రామ నామం, నారాయణ నామం ఉపదేశం పొందితే ముక్తి కలుగుతుందా? సోదరా, ముక్తి లభించదు. మేము చిన్న క్లాసుల్లో చదువుతున్నాము. ఐదో తరగతనుకుంటా. మేమందరం ఒక పుస్తకం చదివాం. అందులో బైరాగియానులే కథ వస్తుంది. బాగా గుర్తులేదు ఏ పుస్తకమో. సాధువులవేషం వేసుకుని కొందరు దొంగలు నారాయణ భజన చేస్తున్నారు. ప్రజలందరూ వారితో గొంతు కలిసి భజన చేశారు. మీరు గూడా శబ్ద ప్రధానంగా జపం చేస్తానంటే ఆ దొంగలు చేసినట్లే చేస్తారు. శబ్దానికి ప్రాధాన్యత నీయకండి! శబ్దాల్లో మహత్వం చూడకండి. మాపై దయ చూపండి!

## రామ నామం వల్ల ముక్తి

బాబూ! రామనామం స్వీకరించటంవల్ల ముక్తి కలుగుతుందా? ముక్తి కలుగవచ్చు, కలుగకపోవచ్చు. రామ మంత్రం తీసుకోటంవల్ల నరకానికి గూడా పోవచ్చు! ఏవిధంగా? ఇప్పుడు మీకు బైరాగి యానాలా దొంగల కథను మరలా నివేదిస్తున్నాను. మీరు గూడా భజనలు చేస్తూ లోకులను తప్పుదారి పట్టించండి. జైలులో పెట్టించండి. దోపిడీలు చేయండి. రామనామమేమి చేస్తుంది? అప్పుడు రామనామం మీకు ప్రమాదకరమవుతుంది? అప్పుడు రామనామంతో ముక్తిరాదు. కాని, రామనామంతో చాలా మందికి ముక్తి లభించింది. ఎవరెవరికి ముక్తి కలిగింది? పరమ దుర్మార్గులకు గూడా ముక్తి కలిగింది, అంటారా? సరే అటువంటి వారి పేర్లు నాకు చెప్పండి. కేవలం నామోచ్చారణతో, శబ్దోచ్చారణతో అది రామనామం కావచ్చు, గాయత్రీ మంత్రం కావచ్చు! ఆ శబ్దాలను పలికినంత మాత్రాన ఎవరు బాగుపడ్డారు? ఎవరికి మంచి జరిగింది? ఒకటి రెండు పేర్లు చెప్పండి చాలు. ఎందుకు చెప్పలేము? కావలసినన్ని చెప్పగలం వినండి, గణిక, గ్రద్ధ, అజామీళుడు, కసాయి వాడు. వీరందరూ రామనామాన్ని స్వీకరించారు, ఉద్ధరింపబడినారు. సరేనయ్యా! మీ మాటలు నేనంగీకరిస్తున్నాను, కాని ఒక మాటకు జవాబు చెప్పండి! అప్పుడు మీ మాటలు పూర్తి అవుతాయి. లేకపోతే పూర్తి కావు !

*(తరువాయి వచ్చే సంచికలో)*

★★★

**సహజత్వం, సరళత్వం నీలోఉంటే - సౌఖ్యం, సౌభాగ్యం నీవెంటే.**

ఆచరణలో అధ్యాత్మ

# బహుళార్థ సాధకం-ఉదారత

**ఉన్నతమైన స్వార్థానికి మారుపేరు పరమార్థం.** మూఢులైతే పరమార్థం వల్ల మనకు నష్టం కలుగుతుందనీ, ఇతరులు లాభపడతారనీ భావిస్తారు. నిజంగానైతే- పరమార్థం వల్ల ఇరు పక్షాలవారూ లాభపడతారు. అది గ్రహించటానికి లోతైన దృష్టి కావాలి.

పరమార్థం కోసం మనం చేసిన చిన్నపనైనా సరే అనేక రెట్లు లాభిస్తుంది. దీనికి ప్రత్యక్ష ఉదాహరణ "విత్తనం". ఒక విత్తనాన్ని నాటినట్లైతే మొలక అంకురిస్తుంది. నీరు పోసి పెంచినట్లైతే వృక్షమౌతుంది. కొద్ది రోజుల్లోనే పూలు, పండ్లు విస్తారంగా వస్తాయి. ఆ ఫలాల ద్వారా వందలాది విత్తనాలు లభిస్తాయి. మరల వాటిని నాటినట్లైతే, వేలు, లక్షలు వచ్చేస్తాయి. ఆ ఒక్క విత్తనం నాటటానికి మనం వెనకడుగువేసినట్లైతే ఎంత నష్టమో ఆలోచించుకోవచ్చు. కొంతకాలానికి పురుగు పట్టి ఆ విత్తనం డొల్ల అయిపోతుంది.

పరోపకార బుద్ధివల్ల వ్యక్తియొక్క వ్యక్తిత్వం ఉన్నతి చెందుతుంది. ఉదారత వల్ల ప్రభావితులై సజ్జనులతో సహవాసం ఏర్పడుతుంది. సజ్జన సహవాసం సత్ఫలితాల నిస్తుంది. సత్కీర్తి దక్కుతుంది. పరోపకారి, చరిత్రపురుషుడౌతాడు.

నిస్వార్థసేవలు చేయాలంటే విశాల హృదయం కావాలి. పరుల దుఃఖాన్ని చూచి దుఃఖించేవాడు, పరుల సుఖాన్ని చూచి సంతసించేవాడు పరోపకారి అవుతాడు. ఉదారత వల్ల వారి కష్ట సుఖాలలో పాలుపంచుకుంటాడు. అవసరమైతే తన సౌకర్యాలను కూడ కొంతవరకు తగ్గించుకుంటాడు. సందర్భానుసారంగా తన జ్ఞానాన్ని, సమయాన్ని, సాధనాలను, శ్రమను ఇతరుల కోసం ఉపయోగిస్తాడు. దాని ఫలితాన్ని వారితోపాటు తానుకూడ తనకు తెలియకుండానే అనుభవిస్తాడు.

ఒక్కొక్కసారి ఆర్థికపరమైన సహకారం చేయవలసి వస్తుంది. కొంత డబ్బును ఖర్చుచేయడం జరుగుతుంది. కాని మనం వెచ్చించిన ప్రతిపైసా అనేకరెట్లు సద్భావనలను మోసుకువస్తుంది.

ఉదారత చూపలేనివాడు స్వార్థపరుడౌతాడు. అతనికి తన లాభమే ముఖ్యంగా కనబడుతుంది. తన లోభత్వం వల్ల అవతలి వ్యక్తికి కలిగే నష్టాన్ని అంచనావేయలేకపోతాడు. తరువాత ఆతని దుస్థితిని చూచి ఎంత పశ్చాత్తాపబడినా ప్రయోజన ముండదు.

"పాత్రతెరిగి దానం" అన్న నానుడి మిక్కిలి ఆచరణయోగ్యమైనది. దీనికి చక్కని ఉదాహరణ భస్మాసురుని కథ. మంటలో కాలిపోతున్న తేలుకు వేలందిస్తే చెయ్యంతా చెడకుట్టిందట. అపాత్రులకు సహకరిస్తే ఒక్కొక్కసారి మనకు ముప్పు వాటిల్లుతుంది. కనుక పరోపకారం కూడ బాగా ఆలోచించి చేయవలసి ఉంటుంది.

ఉదారతవల్ల కలిగే నష్టంకన్నా లాభమే ఎక్కువ. సహాయం పొందినవారి కళ్లలో వెలిగే కృతజ్ఞతాభావం మన ఆత్మవిశ్వాసాన్ని, ఆత్మ సంతృప్తిని ఇబ్బడి ముబ్బడి చేస్తుంది. వ్యక్తిత్వ వికాసం జరుగుతుంది. ఉదారతను ఎప్పుడూ నష్టంగా భావించరాదు.

"పరోపకారార్థమిదం సర్వం"

★★★

## యుగశక్తి గాయత్రి పాఠకులకు ప్రత్యేక విన్నపం

పరమపూజ్య గురుదేవుల అమృతతుల్యమైన జ్ఞాన భాండాగారాన్ని ఆత్మీయ పరిజనులకు అందించే ఉద్దేశ్యంతో 'యుగశక్తి గాయత్రి' మాసపత్రికను ప్రారంభించడం జరిగింది. ఏ విధమైన ప్రకటనలు లేకుండా పత్రిక పరిజనుల సహాయసహకారాలతోనే నడుస్తున్న విషయం మీకందరికీ తెలిసిందే. పెరుగుతున్న ధరల దృష్యా శాంతికుంజ్-హరిద్వార్ వారి ఆదేశానుసారం క్రింది విధంగా చందారేట్లను పెంచడానికి నిర్ణయించడం జరిగింది. పాఠకులు అవగాహనాదృష్టితో 1-1-2009 నుండి నూతన రేట్లను వసూలు చేసి పంపగలందులకై కోరుచున్నాము. అందరు కలసి మోస్తే భారంకాదు. ఈ జ్ఞానామృతధారలను అందరిచేత పానం చేయించే ప్రయత్నం చేద్దాం.

విడిప్రతి రూ॥ 10-00
సంవత్సరం చందా రూ॥ 110-00
3 సంవత్సరముల చందా రూ॥ 310-00
10 సంవత్సరముల చందా రూ॥ 1050-00
విదేశాలకు 1 సంవత్సరం చందా రూ॥ 1000-00

మీ సోదరుడు
**అశ్వినీ సుబ్బారావు**
సంయోజక్

**అవసరాలు తీర్చుకునే పోరాటంలో - ఆత్మ పతనం కూడదన్న ఆరాటం.**

సద్గురులీలామృతం

# వారొక అద్వితీయ శక్తిపాతము

సహజంగా అనేకమంది ఆత్మకల్యాణంకోసం గురుదేవుల పాదాలను ఆశ్రయిస్తుంటారు. కాని నేను మాత్రం పెద్ద కష్టంలో ఆయన కొంగు పట్టుకొన్నాను. ఆయన ప్రేమతో దగ్గరకు తీసుకున్నారు.

ఐ.ఎ.ఎస్. చదువుతూఉన్నాను. అనుకోని విధంగా మానసికంగా దెబ్బతిన్నాను. పరీక్ష వ్రాయలేకపోయాను. పూర్తిగా ధైర్యాన్ని కోల్పోయాను. మనసులో ఏదో తెలియని అశాంతి. ఏదో ఉద్వేగం. ఏదో నిరాశ. ఏదో వైకల్యం. క్షణ క్షణానికీ ఆత్మహత్య చేసుకోవాలన్న కోరిక పెరిగిపోతోంది. నిద్రాహారాలు లేవు. చిక్కి శల్యమైపోయాను. ఒకసారి ఒక జ్యోతిష్యుడు చెయ్యి చూసి "నీ జీవన రేఖ తెగిపోయింది. అకాలమరణం వస్తుంది." అని చెప్పాడు. ఎటు చూచినా మృత్యుదేవతయే కనిపించసాగింది.

శ్రీరామనందన్ ప్రసాదసింహ్ గురుదేవుల ప్రస్తావించారు. ధైర్యం చెప్పారు. ఆయనే నా పరిస్థితిని వివరిస్తూ లేఖ వ్రాశారు. వెంటనే జవాబు వచ్చింది. చాలా చాలా ధైర్యం చెపుతూ వ్రాశారు. తొందరలోనే కోలుకుంటావని అభయమిచ్చారు. ఆ జాబు చదువుకున్నాను. చిత్రంగా మరుక్షణం నుండి మనసులో ఓదార్పు, శరీరంలో మార్పు రాసాగాయి. చూస్తుండగానే పూర్తిగా కోలుకున్నాను.

మా ఇద్దరి మధ్య పత్రవ్యవహారం నడుస్తూనే ఉంది. నేను మరల చదువులో ప్రవేశించాను. బి.ఎ. ఆనర్స్ బి.టి. మంచి మార్కులతో పాసయ్యాను. ఉపాధ్యాయులు ఎంతో మెచ్చుకున్నారు. మొదట్లో 60 రూపాయల వేతనంమీద ప్రయివేటు పాఠశాలలో టీచరుగా చేరాను. గురుదేవుల అనుగ్రహంతో ఇప్పుడు నెలకు 650 రూపాయలు పొందుతూ మెజిస్ట్రేటును అయ్యాను.

1954లో ఆ రోజును నేను మరిచిపోలేను. ప్రొద్దున్నే పూజలో కూర్చున్నాను. హఠాత్తుగా అతి విచిత్రమైన అద్భుతమైన, అలౌకికమైన అనుభూతి కలిగింది. నా శరీరంలో రోమ రోమం వింత ప్రకాశంతో నిండిపోయాయి. గురుదేవులు ప్రకాశరూపంలో నా రోమ రంధ్రాలగుండా నాలో ప్రవేశించిన అనుభూతి కలిగింది. నాకు తెలియకుండానే వెక్కిళ్లుపెట్టి ఏడవడం మొదలుపెట్టాను. ఏడుస్తూనే ఉన్నాను. హర్షావేశంతో కన్నీరు ధారాపాతంగా కారిపోతోంది. దాదాపు రెండు గంటలసేపు అలాగే కారిపోయింది. ఆనాటినుండి నన్ను నేను గురుదేవులకు అర్పించుకున్నాను. వారొక అద్వితీయ శక్తిపాతం.

దేవవ్రత ప్రసాద్ శ్రీవాత్సవ,
ముజఫ్ఫర్‌పూర్.

# మరువలేని అనుభూతులు

గురుదేవులతో నాకున్న కొద్దిపాటి పరిచయం ఘనిష్ఠ సంబంధాన్ని ఏర్పాటుచేసింది. చిట్టచివరకు వారు అన్ని విషయాలలో మార్గదర్శకులే అయ్యారు. ఒకసారి మధురవెళ్లాను. ప్రేమతో నా తలపై చేయిపెట్టి ఆజ్ఞాచక్రాన్ని మేలుకొల్పారు. లోలోపల ఏదో దివ్య ప్రకాశం ప్రసరిస్తూ ఉన్నట్లు కన్నులముందు కదలాడింది. గట్టిగా కన్నులు మూసుకున్నాను. ఆ ప్రకాశాన్ని తనివితీరా చూస్తూ ఉండిపోయాను. అప్పుడు కలిగిన ఆనందానుభూతిని మాటల్లో వివరించలేను. ఆ స్థితి చాలాకాలం నా హృదయంలో చెరగని ముద్రవేసింది. గురుదేవుల స్పర్శ నా రోమ రోమాన్ని పరవశింపచేసింది. నిద్రావస్థలోకూడా మరిచిపోలేకపోయాను. అరమోడ్పుకన్నులతో కూర్చుంటేచాలు వారి రూపం ప్రత్యక్షమయ్యేది. నిద్రరాక బాధ పడుతూఉంటే వారి దివ్యహస్తం ప్రశాంతంగా నిదురపుచ్చేది. ఒకసారి ఆర్థిక ఇబ్బందులు చుట్టుముట్టాయి. నిరాశతో ఉండిపోయాను. వారి అమృతహస్తం అభయమిచ్చింది. "భయపడకు. నేను చూచుకుంటాను." అంతే. అనుకోనిసంఘటనతో నా జీతం నాలుగురెట్లు పెరిగిపోయింది. నా ఇబ్బందులన్నీ పటాపంచలయ్యాయి.

ఒకసారి ఏలాటి సూచన ఇవ్వకుండానే మధురకు వెళ్లాను. నేను వెళ్లేసరికి రాత్రి పది గంటలయ్యింది. గురుదేవులు 8 గంటలకే నిద్రపోతారు. అది నాకు తెలుసు. కాని నేను ఆ రోజు వెళ్లేసరికి వారు దర్వాజాలో నిలబడి ఉన్నారు. వెళ్లీ వెళ్లగానే– "నీ కోసమే ఎదురుచూస్తున్నాను. వెళ్లు. లోపల నీకోసం భోజనం సిద్ధంగా ఉంది. ప్రక్కగదిలో పడక కూడా సిద్ధంగా ఉంది. తిని విశ్రాంతి తీసుకో. రేపు మాట్లాడుకుందాం." అంటూ లోనికి వెళ్లిపోయారు.

ఇప్పటికీ నా మనసులో అది జవాబులేని ప్రశ్నలాగే మిగిలిపోయింది. "నేను వస్తున్నట్లు వారికెలాతెలిసింది?"

కన్హైలాల్ మిశ్రా
జయపూర్.

**సుఖ దుఃఖాలు రెండూ ఒకటే - బ్రతుకు నాణేనికి బొమ్మా బొరుసు.**

వార్తలు

# రాష్ట్రంలో నిర్వహించిన గాయత్రీ మహాయజ్ఞాలు

## లింగంపల్లిలో

1-9-2008 కరీంనగర్ జిల్లా వేములవాడ మండలం, లింగంపల్లి గ్రామంలో త్రిమూర్తి మందిరంలో పంచకుండీ గాయత్రి మహాయజ్ఞం డా॥ పులి సత్యనారాయణ గారు నిర్వహించారు. స్థానిక పరివార్ సభ్యులు పరుశురాం, చంద్రారెడ్డి, ఆది రాములు, ఆది గంగయ్య సహకరించారు.

## అచ్చాపురంలో

11-9-2008 ధర్మారం మండలం, అచ్చాపురంలో గణేష్ ఉత్సవ సందర్భమున పంచకుండీ గాయత్రి యజ్ఞం డా॥ పులి సత్యనారాయణ నిర్వహించారు. స్థానిక కార్యకర్తలు అడిశర్ల రామయ్య, జింగిలి లచ్చయ్య, నరసింహారెడ్డి గార్లు సహకరించారు.

## వేములవాడలో

30-9-2008 వేములవాడ బ్రహ్మం గారి దేవాలయంలో వేములవాడ గాయత్రి పరివార్ నిర్వహణలో సాధకులు 9 రోజులు అఖండదీప సమ్ముఖంలో అఖండజపం, పూర్ణాహుతిగా పంచకుండీ గాయత్రి మహాయజ్ఞం నిర్వహించారు. సుమారు 100 మంది యజ్ఞంలో పాల్గొన్నారు. స్థానిక కార్యకర్తలు పులి లక్ష్మి, మనోహర్, అరుణ, అంజవ్వ, డా॥ లంబాద్రి, జనని, ముదిరాజు సహకరించారు.

## సిరిసిల్లలో

సిరిసిల్ల, పద్మానగర్ హనుమాన్ మందిరంలో 30-9-2008 నుండి 8-10-2008 గాయత్రి లఘు అనుష్టానం, పూర్ణాహుతిగా పంచకుండీ గాయత్రి మహాయజ్ఞం డా॥ పులి సత్యనారాయణ నిర్వహించారు. స్థానిక కార్యకర్తలు రాజయ్య, చిరంజీవి, శశాంక్‌రాజు, సత్యనారాయణ, గణేష్, విజయ పంతులు సహకరించారు.

## చావలిలో నవకుండీ గాయత్రి మహాయజ్ఞం

3-11-2008 కార్తీక సోమవారం, చావలి గ్రామం, వేమూరి మండలం (తెనాలి)లో స్థానిక శివాలయం నందు నవకుండీ గాయత్రి యజ్ఞం బంగాని వీరాంజనేయులు, స్వర్ణ పుల్లయ్య గారి ఆధ్వర్యంలో వేమూరి నిర్మల, రంగనాయకులు బ్రహ్మాజి గార్ల సహకారంతో నిర్వహించబడింది. సుమారు 200 మంది కార్యక్రమంలో పాల్గొన్నారు. 600 రూపాయల సాహిత్య విక్రయం జరిగింది.

## నంబూరులో

6-11-2008 గోకులాష్టమి సందర్భంగా స్థానిక నాగవరప్పమ్మ దేవాలయం నందు గోపూజ పంచకుండీ గాయత్రి మహాయజ్ఞం జరిగింది. దీనిని నాగిరెడ్డి, పిచ్చిరెడ్డి, దర్గారెడ్డి గార్ల ఆధ్వర్యంలో రంగనాయకులు బ్రహ్మారెడ్డి గార్లు నిర్వహించారు. 200 మంది భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## కొత్తగూడెంలో

6-10-2008 విద్యా విస్తరణలో భాగంగా కొత్తగూడెం, పాండురంగ భజన మందిరం నందు పంచకుండీ గాయత్రి మహాయజ్ఞం శ్రీ సతీష్ ఖండేల్వాల్, సత్యనారాయణ, కృష్ణకుమారి, సరోజిని, లక్ష్మీ తదితరులు నిర్వహించారు. శ్రీమతి జి. రమాదేవి తిరుపతి తిరుమల దేవస్థానం జిల్లా ధార్మిక మండలి సభ్యురాలు, పూజారి శ్రీ వేదుల రామచంద్రమూర్తి సహకరించారు. డా॥ తుమ్మారి గారు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఇల్లెందులో

గాయత్రి పరివార్ పట్టణ కన్వీనర్ తోట నాగభూషణం, కో కన్వీనర్ ఎస్.వి. పరబ్, మహిళా కన్వీనర్ మన్నం కృష్ణకుమారి మరియు ఇతర సభ్యులు 140 గృహాలలో క్రాంతిధర్మీ సాహిత్యాన్ని అందించాలనే సంకల్పం తీసుకున్నారు.

భద్రాచలంలో 'కల్యాణమస్తు' కార్యక్రమాన్ని జరిపించి తిరుపతికి తిరిగివెళ్తూ టి.టి.డి కార్యదర్శి డా॥ చిలకపాటి విజయరాఘవాచార్యులు ఇల్లెందుకు విచ్చేశారు. అచ్చట గాయత్రీ పరివార్ జ్ఞానకేంద్రాన్ని దర్శించి చాల సంతసించారు. జిల్లా ప్రముఖ్ సతీశ్ ఖండేల్‌వాల్ క్రాంతిధర్మీ సాహిత్యాన్ని వారికి బహూకరించారు. ఖమ్మం జిల్లా ఇల్లెందు శాఖ వారు పరివార్ కార్యక్రమాలతో పాటు వివిధ సమాజసేవాకార్యక్రమాలకు కూడ ప్రాధన్యతను ఇస్తున్న విషయం మనకందరికీ తెలిసిందే.

**వినటానికైతే? చురుకుదనం - వినిపించడానికో? కావాలి కరుకుదనం.**

## పిడుగురాళ్ళలో

10-9-2008 పిడుగురాళ్ల గాయత్రి మండలి వ్యవస్థాపకురాలు బొంతు అరుణమ్మ గారి సంవత్సరీకం సందర్భమున గాయత్రి యజ్ఞం శ్రీ సుబ్బారెడ్డి నిర్వహించారు.

దేవి నవరాత్రులు సందర్భంగా సామూహిక గాయత్రి అనుష్ఠానం జరిగింది. 11 మంది సాధకులు రోజు 27 మాలల గాయత్రి జపం చేసి పంచకుండీ గాయత్రి యజ్ఞం పూర్ణాహుతిగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అక్షరాభ్యాసం, జన్మదిన సంస్కారం, వివాహదిన సంస్కారం, మంత్ర దీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పి. అరుణా చౌదరి సారధ్యంలో శ్రీ జూలకంటి సుబ్రమణ్యం నిర్వహించారు.

## తిరుపతిలో

19-9-2008 తిరుపతిలో దేవస్థానముల హిందూ ధర్మ ప్రచార సమితి రాష్ట్రస్థాయి కార్యక్రమంలో శ్రీ అశ్విని సుబ్బారావు (కోర్డినేటర్ సౌత్ ఇండియా) పాల్గొన్నారు. గాయత్రి పరివార్ కార్యక్రమాలపై ముఖ్యంగా గాయత్రి మంత్రం, యజ్ఞం, భారతీయ సంస్కృతి ప్రచారం, సాహిత్యాలపై ఉపన్యసించారు. శ్రీ సతీష్ ఖండేల్‌వాల్ కూడా హాజరయ్యారు. శ్రీ అశ్విని సుబ్బారావు గారు క్రాంతిధర్మీ సాహిత్యమును టి.టి.డి. ఎక్సిక్యూటివ్ ఆఫీసర్ శ్రీ ఎ.వి. రమణాచారి గారికి బహుకరించారు. పరమపూజ్య గురుదేవుల జన్మదిన సందర్భంగా శ్రీమతి మునిలక్ష్మి ప్రోత్సాహంతో ప్రముఖ ఆయుర్వేద డాక్టర్ శ్రీ ఏల్చూరి వెంకట్రావుచేత ఆయుర్వేద శిబిరం నిర్వహింపబడింది. వందలాది పరిజనులు ఫలితాన్ని పొందారు.

## మాచర్లలో

26-10-2008 మాచర్ల రామాలయం నందు నవకుండీ గాయత్రి మహాయజ్ఞం కాళంగి నాగేశ్వరరావు, శ్రీ రామకృష్ణ గారి ఆధ్వర్యంలో నిర్వహించబడింది. శ్రీ రంగనాయకులు, శ్రీ నాగమణి ప్రసాద్, సుబ్రమణ్యం, సుందరమూర్తి బ్రహ్మాజి గార్లు ఈ కార్యక్రమానికి సహకరించారు. సుమారు 150 మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సుమారు 1500 రూపాయల సాహిత్య విక్రయం జరిగింది. ★★★

**గౌరవనీయులైన సోదర సోదరీమణులకు నమస్కారములు,**

గాయత్రీపరివార్‌కు సామాజిక బాధ్యతలు పెరిగిపోతున్నాయి. మహాకాలుని సంకల్పాన్ని అనుసరిస్తూ నిర్వహించాలంటే మన అందరి సంగఠితశక్తి దృఢంగా ఉండాలి. అలా కొనసాగాలంటే సువ్యవస్థితంగా మనం ముందుకుసాగాలి. శాంతికుంజ్-హరిద్వార్ వారి ఆదేశానుసారం ప్రతీ జిల్లాలో ఏరోజు ఎక్కడ సమావేశం జరపాలో నిర్ణయించడంజరిగింది. ఈ విషయం 'యుగశక్తి గాయత్రి' నవంబరు మాసపత్రికలోని 47వ పేజీలో ప్రకటించడం జరిగింది. దానికి సంబంధించిన సవరణలతో పంపిన పత్రాలుకూడ చేరే ఉంటాయి.

ఈ సమావేశములు అత్యంత ముఖ్యమైనవి. ఉపయోగకరమైనవి. జిల్లాలోని పరిజనులందరు (స్త్రీ-పురుషులు) భాగస్వాములను చేయడానికై శక్తివంచన లేకుండ ప్రయత్నం చేయాల్సి ఉంటుంది. సమావేశస్థలాన్ని వెంటనే నిర్ణయించుకోవలసి ఉంటుంది. పరిజనులందరికీ ఈ సూచనను అందించవలసి ఉంటుంది. జిల్లా స్థాయి కార్యకర్తలను తీసికొనిరావాలి. వచ్చేవారికి ఉదయం అల్పాహారం, మధ్యాహ్నభోజనం, సాయంకాలం టీ వ్యవస్థను చెయ్యాలి. డా॥ బ్రిజ్‌మోహన్ గౌడ్ నేతృత్వంలో డా॥ శ్రీరామకృష్ణ గార్లతో కలసి సుమారు ఆర్గురు వ్యక్తులు వచ్చుచున్నారు. వారికొరకు ప్రతిరోజూ వసతి, భోజన(రోటి) సౌకర్యాలను ఏర్పాటుచేయాలి.

అక్కడ జరుగుతున్న ప్రచారవిషయాలను, చేస్తున్న వ్యవస్థను ఎప్పటికప్పుడు తెలియచేస్తూ ఉండాలి. ఫోను చేయడానికి సంకోచించనవసరంలేదు.

మీరందరూ సుఖశాంతులతో వర్ధిల్లాలని కోరుకుంటూ

మీ సోదరుడు
**అశ్వినీ సుబ్బారావు**
సంయోజక్

కలహాన్ని హరించేది మౌనం - కల్మషాన్ని హరించేది ధ్యానం.